ప్రజాశక్తి

సిటీ

ప్రతి అక్షరం ప్రజల పక్షం

fb/prajasakti
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajamahendravaram, Srikakulam, ongole and Ananthapuramu
www.prajasakti.com

సంపుటి : 37 సంచిక : 227 | విజయవాడ, గురువారం 17 ఆగస్టు 2017 | 12 + 12 పేజీలు వెల : 4.00



నిర్వాసితులను అరెస్టు చేస్తున్న పోలీసులు

రక్తమోడిన వంశధార

- నిర్వాసితులపై పోలీసుల లాఠీఛార్జి
- ఒకరి పరిస్థితి విషమం
- 40 మంది అరెస్టు

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి, హిరమండలం

వంశధార రిజర్వాయర్ నిర్మాణ ప్రాంతంలో బుధవారం నిర్వాసితుల రక్తం చిందింది. శ్రీకాకుళం జిల్లా హిరమండలంలోని తులగాం రెవెన్యూ పరిధిలోని పంట పొలాలను యంత్రాలతో అధికారులు చదును చేయిస్తున్న సమయంలో అడ్డుకున్న నిర్వాసితులపై పోలీసులు అత్యంత పాశవికంగా లాఠీఛార్జి చేశారు. దీంతో పలువురుకి తీవ్రగాయాల య్యాయి. వారిలో పాడలి గ్రామానికి చెందిన పోలూరు శ్రీనివాసరావుకు పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు సమాచారం. బాధితులకు వైద్యమందించకపోగా పోలీసులు వారిని అరెస్టు చేసి జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు.

పాడలి, దుగ్గపురం గ్రామాల పంట పొలాల్లోని మట్టి తవ్వకాలకు అధికారులు భారీ యంత్రాలను తీసుకొచ్చారు. పోలీసు బందోబస్తు మధ్య పనులకు ఉపక్రమించారు. ఈ విషయం తెలుసుకున్న ఆ గ్రామాల నిర్వాసితులు సుమారు 200 మంది అక్కడికి చేరుకున్నారు. పంటపొలాల్లో మట్టి తవ్వొద్దని వేడుకున్నా.. అధికారులు మట్టి తవ్వకం మిగతా 9లో

నేర రహిత ఏపి

- పోలీసులందరికీ గృహాలు
- పోలీస్ హెడ్‌క్వార్టర్స్ ప్రారంభోత్సవ సభలో సిఎం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రాన్ని జీరో పర్సెంట్ క్రైమ్‌తో నేర రహితంగా తయారు చేయడమే పోలీసు అధికారులు లక్ష్యంగా నిర్దేశించుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించారు. గుంటూరు జిల్లా మంగళగిరి ఎపిఎస్‌పి బెటాలియన్‌లో నిర్మించిన పోలీస్ హెడ్ క్వార్టర్స్ భవనాన్ని బుధవారం సిఎం ప్రారంభించారు. అనంతరం డిజిపి ఎన్ సాంబశివరావు అయిదు అంతస్తుల ఈ భవనాన్ని ముఖ్యమంత్రికి స్వయంగా చూపించారు. అంతస్తుల వారీగా ఉండే విభాగాల గురించి ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ భవన నిర్మాణంపై చంద్రబాబు పూర్తి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రకృతి మధ్య, ఆహ్లాదకర వాతావరణంలో వద్దన్నా సిబ్బంది విధులకు వచ్చేట్లు ఈ నిర్మాణముందని ప్రశంసించారు. కార్పొరేట్ కార్యాలయాలకు దీటుగా నిర్మించిన రాష్ట్ర పోలీస్ హెడ్ క్వార్టర్స్ భవనాన్ని చూస్తుంటే కబ్జా చేసి, ఇక్కడే ఉండాలనిపిస్తోందని చమత్కరించారు. పోలీస్ సిబ్బందికి ఫిజికల్ ఫిట్‌నెస్ ముఖ్యమని, అంతా ఎక్స్‌ట్రా స్మార్ట్‌గా తయారు కావాలని సిఎం సూచించారు. పోలీసుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. పోలీసులందరికీ ఇళ్లు కట్టిస్తామన్నారు. పోలీసులు కాకుండా పోలీసింగ్ కనిపించాలన్నారు. అప్పుడే ప్రజల్లో గౌరవం, సంఘ విద్రోహ శక్తులకు భయం ఏర్పడతాయన్నారు.

ఆకట్టుకున్న ఆక్టోపస్ విన్యాసాలు

రాష్ట్రానికి చెందిన ఆక్టోపస్, గ్రేహౌండ్స్ దళాలు దేశంలోనే నెంబర్-1 అని సిఎం చంద్రబాబు కితాబిచ్చారు. ఈ ప్రారంభోత్సవ సందర్భంగా ఆక్టోపస్ దళాలు చేసిన విన్యాసాలు అలరించాయి. శత్రువుల దాడులు, కిడ్నాప్ నుంచి విఐపిలను, ప్రజలను విడిపించేందుకు ఆక్టోపస్ సిబ్బంది అనుసరించే పద్ధతులు ఆకట్టుకున్నాయి. ఐదంతస్తుల భవనంపై నుంచి తలకిందులుగా దిగడం, పాక్కుంటూ వెళ్లడం వంటివి ప్రదర్శించారు. శత్రువుల సమాచారాన్ని సేకరించే నార్వే దేశానికి చెందిన బ్లాక్ హార్నెట్ అనే 8.5 గ్రాముల డ్రోన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ర్యాంబో, టైగర్, చీటాలనే పోలీస్ జాగిలాల విన్యాసాలూ ఆకట్టుకున్నాయి. రక్షణ చర్యల్లో భాగంగా ఆక్టోపస్ సిబ్బంది చేసిన బంగీ జంప్, డోగో రోబోట్ ఎటాక్‌లను అంతా ఆసక్తిగా తిలకించారు. విన్యాసాల్లో పాల్గొన్న సిబ్బందిని మిగతా 9లో



గుంటూరు జిల్లా మంగళగిరి ఎపిఎస్‌పి బెటాలియన్‌లో నిర్మించిన పోలీస్ హెడ్ క్వార్టర్స్ భవనాన్ని ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

మీ సేవ
www.meesevaap.in

మీ- సేవకు కొత్తగా 21 సేవలు

- కంపెనీలు ప్రారంభించకుంటే భూములు వెనక్కి తీసుకోండి
- స్టార్టప్‌లను ప్రోత్సహించండి
- ఐటి మంత్రి లోకేష్ ఆదేశాలు

2



ఆర్టికల్ 35ఎ పై విచారణకు ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం

8

ఇక ధరాఘాతమే

- మరింత పెరగనున్న ద్రవ్యోల్బణం
- మోర్గన్ స్టాన్లీ రిపోర్టు

6

రాష్ట్రాల హక్కులపై దాడి

- త్రిపుర సిఎం మాణిక్ సర్కార్ ప్రసంగం ప్రసారాన్ని నిలిపివేయడంపై సిపిఎం ఆగ్రహం
- ఎమర్జెన్సీ కంటే దారుణమైన పరిస్థితులు
- సమాఖ్య స్ఫూర్తికి విఘాతం
- మీడియా సమావేశంలో సీతారాం ఏచూరి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాష్ట్రాల హక్కులపై కేంద్ర ప్రభుత్వం దాడి చేస్తోందని సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ధ్వజమెత్తారు. భారత రాజ్యాంగం ప్రకారం సంక్రమించే హక్కులకు భంగం వాటిల్లుతోందని, వాక్ స్వాతంత్ర్యం ప్రమాదంలో పడిందని, ప్రజల సార్వభౌమాధికారాన్ని తుంగలో తొక్కే ప్రయత్నం జరుగుతోందని మండిపడ్డారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా త్రిపుర ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్ ప్రసంగాన్ని ఆలిండియా రేడియో, దూరదర్శన్(ప్రసార భారతి)లో



ప్రసారం చేయక పోవడాన్ని ఏచూరి తీవ్రంగా ఖండించారు. ప్రజల ఓట్లతో ఎన్నికైన ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రసంగాన్ని ప్రసారం కాకుండా నిలిపేయడం ఎమర్జెన్సీ రోజులను తలపిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. త్రిపుర సిఎంకు ప్రసార భారతి లేఖ పంపిన తీరును ఖండించారు. బుధవారం ఆయన పార్టీ కేంద్ర కార్యాలయం(ఎకెజి భవన్)లో మీడియాతో మాట్లాడుతూ, స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో త్రిపుర సీఎం చేసే ప్రసంగాన్ని దూరదర్శన్ ముందుగానే రికార్డు చేసినా దాన్ని ప్రసారం చేయలేదని, పైగా ఆ ప్రసంగాన్ని మార్చుకోవాలని సూచించడం ఇందిరా గాంధీ కాలం నాటి ఎమర్జెన్సీ పరిస్థితులు కన్నా దారుణంగా ఉందని అన్నారు. ప్రజల చేత ఎన్నికైన ముఖ్యమంత్రి ప్రసంగాన్ని ప్రసారం చేయకపోవడం అప్రకటిత ఎమర్జెన్సీని తలపిస్తోందని, రాష్ట్రాల హక్కులపై కేంద్రం ఎందుకు జోక్యం చేసుకుంటోందని ప్రశ్నించారు. రాజ్యాంగంలో పొందుపరిచిన సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా కేంద్రం వ్యవహరిస్తోందని, బిజెపి యేతర రాష్ట్రాలపై కేంద్రం పెత్తనం చేస్తోందని, నియంతృత్వ పోకడతో వ్యవహరిస్తోందని మండిపడ్డారు. విజయదశమి సందర్భంగా ఆరెస్సెస్ ఛీఫ్ ప్రసంగాన్ని దూరదర్శన్‌లో ఎలా ప్రసారం చేశారని ప్రశ్నిస్తూ, బిజెపి, ఆరెస్సెస్ నేతల మీడియా సమావేశాలను దూరదర్శన్, ఆల్ ఇండియా రేడియో ప్రత్యక్ష ప్రసారం చేస్తాయి కానీ ప్రజల ద్వారా ఎన్నికైన నాయకుల ప్రసంగాల ప్రసారంపై మాత్రం ఆంక్షలు విధిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. భారత్‌ను హిందూత్వ దేశంగా మార్చేందుకు బిజెపి కేంద్రం ప్రభుత్వ వ్యవస్థలను ఉపయోగించుకొంటోందని ధ్వజమెత్తారు. "ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ప్రసంగంపై మాకు కూడా చాలా అభ్యంతరాలున్నాయి. నోట్ల రద్దు ద్వారా ఎంత డబ్బు వచ్చిందో ప్రధాని ఎందుకు చెప్పలేదు? 8 నెలలైనా ఎంత మేర పాత నోట్లు జమ అయ్యాయో ప్రభుత్వం ఎందుకు చెప్పలేకపోయింది? కశ్మీర్ సమస్యను మిగతా 9లో

అనుకున్నదే జరిగింది !

- రోహిత్ కేసులో అందరికీ ఏకసభ్య కమిషన్ క్లీన్ చిట్
- వ్యక్తిగత కారణాలతోనే ఆత్మహత్య చేసుకున్నట్లు నివేదన

ప్రజాశక్తి - న్యూఢిల్లీ బ్యూరో

హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో కాషాయ మతోన్మాదుల ఉద్దేశపూర్వక అవమానాలతో మనసునొచ్చుకొని ఆత్మ'హత్య' చేసుకున్న రోహిత్ వేముల కేసుపై దర్యాప్తు సాగించిన ఏకసభ్య కమిటీ కేంద్ర ప్రభుత్వ కనుసన్నల్లో, దాని దిశానిర్దేశాలకు అనుగుణంగానే నివేదిక రూపొందించినట్లు కనిపిస్తోంది. రోహిత్ వేముల బలవన్మరణానికి కేంద్ర మంత్రులు స్మృతి ఇరానీ, బండారు దత్తాత్రేయ, విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ అప్పారావు కారణమంటూ ఆరోపణలు వెల్లువెత్తినా వారందరికీ ఏకసభ్య కమిటీ క్లీన్ చిట్ ఇవ్వడం పలు అనుమానాలకు మిగతా 9లో

వాగులో ఇద్దరు యువతుల మృతదేహాలు

- హత్యగా అనుమానిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-అమరావతి

అనుమానాస్పద స్థితిలో ఇద్దరు యువతులు మృతిచెందిన సంఘటన గుంటూరు జిల్లా అమరావతిలో బుధవారం వెలుగు చూసింది. మృతులు అమరావతికి చెందిన మస్కా లక్ష్మీ(25), బత్తుల ఫణి(18)గా గుర్తించారు. సేకరించిన వివరాల ప్రకారం.. గుంటూరు జిల్లా అమరావతి సమీపంలోని నరుకుళ్లపాడు వాగు సమీపంలో వాగు కల్వర్టు కింద రెండు మృతదేహాలను అటుగా వెళ్తున్న స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. అమరావతి సిఐ మురళీకృష్ణ, ఎస్ఐలు రహంతుల్లా, నరశింహారావు ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాలను వెలికి తీయించారు. స్థానికులు మృతులను గుర్తించడంతో సమాచారాన్ని బంధువులకు అందించారు. మృతికి గల కారణాలు



తెలియరావడం లేదు. మృతుల తలపై బలమైన గాయాలు ఉన్న దృష్ట్యా హత్యగా భావిస్తున్నారు. మృతదేహాలకు అమరావతి ఆస్పత్రిలోనే పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. మృతుల బంధువుల నుండి అనుమానితుల వివరాలు సేకరించిన పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

81 లక్షల ఆధార్ కార్డుల రద్దు



ముంబయి: రేషన్ నుంచి సబ్సిడీ వరకూ అన్ని ప్రభుత్వాలకు అనుసంధానమైన ఆధార్ సంఖ్యల్లో కొన్నింటిని ప్రభుత్వం డియాక్టివేట్ చేసింది. సుమారు 81 లక్షల ఆధార్ సంఖ్యలను డియాక్టివేట్ చేసినట్లు ప్రభుత్వం శుక్రవారం పార్లమెంటుకు తెలిపింది. ఆధార్ జీవిత చక్ర నిర్వహణ (ఎఎల్‌సిఎం) మార్గదర్శకాలను అనుసరించి బోగస్, మనుగడలో లేని ఆధార్ సంఖ్యలను నిలిపివేసినట్లు కేంద్ర మంత్రి పిపి చౌదురి వివరించారు. ప్రస్తుతం మన ఆధార్ సంఖ్య మనుగడలో ఉందా? లేదా? అనే అంశం తెలుసుకునేందుకు యుఐడిఎఐ వెబ్‌సైట్ https://uidai.gov.in లో లాగిన్ అవ్వాలి. అందులో ఆధార్ సర్వీసెస్ ట్యాబ్ కింద 'వెరిఫై ఆధార్ నంబర్' అనే ఆప్షన్‌పై క్లిక్ చేయాలి. అప్పుడు ఓ నోటిఫికేషన్ పాప్ అవుతుంది. 'ఓకె' అనే ఆప్షన్‌ను క్లిక్ చేస్తే కొత్త పేజీ ఓపెన్ అవుతుంది. దీనిలో రెండు ఖాళీ బాక్సులు ప్రత్యక్షమౌతాయి. మొదటి బాక్సులో ఆధార్ సంఖ్య, రెండో బాక్సులో ఆ పక్కనే ఇచ్చిన సెక్యూరిటీ కోడ్‌ను ఎంటర్ చేయాలి. దీంతో మరో పేజీ ఓపెన్ అవుతుంది. అందులో పరీక్షిస్తున్న ఆధార్ సంఖ్య మనుగడలో ఉందా, లేదా? అనే అంశాన్ని వివరించే వివరాలు స్క్రీన్‌పై ప్రత్యక్షమౌతాయి. ఆధార్ మనుగడలో ఉంటే పచ్చని రంగులో 'రైట్' అని వస్తుంది. అక్కడ వ్యక్తి వయసు, ఫోన్ నెంబర్ రిజిస్టర్ అయి ఉంటే చివరి మూడు అంకెలు కనిపిస్తాయి. రాష్ట్రం పేరు కూడా కనిపిస్తుంది.

ఓటు తూటాతో కాల్చేయండి

- నంద్యాల ఉప ఎన్నికల ప్రచారంలో బాలకృష్ణ



నంద్యాల ఉపఎన్నికల ప్రచారంలో అభివాదం చేస్తున్న బాలయ్య

ప్రజాశక్తి - నంద్యాల

రాష్ట్రంలో అభివృద్ధి నిరోధకులను ఓటుతూటాతో కాల్చేయండని హిందూపురం ఎమ్మెల్యే, సినీనటుడు నందమూరి బాలకృష్ణ అన్నారు. శిల్పా సోదరులు టిడిపికి ద్రోహం చేశారని విమర్శించారు. నంద్యాల ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం ఆయన నంద్యాలలో పర్యటించిన బాలయ్యకు వెంకటేశ్వరపురం వద్ద మంత్రులు అఖిలప్రియ, అమరనాథరెడ్డి, టిడిపి అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి ఘన స్వాగతం పలుకు తూ గజ మాలతో సత్కరిం చారు. అనంత రం బొమ్మలసత్రం, నూనెపల్లె జంక్షన్‌ల వద్ద ప్రజలనుద్దేశించి బాలయ్య మాట్లాడారు. ప్రజా సేవ చేస్తామని శిల్పా సోదరులు టిడిపిలోకి వస్తే జిల్లా అధ్యక్ష పదవి, ఎమ్మెల్సీగా చక్రపాణిరెడ్డికి మిగతా 9లో

ఒక్క ఇంటినైనా కట్టించారా..?

వైసిపి అధినేత వైఎస్ జగన్

ప్రజాశక్తి-నంద్యాలక్రైం

రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాలన చేపట్టి మూడున్నరేళ్లవుతున్నా నంద్యాల ప్రజలకు ఒక్క ఇంటినైనా కట్టించారా అంటూ వైసిపి అధినేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రశ్నించారు. నంద్యాలలో జగన్ రోడ్‌షో బుధవారానికి 8వ రోజుకు చేరుకుంది. పివి.నగర్, చింత అరుగు, మాలదార్‌పేట, జగత్ జననీ టెంపుల్ మీదుగా ఆత్మకూరు బస్టాండ్ వరకు సాగిన రోడ్‌షోలో వృద్ధులు, మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. జగన్‌ను పూలతో స్వాగతం మిగతా 9లో



ప్రజ్ఞ

1. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఏ ముఖ్యమంత్రి ప్రసంగాన్ని దూరదర్శన్ ప్రసారం చేయలేదు?
2. ప్రపంచ వ్యాప్తంగా యువకులను ఆత్మహత్యలు చేసుకొనేలా రెచ్చగొడుతున్న ఆన్‌లైన్ క్రీడ ఏది?
3. దక్షిణ కొరియాలో అమెరికా ఏర్పాటు చేసిన క్షిపణి రక్షణ వ్యవస్థ ఏది?
4. చదరంగంలో పునరాగామనం చేసిన నాటి దిగ్గజం ఎవరు?
5. ఇందిర క్యాంటీన్ పథకానికి శ్రీకారం చుట్టిన రాష్ట్రం ఏది?

సమాధానాలు 7లో

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.
94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.
అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి దినపత్రిక,
ఎంబి విజ్ఞానకేంద్రం, డోర్.నెం.27-30-4,
గవర్నరుపేట, విజయవాడ-520002కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

వాతావరణం



బలంగా రుతుపవనాలు

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

రుతుపవనాలు బలంగా ఉన్నాయని, ఫలితంగా ఎపిలో పలుచోట్ల భారీ వర్షాలు పడే అవకాశముందని విశాఖ వాతావరణశాఖ అధికారులు తెలిపారు. అల్పపీడన ద్రోణి పశ్చిమ మధ్య బంగాళాఖాతం నుంచి రాయలసీమ మీదుగా కోస్తాంధ్రపై ఉందని, దీని ప్రభావంతో దక్షిణాదిలో ఇప్పటికే వర్షాలు పడుతున్నాయని తెలిపారు.

ఒబామా ట్వీట్‌ను 30లక్షల మంది ఇష్టపడ్డారు!

వాషింగ్టన్: అమెరికాలో శ్వేతజాతి, మరో గ్రూపు మధ్య వివక్ష పెరిగిపోతుంది. ఈనెల 12న వర్జీనియా రాష్ట్రంలోని చార్లొట్స్‌విల్లేలో జరిగిన ర్యాలీ హింసాత్మకంగా మారిన సంగతి తెలిసిందే. దీనిపై అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా సామాజిక మాధ్యమంలో పోస్ట్ చేసిన ట్వీట్ ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. ఒబామాకు ప్రజాధరణ ఏమాత్రం తగ్గలేదు. సోషల్ మీడియాలో ఆయన పోస్టులకు భారీ స్పందన లభిస్తోంది. చార్లొట్స్‌విల్లే నగరంలో ఇటీవల జరిగిన దాడులపై స్పందిస్తూ ఒబామా పెట్టిన ట్వీట్‌ను బుధవారం నాటికి 30లక్షల మంది నెటిజన్లు ట్వీట్ చేశారు. "పుట్టేటప్పుడు ఎవరూ ఇతరులను ద్వేషిస్తూ జన్మించలేదు.

చర్మం రంగు, నేపథ్యం, మతాన్ని బట్టి వివక్ష చూపించడం పుట్టుకతో వచ్చినది కాదు.." అని వ్యాఖ్యానించారు. దక్షిణాఫ్రికా జాతిపిత నెల్సన్ మండేలా జీవితచరిత్ర 'లాంగ్ వాక్ టు ఫ్రీడమ్' నుంచి ఆయన ఈ మాటలను కోట్ చేశారు. మనుషుల మధ్య ఉండాల్సింది విద్వేషం కాదని, ప్రేమని బోధిస్తున్న వాక్యాలను మూడు ట్వీట్లుగా పెట్టారు. మేరీల్యాండ్‌లో 2011లో తీసిన ఫొటోను మొదటి ట్వీట్‌లో పోస్ట్ చేశారు. దీనికి 28 లక్షల పైచిలుకు లైకులు వచ్చాయి. 11 లక్షలకు పైగా రీట్వీట్ చేశారు. ఒబామా ట్వీట్‌కు 46 వేల మందిపైగా జవాబిచ్చారు. ట్విట్టర్ చరిత్రలో అత్యధిక మంది ఇష్టపడిన ట్వీట్‌గా ఇది రికార్డుకెక్కింది.

మీ - సేవకు కొత్తగా 21 సేవలు

- కంపెనీలు ప్రారంభించకుంటే భూములు వెనక్కి తీసుకోండి
- స్టార్టప్‌లను ప్రోత్సహించండి
- ఐటి మంత్రి లోకేష్ ఆదేశాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మీ-సేవలో నూతనంగా 21 కొత్త సేవలను అదనంగా చేర్చనున్నట్లు ఐటి శాఖ మంత్రి లోకేష్ వెల్లడించారు. రాష్ట్రంలోని 12,920 గ్రామాల్లో త్వరలోనే మీ-సేవా కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఇ-ప్రగతి, ఐటి, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్, ఎపి ఇన్నోవేషన్ సొసైటీ, ఎపిఐఐసి అధికారులతో బుధవారం ఆయన సమీక్షా సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ ఇ-ప్రగతి కోర్ ప్లాట్‌ఫామ్‌ను త్వరగా ఏర్పాటు చేయాలన్నారు. దీనికి సంబంధించిన సర్టిఫికేషన్ ప్రోగ్రాంలో ఎక్కువ మంది ప్రభుత్వోద్యోగులు పాల్గొనేలా అవగాహన కల్పించాలని కోరారు. ప్రభుత్వ రుణ మార్పిడి విధానంపై ఇ-ప్రగతి రూపొందించిన ఆధునాతన సాఫ్ట్‌వేర్‌ను త్వరలోనే సిఎం చంద్రబాబుకు వివరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. దేవాలయాల నిర్వహణకు కొత్తగా రూపొందించిన విధానాన్ని త్వరలో వినియోగించాలన్నారు. ఇంక్యుబేషన్ సెంటర్లలోని స్టార్టప్ కంపెనీలు గ్లోబల్ లీడర్స్‌గా ఎదిగేందుకు అవసరమైన మౌలిక వసతులు, ప్రొడక్షన్ స్పేస్ కల్పించాలన్నారు. విశాఖపట్నంలో ఫింటెక్ వ్యాలీ నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలన్నారు. అనంతపురంలో నిర్మిస్తున్న ఇంక్యుబేషన్ సెంటర్, తిరుపతిలో నిర్మిస్తున్న ఐటి బిజినెస్ సెంటర్, విశాఖ నిర్మిస్తున్న మిలీనియం టవర్స్ పనుల గురించి మంత్రి అడిగి తెలుసుకున్నారు. కాపులపాడ ఐటి టౌన్ షిప్, మంగళగిరి ఐటి స్పేస్‌లో మౌలిక వసతుల కల్పన త్వరగా పూర్తి చేయాలన్నారు. భూములు తీసుకొని ఏళ్లు గడుస్తున్నా పనులు ప్రారంభించని కంపెనీలకు కేటాయింపులు రద్దు చేసి, ఆయా భూములను స్వాధీనం చేసుకోవాలని ఎపిఐఐసి అధికారులను ఆదేశించారు. ఇన్నోవేటివ్ ఆలోచనలను అభివృద్ధి చేయడంలో భాగంగా ఐదు స్టార్టప్ కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకున్నామని ఈ సందర్భంగా అధికారులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఇ- ప్రగతి సిఇఒ బాల సుబ్రహ్మణ్యం, ఐటి సెక్రెటరీ విజయానంద్, ఎపిఐఐసి ఎండి బాబు తదితర అధికారులు పాల్గొన్నారు.

మంత్రి వెంటనే క్షమాపణలు చెప్పాలి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి మధు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

దళితులపై మంత్రి ఆదినారాయణరెడ్డి చేసిన వ్యాఖలను వామపక్షాలు సహా పలు పార్టీలు, సంఘాలు తీవ్రంగా ఖండించాయి. ఆయన్ని మంత్రి పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ బుధవారం ప్రకటనలు వెల్లువెత్తాయి. దళితులను అవమానించేలా రాష్ట్ర మార్కెటింగ్ శాఖ మంత్రి ఆదినారాయణరెడ్డి చేసిన వ్యాఖ్యలను సిపిఎం రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. వెంటనే మంత్రి దళితులకు క్షమాపణ చెప్పాలని బుధవారం ఒక ప్రకటనలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు డిమాండ్ చేశారు. దళితులు శుభ్రంగా ఉండరని, వారికి చదువులు రావని, రిజర్వేషన్లు దళితులకు కొనసాగించడం అనవసరమని మంత్రి హోదాలో ఉన్న ఆదినారాయణరెడ్డి చేసిన వ్యాఖ్యలపై వెంటనే ముఖ్యమంత్రి స్పందించాలన్నారు. లేకుంటే మంత్రి వ్యాఖ్యలు తెలుగుదేశం వైఖరిగా పరిగణించాల్సి వస్తుందని హెచ్చరించారు. రాజ్యాంగంపై ప్రమాణం చేసిన బాధ్యతల్లో ఉన్న మంత్రిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలన్నారు.

దళితులపై దాడులు పెరిగాయి..

దేశ స్వాతంత్ర్య దినోత్సవం రోజున దళితులను కించపరుస్తూ వ్యాఖ్యలు చేసిన ఆదినారాయణరెడ్డిని మంత్రి



పదవి నుంచి తొలగించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆయనొక ప్రకటన విడుదల చేశారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత దళితులపై దాడులు పెరిగాయన్నారు. రాష్ట్రంలో టిడిపి దళిత వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందన్నారు. మంత్రుల స్థాయిలో ఉండి ఎస్సీ, ఎస్టీలను చిన్నచూపు చూస్తూ వ్యాఖ్యలు చేయడం వారి చిత్తశుద్ధిని తెలుపుతోందన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా గరగపర్రుల్లో దళిత కుటుంబాలను వెలి వేయడం, ప్రకాశం జిల్లా దేవరపల్లిలో నీరు-చెట్టు కార్యక్రమానికి దళిత భూములను లాక్కోవడం, కృష్ణాజిల్లా దొండపాడులో దళితులపై దాడులు, కర్నూలు జిల్లా చిరుమూన్‌దొడ్డిలో దేవాలయ ప్రవేశం నిషేధం వంటివి దళితులకు పాలకుల పట్ల ఉన్న వివక్షతకు నిదర్శనాలని ఆయన వివరించారు. మంత్రి ఆదినారాయణరెడ్డి వెంటనే దళితులకు క్షమాపణ చెప్పాలన్నారు. చంద్రబాబుకు దళితుల అభ్యున్నతి పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా ఆదినారాయణరెడ్డిని మంత్రి పదవి నుంచి తొలగించాలని రామకృష్ణ డిమాండ్ చేశారు.

సిఎంకు కెవిపిఎస్ లేఖ

దళితులపై వివక్ష పూరిత వ్యాఖ్యలు చేసిన రాష్ట్ర మార్కెటింగ్ శాఖా మాత్యులు సిహెచ్ ఆదినారాయణరెడ్డిని మంత్రి పదవి నుంచి తొలగించాలని కోరుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు బుధవారం లేఖ రాసినట్లు కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంద్ర మాల్యాద్రి ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో దళితులపై దాడులు, అత్యాచారాలు, సాంఘిక బహిష్కరణలు పెరిగిపోతున్నాయని, దళితుల భూములను బలవంతంగా లాక్కుంటున్నారని పేర్కొన్నారు. నష్టపరిహారం ఇచ్చే విషయంలోనూ ప్రభుత్వం వివక్ష చూపుతోందని తెలిపారు. దళితులకు దక్కాల్సిన నిధులను పక్కదారి పట్టిస్తున్నారని, రిజర్వేషన్లు సరిగా అమలు చేయడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు.

టిడిపితో దళితులకు అవమానాలే: పిసిసి ఎస్సీ సెల్

టిడిపితో దళితులకు నిత్యం అవమానాలే ఎదురవుతున్నాయని పిసిసి ఎస్సీ సెల్ చైర్మన్ కొరివి వినయ్‌కుమార్ ఒక ప్రకటనలో విమర్శించారు. దళితులకు చదువు రాదని, వారికి శుభ్రత తెలియదని మంత్రి ఆదినారాయణరెడ్డి వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. మంత్రి ఆదినారాయణరెడ్డిని తక్షణమే పదవి నుంచి తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. దళితులపై ఇటీవల దాడులు పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు.

విశాఖ భూఆక్రమణ కేసులో మరొకరు అరెస్టు

ప్రజాశక్తి - విశాఖ ప్రతినిధి

విశాఖ నగరంలోని భూఆక్రమణ కేసులో పోలీసులు బుధవారం మరొకరిని అరెస్ట్ చేశారు సిట్ అధికారులు. సర్వేయర్ గణేశ్వర్‌రావుకు సహకరించిన దామోదర్ చంద్రశేఖర్ కూడా అరెస్ట్ చేశారు. రూ.500 కోట్ల విలువైన భూముల రికార్డులను చంద్రశేఖర్ మార్చారని నిర్ధారించారు. చంద్రశేఖర్ పేరిట మధురవాడలో 2.5 ఎకరాలు ఉన్నట్లు గుర్తించారు.

ఆఫ్రికాలో మట్టిచరియలు విరిగిపడి 600 మంది అదృశ్యం

ఫ్రీటౌన్: ఆఫ్రికాలోని సియెర్రా లియోన్‌లో భారీ వరదల వల్ల మట్టిచరియలు విరిగిపడ్డాయి. ఈ ఘటనలో 600 మంది అదృశ్యమయ్యారు. దేశ రాజధాని ఫ్రీటౌన్ అస్తవ్యస్తంగా మారింది. మట్టిచరియల కింద చిక్కుకున్నవారిని రక్షించాలని ఆ దేశాధ్యక్షుడు ఎర్నెస్ట్ బాయ్ కొరోమా ప్రపంచ దేశాలను అభ్యర్థించారు. మట్టిచరియలు విరిగిపడిన ఘటనలో 400 మంది మృతిచెందినట్టు అధికారులు ధ్రువీకరించారు. గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు చేపట్టామని అన్నారు. రెడ్ క్రాస్ బృందాలు సహాయక చర్యల్లో పాల్గొన్నాయి.

స్మార్ట్ సిటీలో రెబెల్స్


- అధికార, ప్రతిపక్ష పార్టీలకు తప్పని బెడద

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల్లో అధికార తెలుగుదేశం, ప్రతిపక్ష వైసిపిలు రెండింటికీ రెబల్స్ బెడద తప్పడం లేదు. అధికార పార్టీలో బిజెపికి కేటాయించిన డివిజన్లల్లో టిడిపి అభ్యర్థులు పోటీలో స్వతంత్రులుగా ఉన్నారు. అంతేకాకుండా మరో మూడు డివిజనల్లో టిడిపికి రెబల్స్ పోటీలో ఉన్నారు. ప్రతిపక్ష వైసిపికి కూడా నాలుగు డివిజన్లలో రెబల్స్ దడ పుట్టిస్తున్నారు. చివరి వరకు ఈ రెండు పార్టీల ముఖ్య నేతలూ రెబల్స్‌ను పోటీ నుంచి విరమింపజేసేందుకు శత విధాలా ప్రయత్నించారు. అయినప్పటికీ రెబల్స్ నుంచి ముప్పు తప్పలేదు. కాకినాడ కార్పొరేషన్ ఎన్నికలు ఈనెల 29వ తేదీన జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో 48 డివిజన్లకు జరుగుతున్న ఎన్నికల్లో అధికార టిడిపి మిత్రపక్ష పార్టీ బిజెపికి 9 సీట్లు కేటాయించింది. మిగిలిన 39 డివిజన్లలో టిడిపి పోటీ చేస్తుంది. ప్రతిపక్ష పార్టీ వైసిపి 48 స్థానాల్లోనూ అభ్యర్థులను రంగంలోకి దించింది. బుధవారంతో నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసింది. ఈ ఎన్నికలకు అటు టిడిపి నుంచి 151 మంది, వైసిపి నుంచి 158 మంది నామినేషన్లు వేశారు. బిజెపి 34 డివిజన్లలో నామినేషన్లు వేసింది. వీరందరి నామినేషన్లు ఉపసంహరింపజేసేందుకు ఆ పార్టీలు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. స్వతంత్రులుగానూ, పార్టీ తరపున పోటీకి నామినేషన్లు అధికంగా వేయడంతో వారిని బుజ్జగించేందుకు చివరి వరకు మంత్రులు, ఎంఎల్‌ఎలు ప్రయత్నాలు చేశారు. అయినప్పటికీ ప్రధాన తెలుగుదేశం, వైసిపిలకు రెబల్స్ పోటీ పడుతున్నారు. తెలుగుదేశం బిజెపికి 9 సీట్లు కేటాయించింది. దీంతో ఆ డివిజన్లలో పోటీ చేయాలనుకున్న టిడిపి నాయకులు మూడు డివిజన్లలో పోటీలో ఉండిపోయారు. బిజెపికి కేటాయించిన 8, 35, 47 డివిజన్లలో టిడిపి నుంచి రెబల్స్ పోటీలో దిగారు. 47వ డివిజన్ నుంచి కొల్లాబత్తుల అప్పారావు చాలా కాలం నుంచి టిడిపిలో క్రియాశీలకంగా వ్యవహరిస్తూ వస్తున్నారు. ఆ డివిజన్‌ను బిజెపికి కేటాయించడంతో అప్పారావు స్వతంత్ర అభ్యర్థిగా పోటీలో ఉన్నారు. దేశం నేతలు ఎన్ని ప్రయత్నాలు చేసినా ఆయన పోటీ నుంచి తప్పుకోలేదు. ఇలా టిడిపి అభ్యర్థులు 3, 27, 28 డివిజన్లలో రెబల్స్ అభ్యర్థులుగా ఉన్నారు. తమకు సీటు వస్తుందని ఆశించి భంగపడిన అభ్యర్థులు అసంతృప్తి వ్యక్తం చేస్తూ స్వతంత్రులుగా పోటీ చేస్తున్నారు. అలాగే ప్రతిపక్ష వైసిపిలోనూ నాలుగు డివిజన్ల నుంచి రెబల్స్ పోటీలో ఉన్నారు. 2, 10, 29, 49 డివిజన్ల నుంచి రెబల్స్ పోటీ చేస్తున్నారు. తమకే చివరి వరకూ సీటు వస్తుందని భావించినా అన్యాయం చేశారంటూ వారు పోటీలో నిలబడ్డారు. వైసిపిలో రెండు గ్రూపులు ఉన్నందున వారి అనుచరులను పోటీకి దింపేశారు. ఇదిలాఉంటే వైసిపి నుంచి డమ్మీ అభ్యర్థులను కూడా రంగంలోకి దింపి ఇతర పార్టీల్లోని అభ్యర్థులను ఓడించేందుకు శత విధాలా ప్రయత్నాలు ప్రారంభించారు. దీంతో రెండు పార్టీలకు రెబల్స్ పోటీ అధికంగానే ఉండనుంది.

వైసిపికి గంగుల ప్రతాప్‌రెడ్డి గుడ్‌బై

- రోజుకో మలుపు తిరుగుతున్న నంద్యాల ఉపఎన్నిక పోరు
- తటస్థంగా జనసేన, ఎంఐఎంలు



ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

నంద్యాల ఉపఎన్నిక పోరు రోజుకో మలుపు తిరుగుతోంది. ఇటీవలే ఎమ్మెల్సీ శిల్పా చక్రపాణిరెడ్డి టిడిపికి, ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసి టిడిపికి షాక్ ఇచ్చాడు. ప్రస్తుతం మాజీ ఎంపి గంగుల ప్రతాప్‌రెడ్డి వైసిపిని వీడి బుధవారం టిడిపిలో చేరారు. గంగుల సుదీర్ఘకాలం పాటు ఆళ్లగడ్డ ఎమ్మెల్యేగా పనిచేశారు. పార్లమెంట్ సభ్యుడిగానూ, రాజ్యసభ సభ్యుడిగానూ నంద్యాల డివిజన్‌లో చక్రం తిప్పారు. నియోజకవర్గాల పునర్విభజనకు ముందు ఆళ్లగడ్డ నియోజకవర్గంలో ఉన్న గోస్పాడు మండలంలో ఆయనకు పెద్దఎత్తున అనుచరగణం ఉంది. మొదటి నుంచి వైసిపికి మంచి మెజారిటీ గోస్పాడు నుంచి వస్తుందని భావించిన టిడిపి మండలంలో బాగా పట్టు ఉన్న పిపి.నాగిరెడ్డిపై ఒత్తిడి పెంచారు. పిపి.నాగిరెడ్డిని టిడిపిలో చేర్చుకునేందుకు ఆయనకు ఆర్థికంగా ఇబ్బందులు సృష్టించినా శిల్పా వెంటే నిలిచేందుకు మొగ్గుచూపారు. దీంతో టిడిపి అధిష్టానం గంగుల ప్రతాప్‌రెడ్డిపై దృష్టి సారించింది. గంగులను టిడిపిలో చేర్పించేందుకు మాజీమంత్రి ఏరాసు ప్రతాప్‌రెడ్డి, అచ్చెన్నాయుడు కీలక పాత్ర పోషించినట్లు తెలిసింది. మరోవైపు జనసేన, ఎంఐఎంలు తాము ఏ పార్టీకి మద్దతు ఇవ్వలేదని, తమ పార్టీలు తటస్థంగా ఉన్నాయని ప్రకటించడం గమనార్హం. నంద్యాల ఉపఎన్నిక ప్రారంభం నుంచి నాయకుల కుప్పిగంతులు పోలింగ్ నాటికి ఏ రూపం దాల్చుతాయోనని నంద్యాలు ప్రజలు విసిగిపోతున్నారు.

టిడిపి వైఖరిపై బిజెపి గుస్సా

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

నంద్యాల ఉపఎన్నికలో బిజెపి టిడిపి తరపున ఎన్నికల ప్రచారం నిర్వహిస్తే ముస్లిములు ఓటు వేయరనే భయంతో టిడిపి నంద్యాల నాయకులు తమను ప్రచారానికి పిలవడం లేదని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు కపిలేశ్వరయ్య తెలిపారు. బుధవారం కర్నూలులో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నంద్యాల ఉపఎన్నికలపై జిల్లాలో ఒక పెద్ద చర్చ జరుగుతోందని, టిడిపితో పొత్తు ఉన్న బిజెపి కండువా, జెండా కనిపించడం లేదని, అతిథులను ఆహ్వానించాల్సిన బాధ్యత అక్కడి నాయకులదేనని ఆయన అన్నారు. గతంలో ఎమ్మెల్సీగా శిల్పా చక్రపాణిరెడ్డి పోటీ చేసినప్పుడు రాంభూపాల్‌రెడ్డికి ఫోన్ చేసి 'మీ పరిధిలోని సర్పంచులను ఓటు వేయమని చెప్పార'ని అన్నారు. నేడు ఎందుకు మొహమాటపడుతున్నారో అర్థం కావడం లేదన్నారు. విశాఖలో టిడిపి-బిజెపి కండువాతో వీధివీధినా ప్రచారం చేసి అక్కడి మంత్రులు, బిజెపి నాయకుడిని గెలిపించారని గుర్తు చేశారు. కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల్లో 9 కార్పొరేటర్ స్థానాలు బిజెపికి కేటాయించారని చెప్పారు. టిడిపి మా చిత్తశుద్ధిని శంకించాల్సిన అవసరం లేదన్నారు. ఈ సమావేశంలో బిజెపి మీడియా ఇన్‌ఛార్జి కె నరసింహావర్మ, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె హరీష్‌బాబు, రమేష్, డివి సుబ్బారెడ్డిలు పాల్గొన్నారు.

అర్చకుల జీతాల్లో కోత విధించడం సరికాదు

సిఎం చంద్రబాబుకు ఐవైఆర్ లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

దేవాలయాల్లో పనిచేసే అర్చకుల వేతనాల్లో కోత విధించడం పట్ల ఎపి బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ ఐవైఆర్ కృష్ణారావు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం సిఎం చంద్రబాబుకు లేఖ రాశారు. రూ.10 వేలు వేతనాన్ని రూ. 5 వేలకు తగ్గించడం సరికాదని ఆయన లేఖలో పేర్కొన్నారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు రూ.250 కోట్లతో ఫండ్ ఏర్పాటయ్యిందని, ఇతర ఆలయాల కంట్రిబ్యూషన్ కలిపితే రూ. 500 కోట్లు ఉన్నాయని గుర్తు చేశారు. ఆ నిధులతో అర్చకులకు నెలకు రూ. 10 వేల వేతనం ఇవ్వొచ్చని సూచించారు. చినజీయర్ స్వామి లాంటి ట్రస్టులు తమ అర్చకులకు నెలకు రూ. 20 వేలు ఇస్తున్నాయని ఆయన వివరించారు.

ఆరోపణల్లో వాస్తవం లేదు: వేమూరి ఆనంద సూర్య

బ్రాహ్మణులకు వేతనాలు తగ్గించారని ఐవైఆర్ కృష్ణారావు సిఎం చంద్రబాబుకు రాసిన లేఖలో వాస్తవం లేదని ఎపి బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ వేమూరి ఆనంద్ సూర్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒక సీనియర్ అధికారి ఇలాంటి సంకేతాలివ్వడం సమంజసం కాదన్నారు. ప్రభుత్వం అన్ని రంగాల్లో బ్రాహ్మణుల సంక్షేమానికి కృషి చేస్తోందన్నారు. ఆయన కాంగ్రెస్, వైసిపితో కలిసి ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. ఏ ఒక్కరికీ వేతనాలు తగ్గించడం లేదనే విషయాన్ని కమిషనర్ కూడా వివరించారన్నారు. బ్రాహ్మణ సంక్షేమానికి 2017-18 బడ్జెట్‌లో ప్రభుత్వం రూ.97 కోట్లు కేటాయించిందని, వారి కోసం 12 సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. ఎన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నా తమ రాజకీయ స్వార్థం కోసం ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారన్నారు.

నెల్లూరులో జాషువా విగ్రహం

సాంస్కృతిక శాఖ నిర్ణయం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నెల్లూరులోని కస్తూరిబా కళా క్షేత్రంలో పద్మభూషణ్ గుర్రం జాషువా విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని రాష్ట్ర సాంస్కృతిక శాఖ నిర్ణయించింది. ఈ మేరకు పర్యాటక, సాంస్కృతిక శాఖ కార్యదర్శి ముకేశ్ కుమార్ మీనా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విగ్రహ ఏర్పాటు కోసం రూ. ఐదు లక్షలు మంజూరు చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

పెన్షనర్లకూ కరవు భత్యం

2016 జూలై 1 నుంచి అమలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఉద్యోగులకు విడుదల చేసిన కరవు భత్యాన్ని పింఛనుదారులకు కూడా వర్తింపజేస్తూ బుధవారం ఆర్థిక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఉద్యోగులకు ఇస్తున్న మాదిరిగానే 22.008 శాతం డిఎను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించింది. ఇతర మార్గదర్శకాలు కూడా ఉద్యోగులకు మాదిరిగానే ఉంటాయని పేర్కొంది. పదవీ విరమణ చేసిన వారికి, మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు ఇచ్చే పింఛన్లకు కూడా ఈ డిఎ మార్గదర్శకాలు వర్తిస్తాయని వెల్లడించింది. దీన్ని 2016 జూలై ఒకటో తేదీ నుంచి అమలు చేయనున్నట్లు ఆర్థిక శాఖ పేర్కొంది.

వైద్య పర్యాటక కేంద్రంగా అమరావతి

- అన్ని పరిశోధనా కేంద్రాలూ ఇక్కడే
- ఐయుఐహెచ్ మెడిసిటీ శంకుస్థాపనలో సిఎం చంద్రబాబు
- అమరావతిలో 150 ఎకరాల స్థలం కేటాయింపు



విజయవాడలోని వెన్యూఫంక్షన్ హాలులో కింగ్స్ కాలేజ్ హాస్పటల్‌ను ప్రారంభించిన సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రానున్న రోజుల్లో రాజధాని అమరావతి వైద్య పర్యాటక కేంద్రం(మెడికల్ టూర్ హబ్)గా రూపుదిద్దుకోనుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. అమరావతిలో బుధవారం యునైటెడ్ కింగ్‌డమ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ (ఐయుఐహెచ్) మెడిసిటీ నిర్మాణానికి సిఎం శంకుస్థాపన చేశారు. అనంతరం విజయవాడలోని ఒక ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ యావత్ యూరోప్‌లోనే పేరు ప్రఖ్యాతులు కలిగిన వైద్య సంస్థ కింగ్స్ కాలేజీ హాస్పిటల్స్ అని అన్నారు. రెండు వందల సంవత్సరాల క్రితం దీన్ని బ్రిటన్‌లో ఏర్పాటు చేశారన్నారు. ప్రధాని మోడీ 2105లో బ్రిటన్ పర్యటన సందర్భంగా భారత దేశంలో 11 ప్రాంతాల్లో ఐయుఐహెచ్‌ను ఏర్పాటు చేయాలని ఇరు దేశాలూ అంగీకరించాయన్నారు. అమరావతి కూడా అందులో ఒకటన్నారు. అయితే ఈ సంస్థ ప్రధాన కార్యాలయంతో పాటు అన్ని రకాల పరిశోధనా కేంద్రాల్ని కూడా అమరావతిలో ఏర్పాటు చేస్తామంటేనే అమరావతిలో ఏర్పాటుకు అంగీకరిస్తామని ఐయుఐహెచ్ యాజమాన్యాన్ని కోరగా, అందుకు వారు అంగీకరించారన్నారు. దీని నిర్మాణానికి అమరావతిలో 150 ఎకరాల స్థలాన్ని కేటాయించామన్నారు. ఇది అత్యంత ప్రతిష్టాత్మక ప్రాజెక్టని, సుమారు రూ.17వేల కోట్ల వ్యయంతో దీనిని పూర్తి చేయనున్నారని తెలిపారు. కేన్సర్, లివర్ ప్లాంటేషన్, ఐబిఎమ్ సెంటర్‌తో పాటు సుమారు 4వేల రికార్డుల్ని భద్రపరిచే విధంగా ఏర్పాట్లు ఉంటాయన్నారు. వైద్య పరికరాల తయారీ విభాగాలను కూడా ఇక్కడే ఏర్పాటు చేస్తారన్నారు. వైద్య విద్యార్థులు పిజిల కోసం ఇతర దేశాలకు వెళ్లనవసరం లేకుండా ఇందులోనే అందుబాటులోకి తీసుకొస్తారన్నారు. యూరోప్ నుంచే కాకుండా ప్రపంచం నలుమూలల నుంచి వివిధ రకాల చికిత్సల కోసం అమరావతికే వస్తారని, వీరి కోసం ప్రత్యేకంగా స్టార్ హోటళ్లను కూడా నిర్మించనున్నారని, దీంతో అమరావతి వైద్య పర్యాటక ప్రదేశంగా ఆతిథ్యం ఇవ్వనుందన్నారు.

కింగ్స్ కాలేజీ హాస్పిటల్ పాటు అమృత, బిఆర్‌షెట్టి, ఎస్ఆర్ఎమ్, విట్ వంటి సుమారు 13 ప్రముఖ వైద్య కళాశాలలు అమరావతిలో ఏర్పాటు కానున్నాయన్నారు. ఎల్వీ ప్రసాద్ కంటి వైద్యశాలను కూడా ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు." మీ వద్ద నాలెడ్జ్ ఉంటే మా దగ్గర మార్కెట్ ఉంది.. దీనిని పూర్తి స్థాయిలో వినియోగించుకోండి" అని ఐయుఐహెచ్ యాజమాన్యానికి సిఎం సూచించారు. 2018, అక్టోబర్ 2 గాంధీ జయంతికల్లా మొదటి దశ ఆసుపత్రి నిర్మాణాన్ని పూర్తి చేయాలని కోరారు. కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి అనుప్రియ పాటిల్ మాట్లాడుతూ ఈ సంస్థ ఏర్పాటు చేయనున్న 11 విభాగాల్లో ఇది మొదటిదని, అమరావతిలో దీనిని ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. దీని వల్ల మెరుగైన వైద్యం ప్రజలకు అందుబాటులోకి వస్తుందన్నారు. ఈ సంస్థ హెడ్ క్వార్టర్స్ అన్నీ ఇక్కడే ఏర్పాటు చేయడం వల్ల వరల్డ్ క్లాస్ హెల్త్ కేర్ సిటీగా అమరావతి తయారవుతుందన్నారు. ఈ నిర్మాణాలకు కేంద్రం నుంచి అన్ని విధాలుగా సహాయసహకారం ఉంటుందన్నారు. కింగ్స్ కాలేజీ హాస్పిటల్ చైర్మన్ లార్డ్ రాబర్ట్ కెర్స్‌లేక్, ఐయుఐహెచ్ గ్రూపు ఎండి, సిఇవో డాక్టర్ అజయ్‌రాజ్ గుప్తా, బ్రిటన్ పార్లమెంట్ సభ్యులు అంద్రూ మిచెల్, మంత్రి కామినేని శ్రీనివాస్ ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ప్రత్తిపాటి పుల్లారావు, పి నారాయణ, ఎంపి కేశినేని నాని, సౌత్ ఇండియా బ్రిటన్ డిప్యూటీ హై కమిషనర్ భరత్ జోషి, సిఆర్‌డిఎ ముఖ్య కార్యదర్శి అజయ్ జైన్, కమిషనర్ శ్రీధర్, ఎడిబి సిఇవో కృష్ణ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

సభ నిర్వహణకు సిఆర్‌డిఎ భారీ ఏర్పాట్లు

శంకుస్థాపన సభ నిర్వహణ కోసం సిఆర్‌డిఎ అధికారులు, ఇండో-యుకె ప్రతినిధులు భారీ ఏర్పాట్లు చేశారు. భారీ స్క్రీన్‌లు, వందలాది కుర్చీలు సమకూర్చగా ప్రాంగణంలో మాత్రం ఎవరూ లేకపోవడంతో వెలవెలబోయింది. ప్రాంగణంలో మొత్తం వందమందికి మించి లేకపోవడం గమనార్హం. వారిలోనూ 50 మంది వరకు డ్వాక్రా మహిళలే ఉన్నారు. శంకుస్థాపన ప్రదేశానికి వెళ్లే రహదారి సైతం డొంక రోడ్డు కావడంతో బురదమయంగా మారింది. కార్యక్రమానికి వెళ్తున్న జడ్పీటీసీ ఆకుల జయసత్య కారు బురదలో కూరుకుపోవడంతో సిఆర్‌డిఎ ల్యాండ్స్ డైరెక్టర్ చెన్నకేశవరావుపై ఆమె ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు.

24,25 తేదీల్లో ఆకృతులు

- సెప్టెంబర్ 30న నిర్మాణ పనులు
- వారధి కూడలిలో బుద్ధ చక్ర
- ప్రభుత్వ కార్యాలయాల ప్లాను ఇస్తామన్న నార్మన్‌ఫోస్టర్స్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

శాసనసభ, ప్రభుత్వ భవనాల సముదాయానికి ప్రభుత్వ సూచనల మేరకు ఈ నెల 24, 25 తేదీల్లో ఆకృతులు అందించనున్నారు. దీంతోపాటు పరిపాలనా నగరానికి సంబంధించిన 400 పేజీల నివేదికనూ ప్రభుత్వానికి సమర్పించనున్నారు. బుధవారం రాత్రి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో ఫోస్టర్స్ ప్రతినిధులు వీడియో కాన్ఫరెన్స్‌లో చర్చించారు. సిఎం చేసిన సూచనల మేరకు శాసనసభను కోహినూర్ ఆకృతిలో, హైకోర్టు ఆకృతిని బౌద్ధస్థూపం ఆకారంలో మార్పులు చేర్పులు చేశామని ఫోస్టర్స్ ప్రతినిధి క్రిష్ సిఎంకు తెలిపారు. హైకోర్టు భవన నిర్మాణానికి వినియోగించాల్సిన వస్తువులు, నిర్మాణ సామాగ్రి గురించి సిఎంకు వివరించారు. ఇదే సమయంలో సిఎం మాట్లాడుతూ రాజధానిలో పోలీసు హెడ్ క్వార్టర్స్ గురించి ఫోస్టర్స్ ప్రతినిధులకు వివరించారు. ఆహ్లాదకర వాతావరణంలో పచ్చదనంతో వీటిని నిర్మించారని ప్రశంసించారు. రాజధానిలో నిర్మించే ప్రతి భవంతి ప్రత్యేకంగా ఉండాలని సూచించారు. తాము సూచించే ఆకృతుల్లో పరిమితులుంటే ముందుగానే చెప్పాలని, అలాగే కొన్ని ప్రత్యామ్నాయ ఆకృతులనూ తయారు చేసి పెట్టుకోవాలని సూచించారు. సెప్టెంబర్ 30న నిర్మాణ పనులు ప్రారంభించాల్సి ఉందని, ఈలోగా ఆకృతులు, నివేదికలు తయారయ్యేలా గడువు పెట్టుకున్నామని నిర్మాణ సంస్థ ప్రతినిధులకు తెలిపారు. వారధి కూడలిలో నిర్మించతలపెట్టిన బుద్ధచక్రపై అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సినీ ఆర్ట్ డైరెక్టర్ ఆనంద్‌సాయి ఆధ్వర్యంలో రూపొందించిన కొన్ని ఆకృతులను సమవేశంలో సమర్పించగా సిఎం ఆమోదించారు. 27 అడుగుల ఎత్తులో బుద్ధచక్రను రూపొందించనున్నారు. బేస్‌మెంట్‌తో కలుపుకుని మొత్తం 40 అడుగులు ఎత్తు ఉంటుందని వివరించారు. బుద్ధచక్ర మొత్తాన్ని శాండ్‌స్టోన్‌తో నిర్మించాలని నిర్ణయించారు. దీనికి తొమ్మిది కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశామని, 2018 జనవరి నాటికల్లా కట్టడాన్ని పూర్తి చేస్తామని ఎడిసి సిఎమ్‌డి లక్ష్మీపార్థసారధి సిఎంకు తెలిపారు. శాఖమూరులో నిర్మించదలుచుకున్న పార్కుకు ప్రహరీగోడ లేకుండా నిర్మించాలని సిఎం సూచించారు. రాజధానిలో చేపట్టబోయే ఈ నిర్మాణానికి ప్రహరీగోడ లేకుండా అందమైన ప్రవేశద్వారంతో రూపొందించాలని సూచించారు. రాజధానిలో ఐదు ఐకానిక్‌వారధులు రానున్నాయని సిఎం ఈ సందర్భంగా వెల్లడించారు. రాజధానికి ఇవే ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయని తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్‌శాఖ మంత్రి నారాయణ, సిఆర్‌డిఎ కార్యదర్శి అజయ్‌జైన్, ముఖ్యమంత్రి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సతీష్‌చంద్ర, అదనపు కార్యదర్శి ఎ.వి.రాజమౌళి పాల్గొన్నారు.

పంట కాలువల్లో విషగుళికలు..!

- సాగు, తాగునీరు కలుషితం - భారీగా నష్టపోతున్న రైతాంగం - పట్టించుకోని అధికార యంత్రాంగం



నెల్లూరు ఐస్ ఫ్యాక్టరీ లోపలి భాగం



పంట కాల్వల్లోకి వస్తున్న కలుషిత నీరు

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి/ఇందుకూరుపేట

ఆ ప్రాంతంలో పంట కాలువలు విషం చిమ్ముతున్నాయి. ఆక్వా ప్రాసెసింగ్ ఫ్యాక్టరీల నుంచి వెలువడుతున్న వ్యర్థాలు పంట పొలాలను సర్వనాశనం చేస్తున్నాయి. దీంతో అక్కడ నివసించే ప్రజలు రోగాలబారిన పడుతున్నారు. మూగజీవాలు సైతం ఆ విషవలయంలో చిక్కుకుని విలవిలలాడుతున్నాయి. వీటిని అరికట్టాల్సిన అధికార యంత్రాంగం మామూళ్ల మత్తుకు అలవాటు పడి వీటిని పట్టించుకోవడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో తాగునీరు సర్వం విషమయం కావడంతో ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పచ్చనిపొలాలు, ప్రకృతి అందాలు, ఎటుచూసినా కొబ్బరిచెట్లతో ఇందుకూరుపేట మండలంలో కనిపించే దృశ్యాలు. ఇక్కడ ప్రజలు దీన్ని మినీ కోనసీమగా పిలుస్తారు. ఈ ప్రాంతంలో పెన్నా నుంచి నెల్లూరు మీదుగా జాఫర్‌సాహెబ్ (పంట కాలువ), దేవిస్‌పేట వద్ద మూడు ఉపకాలువలుగా చీలుతుంది. మండలంలో 22 పంచాయతీలు, 62 గ్రామాలున్నాయి. 15 ఏళ్ల క్రితం ఆక్వా సాగు జరిగిన తర్వాత ఇక్కడి నుంచి రొయ్యల ఎగుమతి కోసం పెద్దఎత్తున ప్రాసెసింగ్ యూనిట్‌ను నెలకొల్పబడ్డాయి. కాలువపక్కనే సాయి మెరైన్, స్టార్ ఆగ్రో మెరైన్, 5 స్టార్ మెరైన్ ప్రాసెసింగ్ యూనిట్లు వెలిశాయి. ప్రతిరోజూ ఇక్కడి నుంచి చెన్నయ్‌కు అక్కడి నుంచి విదేశాలకు రొయ్యల ఎగుమతి జరుగతోంది. కొనుగోలు చేసిన రొయ్యలను ఈ ప్రాసెసింగ్ యూనిట్లకు తీసుకొచ్చి అవి చెడిపోకుండా కెమికల్స్ కలిపి పార్సిల్ చేస్తారు. ఈ క్రమంలో ఇక్కడ నుంచి వెలువడే వ్యర్థాలను ఫ్యాక్టరీ యాజమాన్యం పంట కాలువల్లోకి విడుదల చేస్తుంది. ఇలా విడుదలైన నీరు పంటకాలువల్లో కలిసి సాగు, తాగునీరు కలుషితం అవుతోంది. ఫలితంగా ఈ మండలంలో పెద్దఎత్తున రైతులు పంటలను కోల్పోవడంతో పాటు వివిధ రకాల వ్యాధుల బారిన పడుతున్నారు.

ఆక్వా ఫ్యాక్టరీ వ్యర్థాలు ఇందుకూరుపేట మండలంలోని 22 గ్రామ పంచాయతీలు, 64 గ్రామాలను నిండా ముంచేస్తున్నాయి. జెజె పేట, పోట్లపూడికాలువ, అదే కాలువ పరిధిలో సుమారు 3,799 హెక్టార్లు సాగవుతోంది. మండలపరిధిలో 6,786 మంది చిన్నకారు, 2,230 మంది సన్నకారు, 299 మంది కౌలురైతులు వ్యవసాయం చేస్తున్నారు. కాలువ నుంచి వస్తున్న వ్యర్థాలతో పంటలన్నీ నాశనమవుతున్నాయి. దీంతో కొంత ప్రాంతం పంట ఎదుగుదల ఆగిపోతుంది. ఈ నీళ్లు తాగి పశువులు రోగాల బారిన పడుతున్నాయి. కాలువగట్టుపై నివాసాలు ఉంటున్న ప్రజలు దోమల బెడదతో రకరకాల జబ్బులపాలవుతున్నారు. ఊపిరితిత్తుల వ్యాధులు, జ్వరాలు, కీళ్లనొప్పుల వంటి వాటిబారిన పడుతున్నారు. పాములవారిపాళెంలో 1,200 మంది జనాభా ఉంటే 600 మంది జ్వరాలతో ఇటీవలే మంచం పట్టారు. ఇందుకు ఆగ్రహించిన జనం పంట కాలువల్లో విషవాయువులు వదలొద్దంటూ ఆందోళనకు దిగారు. ఈ ఫ్యాక్టరీలతో పాటు చేపలు, పీతలు ఎగుమతి చేసే ఐస్ ఫ్యాక్టరీ రైస్‌మిల్లు యజమానులు కూడా వ్యర్థాలు ఈ కాలువల్లోనే వదలడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

అనేక సార్లు ఫిర్యాదులు

ఈ ప్రాంత రైతులు తాము పడుతున్న ఇబ్బందులను అనేకసార్లు ఇరిగేషన్ అధికారులు జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఫిర్యాదు ఇచ్చిన రోజు అలా వచ్చి ఇలా వెళ్లడం తప్ప అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు న్నాయి. ప్రజలు ఫిర్యాదు చేసిన సమయంలో ఆయా శాఖల అధికారులు వచ్చి ఫ్యాక్టరీ యజమాన్యం నుంచి ముడుపులు తీసుకొని వెళ్లిపోతున్నారని విమర్శలున్నాయి. ఒకదశలో కాలువల్లోని మలినాలను కిందకు వెళ్లకుండా రైతులు అడ్డుకట్ట వేశారు. మళ్లీ అధికారుల ప్రమేయంతో తొలగించారు. పచ్చని పొలాలతో సిరులు కురిపిస్తున్న ఇందుకూరుపేట మండలం ఇప్పుడు ఆక్వా ప్రాసెసింగ్ యూనిట్ల ద్వారా తీవ్రంగా నష్టపోతోంది.

మా పొలాలను నాశనం చేశారు



ఒకప్పుడు ఇందుకూరుపేట అంటే పాడి పంటలకు పెట్టింది పేరు. ఇప్పుడు ఈ పరిశ్రమల రాకతో పాడి, పంట రెండు దూరమవుతున్నాయి. మెట్ట ప్రాంతాలకు సైతం పైర్లు వేసి పండించిన పరిస్థితి ఇక్కడుంది. ఈ ఫ్యాక్టరీల కారణంగా కనీసం పశువులు నీళ్లల్లోకి దిగలేకపోతున్నాయి. నీళ్లల్లో కాలుపెడితే బొబ్బర్లు వచ్చి ఆస్పత్రులకు వెళ్లాల్సి వస్తోంది. కాలువల్లోకి దిగకుండా కిలోమీటరు తిరిగి మా ప్రాంతం ప్రజలు వెళ్లాల్సి వచ్చింది.

- పన్నీరు మధుబాబు, దేవిస్‌పేట ఉపసర్పంచ్



అధికారులు స్పందించాలి

తమ గ్రామాల్లో జరుగుతున్న అన్యాయాన్ని అధికారులు స్పందించాలని దేవిస్‌పేట గ్రామస్తులు కోరుతున్నారు. రొయ్యల పరిశ్రమలు మలినాలను శుద్ధి చేయకుండా నేరుగా పంటకాలువల్లో వదలడం ద్వారా తీవ్రంగా నష్టపోతున్నాం. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకుంటే ఈ ప్రాంతం పాడి, పంట లేకుండా ఎడారిగా మారే ప్రమాదం ఉంది.

- దేవిస్‌పేట గ్రామస్తులు

ఆ పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలి

వ్యకాస రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వర్లు



వ్యర్థ జలాలను పరిశీలిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వర్లు, కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి జమలయ్య తదితరులు

ప్రజాశక్తి - ఇందుకూరుపేట (నెల్లూరు)

ప్రజలకు నష్టం కలిగిస్తున్న రొయ్యల పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. బుధవారం శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా ఇందుకూరుపేట మండలంలోని దేవిస్‌పేట క్రాస్‌రోడ్డు వద్ద ఉన్న సాయిమెరిన్, ఫైవ్‌స్టార్, స్టార్ పరిశ్రమల నుంచి వెలువడుతున్న వ్యర్థజలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈ పరిశ్రమల నుంచి వెలువడే వ్యర్థ జలాల వల్ల ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. పొల్యూషన్ బోర్డు పర్మిషన్ లేకుండా నిబంధనలకు విరుద్ధంగా ఈ ఫ్యాక్టరీలను నిర్మించారన్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని ఫ్యాక్టరీల నుంచి వచ్చే వ్యర్థ జలాలను పంట కాలువల్లో కలపకూడదన్నారు. అధికారులు చర్యలు తీసుకోని పక్షంలో రైతుల మద్దతు కూడగట్టుకొని వ్యకాస ఆధ్వర్యంలో పైపులైన్లు మూసేస్తామన్నారు. దీనిద్వారా గ్రామాల్లోని రైతులు పంటలు పండించుకునే పరిస్థితి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్యూరీఫైర్ చేయకుండా ఇలా వదలడం వల్ల రైతులు నష్టపోతున్నారన్నారు. పుష్కలంగా పండే పంటలు నిర్వీర్యమయ్యే దుస్థితి ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, కౌలురైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి జమలయ్య, తదితరులు పాల్గొన్నారు.



చెట్ల నరికివేతకు బ్రేక్

యథాతథంగా ఇతర ప్రాంతాలకు తరలించేందుకు ఎఫ్‌డిసి సిద్ధం

సాధారణ రుసుముతో కోరిన చోట నాటేందుకు ఏర్పాట్లు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

అభివృద్ధి పనుల పేరుతో భారీ వృక్షాలను నరికి వేయకుండా యథాతథంగా తొలగించి వాటిని మరోచోట పెట్టి బతికించడానికి రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ (ఎఫ్‌డిసి) ఒక వినూత్న ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. రహదారుల విస్తరణ, ఇళ్ల నిర్మాణం, వివిధ అభివృద్ధి పనులు చేపట్టే సందర్భంగా అడ్డుగా ఉన్నాయనే కారణంతో భారీ వృక్షాలను నరికివేస్తున్నారు. దీంతో ఏళ్ల తరబడి పెంచిన వృక్షాలను తొలగించడం పర్యావరణ ప్రేమికులకు తీవ్ర ఆవేదనేను కలిగిస్తోంది. ఈ చర్యలను ఇక మీదట నిలిపివేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం వృక్షాలు దెబ్బతినకుండా తొలగించి యథాతథంగా నిర్వాహకులు కోరిన ప్రదేశంలో తిరిగి వాటిని నాటి సంరక్షించేందుకు చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ పి.మల్లికఆర్జునరావు సోమవారం 'ప్రజాశక్తి'కి తెలిపారు. ఇందుకోసం ప్రత్యేకంగా కొంత మంది సిబ్బందికి శిక్షణ ఇచ్చామన్నారు. జాతీయ రహదారుల శాఖతో పాటు రాష్ట్రంలోని ఆర్అండ్‌బి, పంచాయతీరాజ్ తదితర శాఖలు ఆయా ప్రాంతాల్లో చేపట్టే అభివృద్ధి పనులకు వృక్షాలు ఆటకంగా ఉన్నాయని భావిస్తే వెంటనే తమకు తెలియజేస్తే వెంటనే వాటిని తొలగించి వారు కేటాయించిన స్థలంలో నాటి సంరక్షిస్తామన్నారు. ఇళ్ల నిర్మాణ సమయంలోనూ ఇళ్లల్లోని భారీ వృక్షాలనూ ఇదే తరహాలో తొలగిస్తామన్నారు. ఇందుకు సంబంధించి కొంత రుసుం వసూలు చేస్తామని ఆయన వివరించారు.

కాఫీ, మిరియాలు విక్రయ కేంద్రాలు ఏర్పాటు

రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో 1.20 లక్షల ఎకరాల్లో అటవీ అభివృద్ధి సంస్థ ద్వారా వివిధ రకాల ఉత్పత్తులను తయారు చేస్తున్నారు. 10 వేల ఎకరాల్లో కాఫీ, 15 వేల ఎకరాల్లో జీడితోట, 10 వేల ఎకరాల్లో టేకు, ఉసిరి, మరో 85 వేల ఎకరాల్లో యూకలిప్టస్ తోటలు ఉన్నాయి. అలాగే అరకు ప్రాంతంలో ఉత్పత్తి అవుతున్న కాఫీ, మిరియాలను 'వనసిరి' బ్రాండ్ పేరుతో నేరుగా ఈ సంస్థ రాష్ట్రంలో ప్రధాన నగరాల్లో రిటైల్ అవుట్ లెట్ కేంద్రాలను ఏర్పాటు చేసి విక్రయాలు చేపట్టాలని నిర్ణయించింది. పలు ఉత్పత్తులు ఇప్పటి వరకూ గిరిజన అభివృద్ధి సంస్థలు కొన్ని ప్రాంతాల్లో విక్రయిస్తుండగా ఇక మీదట అటవీ అభివృద్ధి సంస్థ కూడా నేరుగా విక్రయాలకు రంగం సిద్ధం చేస్తోంది.

నా బిడ్డను కాపాడిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు

- కృతజ్ఞతలు తెలిపిన తల్లిదండ్రులు - ఫలించిన 11 గంటల రెస్క్యూ ఆపరేషన్



అంబులెన్స్‌లో వైద్యం పొందుతున్న బాలుడు చంద్రశేఖర్

ప్రజాశక్తి-వినుకొండ రూరల్ (గుంటూరు జిల్లా)

గుంటూరు జిల్లా వినుకొండ మండలం ఉమ్మడివరంలో మంగళవారం సాయంత్రం బోరుబావిలో పడిన రెండేళ్ల బాలుడు చంద్రశేఖర్ సురక్షితంగా బయటికొచ్చాడు. బుధవారం తెల్లవారు జామున 2.40 గంటలకు బాలుడ్ని బయ టకు తీశారు. 'తమబిడ్డను సజీవంగా చూస్తామను కోలేదని, అధికారులు, సిబ్బందితో పాటు తమ బిడ్డ బతకాలని కోరుకున్నవారందరికీ' కృతజ్ఞతలని తల్లిదం డ్రులు అనూష, మల్లికార్జునరావు ఈ సందర్భంగా తెలిపారు.

బాలుడికి 108 అంబులెన్స్‌లో చికిత్స అందించి అనంతరం గుంటూరు సమగ్ర వైద్యశాలకు తరలించారు. బాలుడ్ని మంత్రి కామినేని శ్రీనివాస్ పరామర్శించి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. బాలుడ్ని బయటకు తీసుకురాగానే అప్పటి వరకూ ఉత్కంఠంగా ఎదురు చూస్తున్న వందలాది మంది స్థానికులతోపాటు సిబ్బంది, అధికారులు సైతం చప్పట్లు, ఈలలతో హర్షం వ్యక్తం చేశారు. సిబ్బంది ఓర్పు, నేర్పు, శ్రమను పలువురు అభినందించారు. అక్కడే ఉన్న మంత్రి పుల్లారావు ఇది బాలునికి పునర్జన్మని వ్యాఖ్యానించగా, సమిష్టి కృషితో ఇది సాధ్యమైందని ఎమ్మెల్యే జీవి ఆంజనేయులు, కలెక్టర్, రూరల్ ఎస్పిలూ ఆనందం వ్యక్తం చేశారు.

పశ్చిమలో లారీ బీభత్సం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

పశ్చిమగోదావరి జిల్లా ఏలూరు రూరల్ మండలం పాలగూడెం పంచాయతీ సమీపంలోని ఆశ్రం ఆసుపత్రి వద్ద జాతీయ రహదారిపై ఓ లారీ బుధవారం బీభత్సం సృష్టించింది. ఓ కారును, ఓ ఆర్‌టిసి బస్సును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఏడుగురు గాయాలపాలయ్యారు. పోలీసుల కథనం ప్రకారం.. విజయవాడ నుంచి తాడేపల్లిగూడేనికి బయలుదేరిన ఓ లారీ స్థానిక ఆశ్రం ఆసుపత్రి వద్దకు వచ్చేసరికి విజయవాడ నుంచి శ్రీకాకుళం వెళ్తున్న కారు డ్రైవర్ ఆ లారీని ఓవర్‌టేక్ చేసేందుకు యత్నించాడు. అయితే ప్రమాదవశాత్తు లారీ కారును ఢీకొట్టింది. అనంతరం రోడ్డు పక్కనే ప్రయాణికులను ఎక్కించుకుంటున్న ఆర్‌టిసి బస్సును ఢీకొట్టింది. దీంతో బస్సు ఒక్కసారిగా ప్రయాణికులపైకి దూసుకెళ్లింది. పోలీసులు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

రైల్వే స్టేషన్‌లో స్వచ్ఛ భారత్ పక్షోత్సవాలు

ప్రజాశక్తి - వన్‌టౌన్ (విజయవాడ)

రైల్వే ప్రయాణికుల సహకారంతోనే రైల్వేలో సంపూర్ణ స్వచ్ఛత సాధించడం సాధ్యపడుతుందని విజయవాడ డివిజనల్ రైల్వే మేనేజర్ ఆర్.ధనుంజయులు అన్నారు. రైల్వే స్వచ్ఛతా పక్షోత్సవాలలో భాగంగా బుధవారం స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని విజయవాడ రైల్వే స్టేషన్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 16 నుంచి 30వ తేదీ వరకు పక్షోత్సవాలుగా స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని విజయవాడ రైల్వే డివిజన్‌లో నిర్వహించనున్నామని తెలిపారు. ప్రయాణికులకు, రైల్వే సిబ్బందికి రైల్వే పరిసరాల స్వచ్ఛతపై సంపూర్ణ అవగాహన కలిగించేందుకు ఈ పక్షోత్సవాల్లో వివిధ కార్యక్రమాలను చేపడుతున్నామని వివరించారు.

భీమవరంలో కూరగాయల మార్కెట్ తొలగింపు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

పశ్చిమగోదావరి జిల్లా భీమవరం పట్టణంలోని హోల్‌సెల్ కూరగాయల మార్కెట్‌ను మున్సిపల్ అధికారులు బుధవారం తొలగించారు. ఈ స్థలంలో తాగునీటి ట్యాంకు నిర్మించేందుకు నిర్ణయించామంటూ అధికారులు దురుసుగా వ్యవహరిస్తూ షాపులను కూల్చివేశారు.ఎన్నో ఏళ్లుగా ఇక్కడే వ్యాపారం చేసుకుంటున్నామని, అన్యాయంగా దుకాణాలను తొలగించారని, తమ సామగ్రిని కూడా తీసుకోనివ్వకుండా దుకాణాలను పొక్లెయిన్లతో తొలగించారని పలువురు వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేశారు. వన్‌టౌన్ సిఐ దేశింశెట్టి వెంకటేశ్వరరావు బందోబస్తు నిర్వహించారు. దీంతో వ్యాపారులు పోలీసులు, అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మార్కెట్ తొలగింపుతో 30 కుటుంబాల వారు రోడ్డునపడ్డారు.

రేపు ఎపి ఫొటోగ్రఫీ అకాడమీ స్వర్ణోత్సవాలు

- హాజరుకానున్న ముఖ్యమంత్రి

ప్రజాశక్తి-సత్యనారాయణపురం (విజయవాడ)/అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మక, సాంస్కృతిక సమితి సౌజన్యంతో ఎపి ఫొటోగ్రఫీ అకాడమీ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ అకాడమీ ఆఫ్ ఫొటోగ్రఫీ స్వర్ణోత్సవాలు, ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో శుక్రవారం నిర్వహించనున్నట్లు అకాడమీ ప్రధాన కార్యదర్శి టి.శ్రీనివాసరెడ్డి తెలిపారు. విజయవాడ గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉదయం 10 గంటలకు ఈ వేడుకలు ప్రారంభమవుతాయన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, శాసనసభ డిప్యూటీ స్పీకర్ మండలి బుద్ధప్రసాద్, రాష్ట్ర సృజనాత్మక, సాంస్కృతిక సమితి సిఇఒ డి విజయభాస్కర్‌తోపాటు పలువురు ప్రముఖులు ఈ వేడుకల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. 1967లో తొలిసారి తెలుగు నేలపై అంతర్జాతీయ పొటోగ్రఫీ పోటీలు నిర్వహించిన ఘనత అకాడమీకి ఉందన్నారు. ఎంతో మంది మహానుభావుల కృషి ఫలితంగా నేడు ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో అత్యధికులు అంతర్జాతీయ గౌరవ పురస్కారాలను పొంది దేశంలోనే ముందు వరుసలో ఉన్నారన్నారు.సమావేశంలో అకాడమీ ఉపాధ్యక్షులు ఎం.రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

బాలయ్యపై రోజా సంచలన వ్యాఖ్యలు

ప్రజాశక్తి-నంద్యాల క్రైం

నంద్యాల ఉపఎన్నికకు సమయం దగ్గర పడుతున్నకొద్దీ.. రాజకీయం రసవత్తరంగా మారుతోంది. అధికార, ప్రతిపక్ష నేతల మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి. నంద్యాల ఉపఎన్నిక ప్రచారం సందర్భంగా వైసీపీనుద్దేశించి బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలకు రోజా కౌంటర్ ఇచ్చారు. మహిళలను బాలకృష్ణ అగౌరవ పరుస్తున్నారని ఆరోపించారు. 'ఆడపిల్ల కనిపిస్తే ముద్దులు పెట్టండి, కడుపులు చేయండి' అంటారు.. అలాంటి వ్యక్తికి వైసిపిని విమర్శించే స్థాయి లేదని రోజా అన్నారు. బాలకృష్ణ అమాయకులు అని, ఎవరో రాసిచ్చిన స్క్రిప్ట్‌ను చదువుతారని వ్యాఖ్యానించారు. తల్లిపాలు తాగి రొమ్ములు గుద్దారని టీడీపీ నుంచి వైసీపీలోకి చేరిన శిల్పా చక్రపాణినుద్దేశించి బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలపై రోజా అంతే ఘాటుగా స్పందించారు. తల్లిపాలు తాగి రొమ్ములు గుద్ది టీడీపీలో చేరిన ఆదినారాయణ రెడ్డి, అఖిల ప్రియ, అమర్‌నాథ్ రెడ్డిలను పక్కన పెట్టుకొని బాలయ్య డైలాగ్‌లు కొడుతున్నారని రోజా విమర్శించారు. వైసీపీ నుంచి టీడీపీలోకి లాక్కున్న ఆ ముగ్గురిని పక్కన పెట్టుకొని టీడీపీని వదిలిన శిల్పా సోదరులపై కామెంట్ చేయడం ఘోరం అని వ్యాఖ్యానించారు. ఇకపోతే టీడీపీలోకి ఎందుకు వెళ్లారంటే.. చెప్పుకోలేని స్థితిలో భూమానాగిరెడ్డి కుటుంబం ఉందన్నారు.

'చింతలపూడి'కి జిఎస్‌టి చింత..!

ప్రజాశక్తి-ఏలూరు ప్రతినిధి

మోడీ సర్కార్ తీసుకొచ్చిన జిఎస్‌టి (గూడ్స్ అండ్ సర్వీస్ ట్యాక్స్) పశ్చిమగోదావరి జిల్లా చింతలపూడి ఎత్తిపోతల పథకం పనులకు గుదిబండగా మారే అవకాశం కన్పిస్తోంది. 16 మండలాల్లో 191 గ్రామాలకు సాగు, తాగునీరందించేందుకు ఉద్దేశించిన ఈ ప్రాజెక్టు పనులు 2008లో రూ.1,701 కోట్ల అంచనాతో ప్రారంభించినా ఇప్పటికీ పూర్తికాలేదు. తొమ్మిదేళ్లలో ఈ ప్రాజెక్టు నిమిత్తం చేసిన ఖర్చు రూ.739.92 కోట్లే. 2014లో టిడిపి ప్రభుత్వం అధికారంలోకొచ్చిన తర్వాత రెండు లక్షల ఎకరాలకు సాగునీరందించే ఈ పథకాన్ని ఏడాదిలో పూర్తి చేస్తామని చెప్పింది. అటవీ భూమితో కలుపుకుని దాదాపు 11 వేల ఎకరాలు భూసేకరణ జరగాల్సి ఉంది. 'చింతలపూడి' ప్రాజెక్టును మరింత విస్తృత పరుస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించి, అంచనా వ్యయాన్ని రూ.4,909 కోట్లకు ఇటీవల సవరించింది. ప్రాజెక్టు పనులు ముమ్మరం చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఇంతలో జిఎస్‌టి వచ్చిపడటంతో మళ్లీ పరిస్థితి మొదటికొచ్చే స్థితి నెలకొంది.



రూ.వెయ్యి కోట్లు అదనపు వ్యయం

గతంలో ఐరన్‌పై ఐదుశాతం వ్యాట్ ఉండగా జిఎస్‌టితో 18 శాతానికి చేరింది. సిమెంట్‌పై 14 శాతం వ్యాట్ ఉండగా జిఎస్‌టితో 28 శాతానికి పెరిగింది. ఒక్కసారిగా పన్నులు రెట్టింపవడంతో ప్రాజెక్టు వ్యయం భారీగా పెరిగే పరిస్థితి ఏర్పడింది. గతంలో ప్రాజెక్టులపై ఐదు నుంచి పదిశాతం వ్యాట్ ఉండేదని అధికారులు చెబుతున్నారు. జిఎస్‌టితో అది 20 శాతానికి చేరే అవకాశం కనిపిస్తోంది. అదే జరిగితే ప్రస్తుతం రూ.4,909 కోట్లు అంచనాగా ఉన్న 'చింతలపూడి' ప్రాజెక్టు నిర్మాణ వ్యయం మరో రూ.వెయ్యి కోట్లు వరకూ పెరిగే అవకాశం ఉంది. ఇప్పటికే ఒక అడుగు ముందుకు.. పది అడుగులు వెనక్కి అన్నట్లు సాగుతున్న 'చింతలపూడి' పనులకు జిఎస్‌టి గుదిబండగా మారనుంది. ప్రాజెక్టు వ్యయం పెరిగితే 'చింతలపూడి' పనులు మరోసారి పడకేసినట్లేనని చెప్పొచ్చు. ప్రాజెక్టులపై పడే జిఎస్‌టిపై ప్రభుత్వం నుంచి స్పష్టత లేదు. దీనిపై ప్రభుత్వం కమిటీని నియమించినట్లు సమాచారం. కమిటీ నివేదిక వచ్చిన తర్వాత ప్రాజెక్టులపై పడే భారం తేలనుంది. దీనిపై 'చింతలపూడి' ప్రాజెక్టు పర్యవేక్షక ఇంజినీర్ ఎస్.శ్రీనివాస్‌యాదవ్‌ను వివరణ కోరగా జిఎస్‌టితో ప్రాజెక్టు వ్యయం పెరిగే అవకాశం ఉండొచ్చన్నారు. ప్రాజెక్టులపై ఇంకా స్పష్టత రాలేదని తెలిపారు. వివరాలు వస్తే తప్ప ఎంత భారం పడుతుందో తెలియదని చెప్పారు.

సంపాదకీయం

దళిత వ్యతిరేకత

'దళితులు శుభ్రంగా ఉండరు... చదువు రాదు' అంటూ రాష్ట్ర మంత్రి ఆదినారాయణ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఆయనలోని పెత్తందారీ అహంకారానికి, కరడుగట్టిన ఫ్యూడల్ భావజాలానికి అద్దం పడుతున్నాయి. హోదాతో నిమిత్తం లేకుండా సమాజంలో ఎవ్వరూ ఈ తరహా వ్యాఖ్యలు చేసినా ఖండించాలి. అటువంటిది మంత్రి పదవిలో ఉన్న వ్యక్తి చేయడం బాధ్యతా రాహిత్యానికి నిదర్శనం. ఎన్నికల ముందు దళిత కాలనీలు తిరిగినప్పుడు, ఓటు కోసం వారి కాళ్లా వేళ్లా పడ్డప్పుడు కనపడని అపరిశుభ్రత, అవిద్య ఆయనకు ఇప్పుడు కనపడటమే విచిత్రం! నిజానికి సమాజంలో పేరుకు పోయిన మురికిని తొలగించిన చరిత్ర దళితులది! ఇతర కులాలు చేయడానికి ముందుకు రాని ఎన్నో పనులను వారు చేశారు. ఇప్పటికీ చేస్తున్నారు. ఈ సేవలకు గాను వారికి కృతజ్ఞతలు చెప్పడానికి బదులుగా అపహాస్యం చేయడం అజ్ఞానానికి నిదర్శనం. స్వాతంత్ర్యం వచ్చి ఇన్ని ఏళ్లు గడిచినా దళిత కాలనీలు మౌలిక వసతులకు దూరంగా, అపరిశుభ్రంగా ఉండటానికి పాలకుల వక్ర దృష్టే కారణం. అభివృద్ధి పనులు దళిత కాలనీల పొలిమేర్ల దాకా వచ్చిన ఆగిపోయిన ఉదాహరణలు ఎన్నో! ఎక్కడో మారుమూల పల్లెల్లో కాదు, నగరాల నడిబొడ్డున ఉన్న కాలనీల్లో కూడా ఇదే దుస్థితి కనిపిస్తోందంటే దళితుల అభివృద్ధి పట్ల పాలకుల చిత్తశుద్ధి ఏమాత్రమో అర్థం చేసుకోవచ్చు. దళితులపై నోటికొచ్చినట్లు పేలిన మంత్రి నియోజకవర్గంలోనూ ఇటువంటి కాలనీలు ఎన్నో కనపడతాయి. తన నిష్క్రియాపరత్వాన్ని విస్మరించి దళిత సమాజంపై మంత్రి వేలెత్తి చూపడం గురివింద గింజ సామెతను గుర్తు చేస్తోంది. దళితుల చదువు విషయంలోనూ పాలకులది ఇదే ధోరణి! అక్షర ఘోష వింటేనే చెవిలో సీసం కరిగించి పోసే రోజుల నుండి మిగిలిన వారితో పోటీపడే స్థితికి ఇప్పుడిప్పుడే చేరుకుంటున్నారు. ఈ ప్రక్రియ ఇంకా విస్తృతంగా కొనసాగాల్సివుండగానే విద్యను ప్రైవేటీకరిస్తూ అసలుకే ఎసరు పెట్టడానికి పాలకవర్గాలు సిద్ధమవుతున్నాయి. ఆ గూటికే చెందిన ఆదినారాయణ రెడ్డి 'దళితులకు చదువురాదు' అంటూ ఈసడించడాన్ని, రిజర్వేషన్లపై చేసిన వివక్ష పూరిత వ్యాఖ్యలను ఈ కోణం నుండే చూడాలి!

రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత దళితులపై ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ దాడులు పెరుగుతున్నాయి. 'ఎస్సీ. ఎస్టీలుగా పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా...' అంటూ కొద్ది రోజుల క్రితం సాక్షాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడే వ్యాఖ్యానించారు. అన్ని వర్గాల నుండి వ్యతిరేకత వ్యక్తం కావడంతో మీడియాపై తప్పు నెట్టేశారు. వివిధ అభివృద్ధి ప్రాజెక్టుల పేరుతో రాష్ట్రంలో జరుగుతున్న అన్ని భూ సమీకరణ, సేకరణ ప్రక్రియల్లో దళితులే సమిధలు! ఇదేమని ప్రశ్నించే వారిపై లాఠీఛార్జిలు, అరెస్టులు, తప్పుడు కేసులతో రాష్ట్ర ప్రభుత్వం విరుచుకుపడుతోంది. సర్కారు అండతో రాష్ట్రంలో దళితులపై సాగుతున్న దమనకాండకు దేవరపల్లి, గరగపర్రు సంఘటనలే నిదర్శనం. పెద్ద ఎత్తున పోరాటం చేసిన తరువాతే ఈ రెండు చోట్లా రాష్ట్ర ప్రభుత్వం దిగివచ్చింది. ఆవు చేలో మేస్తుంటే దూడ గట్టున మేస్తుందా అన్నట్లు అధినేతే మాట తూలుతుండటంతో అనుచరగణం కూడా అదే బాటలో నడుస్తోంది. కొద్ది రోజుల క్రితం ఓ ప్రజాప్రతినిధి దళిత అధికారి పట్ల దురుసుగా ప్రవర్తించినా, ఇప్పుడు ఆదినారాయణరెడ్డి వాచాలత్వం ప్రదర్శించినా ఇదే కారణం. బిజెపి మద్దతుతో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తరువాత దళితులు, మైనార్టీల పట్ల తెలుగుదేశం పార్టీ వైఖరిలో గణనీయమైన మార్పు కనిపిస్తోంది. గత ఏడాది దేశ వ్యాప్తంగా చర్చనీయాంశమైన రోహిత్ వేముల ఉదంతంపై చంద్రబాబునాయుడు పెదవి విప్పలేదు. రోహిత్ కుల నిర్ధారణ విషయంలోనూ అధికార యంత్రాంగంపై ఒత్తిళ్లు వచ్చాయన్న ఆరోపణలు వచ్చాయి. పశువుల విక్రయాలపై కేంద్ర ప్రభుత్వం విధించిన ఆంక్షల విషయంలోనూ రాష్ట్ర సర్కారు ఇదే ధోరణి అనుసరించింది. కొన్ని రాష్ట్రాలు బాహాటంగానే ఈ ప్రతిపాదనను వ్యతిరేకించినా, మరికొన్ని చోట్ల బిజెపి ప్రజాప్రతినిధులే అసంతృప్తిని వ్యక్తం చేసినా రాష్ట్ర పాలకులు మాత్రం నిమ్మకు నీరెత్తిన విధంగా ఊరుకున్నారు.

దళితుల పట్ల రాష్ట్ర ప్రభుత్వ వైఖరి మారాలి. రాష్ట్రంలో దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టాలి. వారి భూములను బలవంతంగా సేకరించడాన్ని నిలిపివేయాలి. ఆదినారాయణ రెడ్డి వివాదాస్పద వ్యాఖ్యల తరువాత కూడా సిఎం మౌనం వహిస్తే వాటినే టిడిపి వైఖరిగా భావించాల్సి వస్తుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని ఆ వ్యాఖ్యలపై రాష్ట్ర ముఖ్యమంత్రి స్వయంగా వివరణివ్వాలి. చట్ట ప్రకారం ఆయనపై చర్యలు తీసుకోవాలి. ఆదినారాయణ రెడ్డి కూడా భేషజాలకు పోకుండా బేషరత్తుగా దళితులకు క్షమాపణ చెప్పాలి.

మహనీయుల మాట



ఇతరులలో మంచిని చూడకపోవడం మనలో మంచితనం లేకపోవడాన్నే సూచిస్తుంది.

- ఎడిసన్

పిల్లల ప్రాణాలు 'గాలి'కి

ప్రజాగళం

దేశంలో రాను రాను గడ్డు పరిస్థితులు ఎక్కువౌతున్నాయి. ఆహారం, నీరే కాక పీల్చే గాలి కూడా అందుబాటులో లేకుండా పోతోంది. ఇటీవల ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్‌లో జరిగిన సంఘటనే ఇందుకు నిదర్శనం. సాక్షాత్తు ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లాలోని ఒక ఆస్పత్రిలో ఆక్సిజన్ అందక 72 మంది పిల్లలు చనిపోయారు. కనీసం వారి మృతికి సంతాపం కూడా తెలియచేయకుండా ఇదేదో సాధారణ విషయంగా కొట్టి పడేస్తున్నారు. ఆస్పత్రికి, ఆక్సిజన్ సరఫరా చేసే ఒక ప్రయివేటు సంస్థ తనకు రావాల్సిన బకాయిలు చెల్లించలేదని సరఫరాను నిలిపివేయడంతో ఈ సంఘటన చోటుచేసుకుంది. ఇక్కడ మానవీయతకు తావు లేదు. ఫలితం ఎంతో మంది తల్లుల గర్భశోకం. అయినా 2000 సంవత్సరానికి గాను ప్రపంచ ప్రజలందరికీ ఆరోగ్యం అందుబాటులో వుండాలని 1978లోనే 'ఆల్మా డిక్లరేషన్'ను విడుదల చేశారు. ఈ డిక్లరేషన్‌పై ఎన్నో దేశాలు సంతకాలు చేశాయి. అందులో మన దేశం కూడా వుంది. కాని తీర్మానానికి కట్టుబడలేదు. ప్రజారోగ్యాన్ని గాలికొదిలేసింది. రోజురోజుకూ కొత్తకొత్త వ్యాధులు ప్రబలుతున్నాయి. 'మాయమయ్యాయి' అనుకున్న అంటురోగాలు విజృంభిస్తున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో ఆరోగ్యం పట్ల ప్రభుత్వాలే బాధ్యత వహించాలి. కాని మన దేశం ప్రజల ఆరోగ్యాన్ని పూర్తిగా ప్రయివేటు పరం చేసింది. జిడిపిలో కేవలం ఆరోగ్యానికి 0.9 శాతమే కేటాయిస్తోంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతి ఒక్క దేశం తమ జిడిపిలో ఐదు శాతాన్ని ఆరోగ్యానికి కేటాయించాలని సూచించింది. అభివృద్ధి చెందుతున్న మూడవ ప్రపంచ దేశాలు కూడా ఆరోగ్యరంగం మీద తమ జిడిపిలో 2.8 శాతం నిధులను ఖర్చు చేస్తున్నాయి. అభివృద్ధి చెందిన దేశాలైతే 5.5 శాతం ఖర్చు పెడుతున్నాయి. మన కంటే పేద దేశాలున్న ఆఫ్రికాలో కూడా ఆరోగ్యంపై సగటున తమ జిడిపిలో 2.3 శాతం ఖర్చు చేస్తున్నాయి. మన దేశమే ఆరోగ్యాన్ని ఇంత నిర్లక్ష్యం చేస్తోంది. ఇక్కడ ప్రభుత్వాలు ఆరోగ్యంపై 25 శాతం ఖర్చు పెడుతుంటే ప్రజలు 75 శాతం భరిస్తున్నారు. తమ అరకొర సంపాదనలో అధిక భాగం ఆరోగ్యానికి ఖర్చు చేయాల్సి రావడంతో పేదల జీవన పరిస్థితులు దుర్భరంగా తయారవుతున్నాయి. ఈ పరిస్థితి గ్రామీణ ప్రాంతాల్లో మరీ ఎక్కువగా వుంది. ఇకనైనా నాణ్యమైన వైద్య సేవల కల్పనకు ఒక ఆరోగ్య చట్టాన్ని రూపొందించి పగడ్బందీగా అమలు చేయాలి. క్యూబా లాంటి సోషలిస్టు దేశాల్లో ప్రజల ఆరోగ్యానికి ఇస్తున్న ప్రాధాన్యత విశిష్టమైంది. ప్రజారోగ్య పరిరక్షణలో ప్రపంచానికే క్యూబా ఆదర్శంగా ఎలా నిలబడిందో ఆ ప్రమాణాలను పాటించాలి. కార్పొరేట్ ఆస్పత్రుల లాభాలకు తోడ్పడే విధానాలను విడనాడాలి. ప్రజలందరికి మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించాలి.

షేక్ సమీర్

పవిత్ర మలినం



అవును!
మేము శుభ్రంగా ఉండం
మా హృదయాలు మాత్రం
అతి పవిత్రం

నీ తెల్లని వర్చస్సు వెనుక
కమిలిన మా బతుకులుంటయ్
మడతపోని బట్టలవెనుక
నలిగిన మా జీవితాలుంటయ్
ఒళ్ళు విరుస్తూ లేచే నీ బద్ధకం వెనుక
విశ్రమించని మా శరీరాలుంటయ్
ముప్పూటలా మింగే కబళం వెనుక
మూర్తీభవించిన మా చెమటలుంటయ్
హాయిగా పవళించే నీ పానుపు వెనుక
నిద్ర లేని మా బతుకులుంటయ్

నీ యాగానికి బలి మేము
నీ రోగానికి వైద్యం మేము
నిను వారధి దాటించిన
అపర వానరసేన మాది
నీకోసం రెక్కలర్పించిన
జటాయువులం మేము

నీ మనసులో ఉండే మకిలి
నీ మస్తిష్కంలోని కాలుష్యం
నీ ఆలోచనలోని దారిద్ర్యం
ఏవీ లేని పరిశుద్ధత మాది
నీ ఆలోచనకందని
వైశిష్ట్యం మాది

జంధ్యాల రఘుబాబు.

నిలువ నీడలేని నిర్వాసితులు

వంశధార నదీ ప్రాంతమా! లేక డోక్లామ్ సరిహద్దు ప్రాంతమా! ప్రస్తుతం అక్కడ నెలకొన్న పరిస్థితులు చూస్తుంటే ఈ అనుమానం వస్తోంది. ఖాకీల ఇష్టారాజ్యమో, పాలకుల దౌర్జన్యమో, ప్రభుత్వ వైఫల్యమో... ఏదేమైనా గానీ ప్రస్తుత పరిస్థితుల్లో వంశధార నిర్వాసితులకు నిలువ నీడ లేకుండా, కంటికి కునుకు లేకుండా చేస్తున్న ఈ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడినట్లు కనిపిస్తోంది. ఈ నదీ ప్రాంతం వేలాది పోలీసుల మోహరింపుతో మరో కిర్లంపూడిని తలపిస్తోంది. నిర్వాసితులను ఉక్కు పాదంతో అణచివేయడం చూస్తుంటే ఆందోళన కలుగుతోంది. ఇచ్చిన హామీ నెరవేర్చని ప్రభుత్వం పోలీసు లాఠీలతో ప్రజల్ని చితకబాదుతోంది. వీరి న్యాయమైన కోర్కెలు తీర్చలేదు. జరిగిన నష్టాన్ని కూడా పూడ్చలేదు. పైగా వారిని నిస్సహాయుల్ని చేసి, తప్పుడు కేసులు బనాయిస్తోంది. ప్రాజెక్టు కోసం సర్వం కోల్పోయిన నిర్వాసితులకు పోలవరం, పట్టిసీమ ప్రాజెక్టు నిర్వాసితుల మాదిరిగానే 2013 భూసేకరణ చట్టం ప్రకారం 25 అంశాలతో కూడిన నష్టపరిహారం ఇవ్వాల్సి వుంది. ఈ ప్రాంతంలోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బడి పిల్లలకు చదువుల్లేవు. వృద్ధులకు ఫించన్లు లేవు. ఇంటికి రేషను లేదు. తాగడానికి మంచి నీళ్ళు లేవు. ఉండటానికి రక్షణ లేదు. వీధుల్లో విద్యుత్ లేదు. ఇంటి చుట్టూ ముళ్ళపొదలు. వాటిల్లో విష సర్పాలు ఇలా నాణ్యత లేని పునరావాస కాలనీల్లో మగ్గుతున్నారు. పగిలిన సీసీ రోడ్లు ప్రజల్ని నరకయాతన పెడుతున్నాయి. ఇలా వారిని హింసించి బయటకు పంపించేయడానికి ఎన్నో ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఉన్నపళంగా పోలీసు బలగాలను ఎందుకు మోహరించారు? అని అడిగిన ప్రజలకు 'ఇదిగో ఇక్కడే ఉన్న ఆర్‌డీఓ, ఎంఆర్ఓలను కలిసి మాట్లాడండి, మాతో రండి' అని వాహనం ఎక్కించి తిన్నగా పోలీస్ స్టేషనుకు తీసుకుపోయి అరెస్టు చేయడం చూస్తే, ప్రజాస్వామ్యంపై నమ్మకం తగ్గి పోతోంది. నదీతీరాల చెంత ప్రశాంతమైన జీవనం సాగిస్తున్న ప్రజల్లో అల్లకల్లోలం సృష్టించారు. పూర్వీకుల నుంచి వున్న ఊరిని, దున్నే భూమిని వదిలి వెళ్లిపోవాలని హుకుం జారీచేశారు. ప్రాజెక్టు నిర్మిస్తే పదిమందికి ఉపయోగ పడుతుందనే సదుద్దేశంతో వారంతా ఒప్పుకున్నారు. అయితే నేటికీ వారికి అందాల్సిన నష్ట పరిహారం చెల్లించలేదు. పైగా పాకిస్తాన్ బోర్డర్‌లో మిలిటెంట్ల కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు, ఈ ప్రాంతంలో డ్రోన్ కెమెరాలు ఏర్పాటు చేశారు. పోలీసులు బాడీవాల్ కేమెరాలు తగిలించుకోవడం చూస్తుంటే పాలకులకు నిర్వాసితులేమైనా ఉగ్రవాదుల్లాగా కనిపిస్తున్నారా? అన్న అనుమానం రాకపోదు. ఈ పరిస్థితుల్లో మార్పు రావాలి. జరిగిన నష్టపరిహారం తక్షణమే చెల్లించాలి. లేని పక్షంలో ప్రజా సంఘాల అండతో పోరాటం చేయాల్సిన పరిస్థితులు వస్తాయనడంలో సందేహమే లేదు.

రొక్కం సూర్యప్రకాశరావు
(వంశధార నిర్వాసితుల పోరాట కమిటి కన్వీనర్), శ్రీకాకుళం.


నంద్యాలలో నువ్వా? నేనా?



కంచల జయరాజ్

సందర్భం

అధికారమే పరమావధిగా అధికార, ప్రతిపక్షాలు నంద్యాల ఉప ఎన్నికలో పరిధులకు మించి పోరాడుతున్నాయి. నిబంధనలు, నీతి నియమాలు అన్నింటినీ వదిలేసి రాజకీయం నడుపుతున్నాయి. ఒక్క మన రాష్ట్రమే కాకుండా, దాదాపు అన్ని రాష్ట్రాలు కూడా ఇపుడు నంద్యాలలో ఏం జరుగుతుందోనన్న ఆసక్తితో చూస్తున్నాయి. అధికార తెలుగుదేశం పార్టీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎలాంటి వ్యూహం రూపొందించారు? ప్రతిపక్ష వైసిపి నేత జగన్మోహన్‌రెడ్డి ఎలాంటి కార్యాచరణ అమలు చేయబోతున్నారు? అనేవి ఇపుడు ఎవరి అంచనాలకు అందడం లేదు. నంద్యాల ఉప ఎన్నికలను రిఫరెండంగా స్వీకరిస్తున్నట్లు ఉభయ పార్టీలు ఇప్పటికే ప్రకటించాయి. ఈ ఎన్నిక నిజంగానే అటు అధికార పక్షానికీ, ఇటు ప్రతిపక్షానికీ పెను సవాలునే విసిరింది. ఈ సీటును గెలవడం ద్వారా 2019 నాటి ఎన్నికలకు సంకేతాలను ఇవ్వడానికి ఉభయ పార్టీలూ సిద్ధంగా ఉన్నాయి. అందుకే హోరాహోరీ పోరాటానికి తలపడుతున్నాయి. జరిగేది ఉప ఎన్నిక అయినప్పటికీ అసెంబ్లీ, పార్లమెంటు సాధారణ ఎన్నికలను మించిన ప్రాధాన్యతను సంతరించుకుంది. అధికారపక్షం తనకున్న అధికార బలాన్ని, పార్టీ యంత్రాంగాన్ని వినియోగిస్తుంటే, ప్రతిపక్షం అధికార పక్షంపై ఎదురు దాడి చేయడం ద్వారా ఉనికిని చాటుకునే యత్నాలు చేస్తోంది. వెరసి ఉభయ పార్టీలు కూడా సర్వ శక్తులనూ నంద్యాలలోనే కేంద్రీకృతం చేసి మరీ ఎన్నికల బరిలో నిలిచాయి. గెలుపు ఎప్పుడూ ఒక్కరికే సొంతం అవుతుంది. అది ఎవరికి అనేది తేల్చుకునే క్రమంలో అనేక వికృత చేష్టలు, ఆందోళన కరమైన కార్యక్రమాలు ఉభయపార్టీలూ చేపడుతూ ప్రజాస్వామ్య ఉనికికి భంగం కల్పించేలా వ్యవహరిస్తున్నాయి. భూమా నాగిరెడ్డి మృతితో ఏర్పడిన ఖాళీని భర్తీ చేసే క్రమంలో ఉప ఎన్నిక అనివార్యం అయింది. 2014లో వైసిపి జెండా మీద గెలిచిన భూమా, అనంతరం చోటు చేసుకున్న పరిణామాల నేపథ్యంలో టీడీపీలో చేరారు. అపుడు టీడీపీ తరపున పోటీ చేసిన శిల్పా మోహన్‌రెడ్డి ఇపుడు వైసిపి తరపున బరిలోకి దిగారు. నంద్యాల స్థానం మాదే అంటే మాదే అంటూ ఇరు వర్గాలూ పోటీ పడుతున్నాయి. సహజంగా సిట్టింగ్ ఎమ్మెల్యే ఎవరైన ఆకస్మికంగా మృతి చెందితే ఆ స్థానానికి జరిగే ఉప ఎన్నికలో పోటీ పెట్టకుండా ఏ పార్టీకి చెందిన స్థానం అయితే ఆ పార్టీ అభ్యర్థికి ఏకగ్రీవం అయ్యేలా చేయడం ఆనవాయితీ. కానీ నంద్యాలలో మాత్రం ఈ వరుస తప్పింది. కారణం భూమా నాగిరెడ్డి వైసిపి జెండా మీద గెలిచి, తెలుగుదేశం పార్టీలో చేరారు. 2014లో నంద్యాల తమ స్థానం అని వైసిపి సొంతం చేసుకుంటోంది. కానీ భూమా తమ పార్టీలో చేరారు కాబట్టి నంద్యాల తమదే అని టీడీపీ పోటీ పడుతోంది. దీంతో పోటీ అనివార్యం అయింది. అధికార-ప్రతిపక్ష పార్టీల పట్టింపులు, పంతాలు ఎక్కువయ్యాయి. జరిగే ఉప ఎన్నికలో హేమాహేమీలు రంగంలోకి దిగారు. ఉభయ పార్టీలూ జీవన్మరణ సమస్యగా ఈ ఉప ఎన్నికను తీసుకున్నాయి. దీంతో అనేక అవాంఛనీయ సంఘటనలు, ఊహించని పరిణామాలు చోటుచేసు కుంటున్నాయి.



నంద్యాలలో విచిత్రమైన పరిస్థితి నెలకొంది. అధికార, ప్రతిపక్షంలో ఓటర్లకు ఎవరు ఎక్కువ మొత్తం ఇస్తున్నారు అన్నదానిపై ఉభయ పార్టీలు నిఘా పెట్టాయి. ఇరు పార్టీలు ఒక్కో ఓటరుకు నగదు ఇవ్వడానికి సిద్ధమయ్యాయి. మొత్తం మీద ఇరు పార్టీలూ నంద్యాలలో 'దేనికైనా సిద్ధం' అన్నట్టు తయారయ్యాయి. ఒక్క ఉప ఎన్నికకే ఇలా ఉంటే మరో రెండేళ్లలో రానున్న అసెంబ్లీ ఎన్నికలకు ఉభయ పార్టీలు ఎలాంటి విపరీత పరిణామాలను సష్టిస్తాయో అనే భయం రాష్ట్ర ప్రజలకు ఏర్పడింది.

ఆందోళనకర పరిణామాలు

నంద్యాల ఉప ఎన్నిక నేపథ్యం అనేక ఆందోళనకరమైన అంశాలను తెరమీదకు తీసుకొచ్చింది. రాబోయే రోజుల్లో ప్రజాస్వామ్య మనుగడకే పెను సవాల్ విసిరే వాతావరణాన్ని కల్పించింది. ఉప ఎన్నిక నోటిఫికేషన్‌కు ముందు నుంచి కూడా అటు అధికార పక్షం, ఇటు ప్రతిపక్షం కూడా లక్ష్మణరేఖను దాటి వ్యవహరిస్తున్నాయి. నామినేషన్ల ఉపసంహరణ రోజున వ్యవహరించిన విధానం నుంచి ఉభయ పార్టీలు అనుసరించే ప్రచార సరళిని పరిశీలిస్తే రాజ్యాంగ పరిధిని కూడా దాటేసి వ్యవహరిస్తున్నట్లు కన్పిస్తోంది. ఎన్నికల కమిషన్ కూడా చోద్యం చూస్తుందే తప్ప, ఎలాంటి నిఘా, నియంత్రణ చర్యలు చేపట్టే స్థితిలో లేక పోవడం బాధాకరమైన అంశం. ఒక్క అసెంబ్లీ స్థానానికి జరిగే ఉప ఎన్నికలనే సవ్యంగా నిర్వహించలేకపోతే, 2019లో సాధారణ ఎన్నికలను సజావుగా ఎలా నిర్వహిస్తారనే ప్రశ్న ఉత్పన్నం అవుతోంది. 'నేను ఇచ్చే ఫించన్లు తీసుకుంటారు. నేను వేసిన రోడ్లపై నడుస్తారు. నాకు ఎందుకు ఓట్లు వేయరు?' అని ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తి ప్రజల్ని ప్రశ్నిస్తుంటే ఏమనాలి? 'నా ప్రభుత్వం నచ్చకపోతే, నా పాలన ఇష్టం లేకపోతే నేను ఇచ్చే ఫించన్లు తీసుకోకండి, నేను వేసిన రోడ్లపై నడవకండి' అని ఆదేశిస్తుంటే ప్రజాస్వామ్య వ్యవస్థ ఎటు వెళుతుందనుకోవాలి? ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి ఇలా మాట్లాడటం పట్ల అనేక అభ్యంతరాలు వ్యక్తం అయ్యాయి. దీనివల్ల ప్రజల నుంచి వచ్చేది సానుభూతి కాదు. వ్యతిరేకత అన్నది రాజకీయాల్లో తలపండిన చంద్రబాబుకు తెలియదనుకోవాలా? 'ఓటుకు రెండు వేలు, ఐదు వేల రూపాయలు కూడా ఇవ్వగలను' అని అధికార పక్ష నేతే ప్రకటిస్తే ఎలాంటి వ్యవస్థలో మనం ఉన్నామో అని ఆశ్చర్యం వేస్తోంది. మరోవైపు 'ముఖ్యమంత్రిని నడిరోడ్డుపై కాల్చి చంపినా తప్పు లేదు', 'మాట తప్పే ముఖ్యమంత్రికి ఉరిశిక్ష వేయాలి' అని ప్రతిపక్ష నేత ఆవేశంగా ప్రకటించడంలో రాబోయే రోజుల్లో రాష్ట్రాన్ని ఎలాంటి స్థితిలోకి తీసుకెళతారో అనే ఆందోళన వ్యక్తం అవుతోంది. ఒకవేళ ఈ మాటలకు ప్రజలు పొంగిపోయి బ్రహ్మ రథం పడతారనుకుంటున్నారేమో! ఇదంతా వైసిపి అధినేత జగన్ రాజకీయ అనుభవరాహిత్యానికి నిదర్శనం తప్ప మరొకటి కాదు. ఎన్నికలు ఈరోజు వచ్చినవి కావు. రేపటితో ఆగిపోయేవీ కావు. ఎన్నికలు అంటేనే పోటీ. ఎవరికి వారు గెలవడానికే పోటీ పడతారు. గెలుపు కోసం శతవిధాలుగా ప్రయత్నాలు చేస్తారు. కానీ అధికార, ప్రతిపక్ష నేతలు పరిధికి మించి వ్యవహరిస్తున్నారు. రాష్ట్రాన్ని ఆందోళనకరమైన బాట పట్టించేలా చూస్తున్నారు. దీన్ని ప్రజలు గమనిస్తున్నారనే విషయాన్ని విస్మరిస్తున్నారు.

పరిధికి మించి ఖర్చు!

పంచాయతీ ఎన్నికల నుంచి పార్లమెంటు ఎన్నికల వరకూ ఎన్నికల కమిషన్ విధించిన వ్యయం ఒక్కరోజుకు సరిపోదు. ఆయా పార్టీల తరపున పోటీ చేసే అభ్యర్థులను ఎంపిక చేసే ముందే 'ఎంత మేర ఖర్చు చేస్తారు? ఓటుకు ఎంత ఇస్తారు?' అని నిగ్గు తేల్చి మరీ ఖరారు చేసే అసాధారణ పరిస్థితులు ఉన్నాయి. 2014 నాటి ఎన్నికల్లో చాలా చోట్ల పార్లమెంటు స్థానానికి 100 కోట్లు, అసెంబ్లీ స్థానాలకు 50 కోట్ల రూపాయలు ఖర్చు చేశారు. విజయవాడలాంటి పార్లమెంటు స్థానానికి 200 కోట్ల రూపాయల వరకూ ఖర్చు చేసిన ఘనత ఉంది. ఇపుడు నంద్యాల ఉప ఎన్నికలో ఒక్కో అభ్యర్థి చేసే వ్యయం 50 నుంచి 75 కోట్ల రూపాయల వరకూ ఉంటుంది. ఓటుకు రెండు వేల రూపాయల నోటు ఇవ్వడానికి సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఇవి కాకుండా కార్యకర్తలను పోషించడం, ఇతరత్రా ఖర్చు అదనం. ఇపుడు నంద్యాలలో విచిత్రమైన పరిస్థితి నెలకొంది. అధికార, ప్రతిపక్షంలో ఓటర్లకు ఎవరు ఎక్కువ మొత్తం ఇస్తున్నారు అన్నదానిపై ఉభయ పార్టీలు నిఘా పెట్టాయి. ఇరు పార్టీలు ఒక్కో ఓటరుకు నగదు ఇవ్వడానికి సిద్ధమయ్యాయి. అధికార పార్టీ రు.1500 కోట్ల మేర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చేపట్టడానికి సిద్ధం అయ్యింది. ఇళ్లు, ఉద్యోగాలు, ఇతరత్రా ప్రభుత్వ పథకాలు వంటివి ఈపాటికే ప్రకటించారు. ప్రతిపక్షం దీన్ని ఢీకొట్టే రీతిలో 'మూడేళ్లుగా నంద్యాలను పట్టించుకోకుండా ఇపుడు చేసే ప్రకటనలు నమ్మవద్దు' అని తిప్పికొడుతోంది. మొత్తం మీద ఇరు పార్టీలూ నంద్యాలలో 'దేనికైనా సిద్ధం' అన్నట్టు తయారయ్యాయి. ముఖ్యమంత్రి చంద్రబాబుని ఢీకొనే స్థాయి తనకు ఉన్నదని నిరూపించుకునేందుకు జగన్ అనేక రకాలుగా సంకేతాలు ఇస్తున్నారు. అదే స్థాయిలో జగన్‌ను అడుగు ముందుకు వేయకుండా అధికార పక్షం కూడా అనేక ఆటంకాలు సృష్టిస్తోంది. వెరసి ప్రజల్ని, ప్రజాస్వామ్యాన్ని పరిహాస్యం చేస్తున్నారు. ఒక్క ఉప ఎన్నికకే ఇలా ఉంటే మరో రెండేళ్లలో రానున్న అసెంబ్లీ ఎన్నికలకు ఉభయ పార్టీలు ఎలాంటి విపరీత పరిణామాలను సృష్టిస్తాయో అనే భయం రాష్ట్ర ప్రజలకు ఏర్పడింది.

రాజకీయాలను వ్యాపారం చేశారు. ప్రజాసేవను ఖరీదు కట్టి అమ్మేస్తు న్నారు. ప్రజల్ని నమ్మించి మోసం చేయడానికి పార్టీలు అలవాటు పడ్డాయి. అయితే రోజులన్నీ ఒకేలా ఉండవు. ప్రజలు ఎపుడూ తీర్పును భిన్నంగానే ఇస్తున్న విషయాన్ని రెండు పార్టీల అధినాయకత్వం గుర్తించాలి. ఓటును నోటుతో కొనేయవచ్చనే భ్రమను కల్పిస్తున్నారు. ఓటర్లు కూడా నేతల కంటే తెలివిగా వ్యవహరిస్తున్నారు. నోట్లు ఎన్ని ఇచ్చినా, తీర్పు మాత్రం తెలివిగానే ఇచ్చే రోజులు వస్తున్నాయి. పార్టీలు, నేతలు చేసే విపరీత పోకడల్ని గమనిస్తున్నారు. అండగా నిలబడేది ఎవరో, అదఃపాతాళానికి తొక్కేసేది ఎవరో నిగ్గు తేల్చే రోజు కోసం ఎదురు చూస్తున్నారు. నంద్యాలతోనే అది ఆరంభం అవుతుందని నిరూపించే సమయం ఆసన్నం అయింది. ఓటర్లు తెలివిగా వ్యవహరించారని పార్టీలకు తెలిసేలా తీర్పు ఇవ్వాలి.

(రచయిత 10టీవీ డిప్యూటీ ఇన్‌పుట్ ఎడిటర్)
8498084059

మత బోధకులు సైన్సు చదువుకుంటే మంచిది

డాక్టర్ దేవరాజు మహారాజు



చర్చ

'అన్నీ వేదాల్లో ఉన్నాయష'- అని ఎవరైనా మాట్లాడితే వారివి పిచ్చి మాటలే అవుతాయి. ఆ కాలానికి ఉన్న అవగాహన, పరిజ్ఞానం మాత్రమే అందులో ఉన్నాయి. తర్వాత, అత్యాధునికంగా మనిషి అంతరిక్షంలో సాధిస్తున్న విషయాలు అందులో లేవు. గణితానికి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానానికి జోడీ కుదిర్చి సమకూర్చుకున్న విజ్ఞానం-పురాణాలలోనూ, వేదాలలోనూ, ఇతర ఏ మత గ్రంథాలలోనూ లేదు. ఇది వాస్తవం. సమకాలీనంలో బాలబాలికలకు, సామాన్య పౌరులకు ఉన్న వైజ్ఞానిక అవగాహన ప్రాచీన మేధావులకు ఉండి ఉండదు. ఆ సమాజాలకు వారు గొప్ప జ్ఞానులై ఉండొచ్చు. కానీ నేడున్న మేధాశక్తికి వారు సరితూగరు. ప్రాచీనులు మనకు గౌరవనీయులు. వారు కొన్ని ప్రాథమిక అంశాలను మనకు అందించింది నిజమే అయినా, ఈ కాలంలో విద్యావంతుడైన ఒక సామాన్య పౌరుడికి ఉన్న అవగాహన, ఆనాటి మేధావులకు లేదు. తప్పు వారిది కాదు. వారు జీవించిన సమాజ స్థాయే అలాంటిది. అలాగని వారి కృషిని తక్కువ చేయడం ఏమాత్రం కాదు.

సమాజం మారిపోయింది. సమాజ అవసరాలు మారిపోయాయి. ఆ రాజులూ, ఆ రాజ్యాలు, కత్తులు, బల్లాలు, గుర్రాలు, తోపులూ అన్నీ మాయమై పోయాయి. ఇక్కడ ప్రయోగిస్తే వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న మరో దేశాన్ని భస్మీపటలం చేసే అణ్వాయుధాల యుగంలో ఉన్నాం. వందేళ్ల కిందట పొద్దున్నే లేచి అమరం చదివేవాడు, గాయత్రీ మంత్రం, హనుమాన్ చాలీసా పఠించేవాడు జ్ఞాని, పండితుడుగా చలామణి అయ్యాడు. ఇప్పుడవి పనికి రానివయ్యాయి. విద్యావంతుల సంఖ్య పెరిగింది. ఆలోచనాపరులు ఎక్కువయ్యారు. పిల్లల విజ్ఞానం, ప్రతిభ చూస్తుంటే పెద్దలే హడలిపోతున్నారు. నేను చూసిన కొందరు పిల్లలున్నారు. మొదట, టీచరు వారికి పదుల్లో 20 సంఖ్యలు చెప్పారు. ఆయన చెప్పడం ఆపగానే వారు ఆ సంఖ్యలు మొత్తం చెప్పేశారు.



విశ్వ రహస్యాల్ని ఛేదిస్తున్న మానవుడికి ఈ మత బోధకుల రహస్యాలు విప్పడం ఒక లెక్కా? అసలైతే రహస్యాలేవీ లేవు. వారివి బూటకాలు, నాటకాలు కాబట్టే సామాన్యుల్ని సంశయంలో పడేస్తున్నారు. అన్ని మతాల మతబోధకులు కొంత ఖగోళ శాస్త్రం, కొంత జీవ శాస్త్రం, కొంత రసాయన శాస్త్రం, పరిణామ శాస్త్రంలోని కొన్ని ప్రాథమిక అంశాలు చదువుకొంటే బాగుంటుంది. అవి తెలుసుకోకుండా ఇప్పడు వారు చెప్పేదేమీ లేదు.

కాలిక్యులేటర్ నొక్కుతూ కూర్చున్న వాళ్లు సైతం అంత త్వరగా చెప్పలేరు. ఆ తర్వాత టీచర్ వందల్లో యాభై సంఖ్యలు చెప్పారు. ఎంతో ఉత్సాహంగా వారు, వాటి మొత్తం టక్కున చెప్పేశారు. తర్వాత అదే కూడిక వేలల్లో జరిగింది. పలకా బలపం కానీ, పెన్నూ కాగితం కానీ ఉపయోగించకుండా, ఊరికే వింటూ మెదడులోనే కూడికలు చేసుకుంటూ చెప్పారా పిల్లలు. గణితంలో ఇంత అద్భుతమైన శక్తి పూర్వకాలంలో ఎవరికీ ఉన్నట్టు మనం వినలేదు. ఈ ఆధునిక కాలంలోనే శకుంతలా దేవి పేరు విన్నాం. కానీ పదేళ్ల పిల్లలో ఇంత 'తెలివి' ఉండడం మామూలు విషయం కాదు. వాళ్లు దేనికైనా ఘనం, ఘన మూలం కూడా చెప్పేశారు.

ఇక కళల విషయానికొస్తే, యాభై యేళ్ల క్రితం, తన ఇరవయ్యోయేట ఓ ప్రసిద్ధ గాయని పాడిన పాటను ఇప్పుడు పదేళ్లలోపు పిల్ల అచ్చు అలాగే పాడగలుగుతోంది. అంటే కొత్త తరాలు ఎంత మేధోశక్తితో, కళా సంపత్తితో ఉన్నాయో మనం గమనించవచ్చు. నాకో అబ్బాయి తెలుసు. వాడికి నాలుగు సంవత్సరాలు. సుమారు డెబ్బయి దేశాల రాజధానుల పేర్లు చెబుతున్నాడు. గ్రహాలపేర్లు, ముఖ్యమైన వైజ్ఞానిక ఆవిష్కర్తలైన శాస్త్రజ్ఞుల పేర్లూ చెబుతున్నాడు. వార్తల కెక్కుతున్న ఇలాంటి చిన్నారుల్ని మనం టెలివిజన్ షోలలో కూడా చూస్తూనే ఉన్నాం. ఇలాంటి ప్రాథమిక సమాచారం, అవగాహన, ప్రవచన కారులకు ఏమైనా ఉందా? గమనించండి. వారి దగ్గరున్న పాత సామాను తెచ్చి మన దగ్గర 'సరుకు' చేసుకోవడం తప్ప ఇంకేమైనా ఉందా? చిన్నపిల్లలు ఇన్ని తెలివి తేటలు ప్రదర్శించ గలుగుతున్నారంటే ఎలా సాధ్యమవుతూ ఉందీ? ఒకటి- జన్యుశాస్త్ర రీత్యా వారసత్వ లక్షణాల వల్ల. రెండు- తల్లిదండ్రులిస్తున్న ప్రోత్సాహం వల్ల. మూడు- బాల్యంలో దొరికిన మంచి ఉపాధ్యాయుల వల్ల ఇలాంటివి సాధ్యం!! నేర్చుకోవడం, అభ్యాసం చేయడం, ఇది మానసిక ఆరోగ్యంలో భాగం. అంతేగాని ఎవరి దయాదాక్షిణ్యాల వల్లనో, కరుణా కటాక్షాల వల్లనో కాదు. పిల్లలతో భారతం- భాగవతం పద్యాలు వల్లె వేయిస్తే జ్ఞాపకశక్తి పెరుగుతుందేమో గాని, ఈ కాలానికి పనికొచ్చే లోకజ్ఞానం, అవగాహన పెరగదు.

ఆత్మశక్తి, ఆత్మజ్ఞానం అంటూ జనాన్ని మోసగించే అన్ని మతాల మత బోధకులూ మామూలు మనుషులే! గతంలో సాయిబాబా బెడ్‌రూంలో మూడు హత్యలు జరిగి, ముగ్గురు యువకులు చనిపోతే ఆయన ఆత్మశక్తి ఏమైంది? పోలీసులెందుకు రావాల్సి వచ్చింది? విషయాలేవీ బయటికి పొక్కకుండా ఆయన తన రాజకీయ పరిచయాలను ఎందుకు ఉపయోగించుకోవాల్సి వచ్చింది? ఆయన తన ఆత్మశక్తితో విషయాలన్నీ వివరంగా ప్రజలకు చెప్పాల్సింది కదా? విశ్వ రహస్యాల్ని ఛేదిస్తున్న మానవుడికి ఈ మత బోధకుల రహస్యాలు విప్పడం ఒక లెక్కా? అసలైతే రహస్యాలేవీ లేవు. వారివి బూటకాలు, నాటకాలు కాబట్టే సామాన్యుల్ని సంశయంలో పడేస్తున్నారు. అన్ని మతాల మతబోధకులు కొంత ఖగోళ శాస్త్రం, కొంత జీవ శాస్త్రం, కొంత రసాయన శాస్త్రం, పరిణామ శాస్త్రంలోని కొన్ని ప్రాథమిక అంశాలు చదువుకొంటే బాగుంటుంది. అవి తెలుసుకోకుండా ఇప్పుడు వారు చెప్పేదేమీ లేదు. ఏదో చెప్పాలన్న ఉబలాటం గురువులకు, ప్రవచనకారులకు ఉంటే ఉండొచ్చు. అది వారి బలహీనత- సామాన్య జనానికి ఇప్పుడు వారికన్నా ఎక్కువ విషయాలే తెలుసు. మరోపని లేక ప్రవచన- కాలక్షేపానికి వెళ్లి కూర్చునే వారు కొందరైతే, ఆ పంతులు గారికెంత తెలుసో చూద్దాం అని వెళ్లేవారు కొందరు. పాత సారాని కొత్త సీసాలో ఏమైనా పోస్తున్నారా? పాత పురాణాలకు కొత్త ఆధునిక విశ్లేషణలేమైనా ఇస్తున్నారా? అని ఆలోచించే వారు కొందరు. ఇలా నానా రకాల వాళ్లుంటారు.

ఈ తరం వారు యాభై ఏళ్లు వస్తేగాని ఎల్ఈడి టీవీ చూడలేకపోయారు. ఇప్పటి పిల్లలు పుట్టుకతోనే చూడగలుగుతున్నారు. విశ్వ విజ్ఞానాన్ని తమ స్వంతం చేసుకుంటూ ఎదుగుతున్నారు. మరి ఇంకా ఎందుకండీ రాముడి కథలూ, భీముడి కథలూ, అభూత కల్పనలూ? వ్యక్తిత్వ వికాసానికి విషయాలు కావాలంటే ప్రపంచ చరిత్రలో నీతిపరులు, నిజాయితీ పరులు, పోరాట వీరులు, త్యాగధనులు ఎంతో మంది ఉన్నారు. పురాణ పురుషుల వ్యక్తిత్వాలు-చెప్పుకునేవారికి కాలక్షేపమేగానీ, వినే వారికి వాటివల్ల ఉపయోగం లేదు. ఈ కాలంలో పిల్లలు జై హనుమాన్‌ను సూపర్‌మ్యానులా చూస్తున్నారు తప్పితే, వెనకటి రోజుల్లో లాగా భక్తి భావమూ, తన్మయత్వమూ ఉండడం లేదు. ఇక ఈ ప్రవచనకారులు వారి ధోరణి మార్చుకుని, పర్యావరణ పరిరక్షణ గురించి, ధరిత్రీ దినోత్సవం గురించి మాట్లాడాలి. ధరిత్రీ దినోత్సవం ఎప్పుడు ఎందుకు జరుపుకోవాలి లాంటివి చెపితే సమాజానికి మేలు చేసినవారౌతారు. జన్మలు, పునర్జన్మలు, అతీంద్రియ శక్తులు, క్షుద్ర శక్తులు వంటివి బోధించకుండా విశ్వాంతరాళం గురించి అధ్యయనం చేసి జనానికి చెప్పాలి. మనం చెప్పుకునే పుక్కిటి పురాణాలకు, సైన్సు సిద్ధాంతాలకు ఎక్కడ తేడా వస్తోంది అనేది అర్థం చేసుకోవాలి. ఎందుకంటే వారెంత నెత్తీ నోరూ బాదుకున్నా ఆ పురాణ పాత్రల్లో ఏ ఒక్కటీ కూడా సజీవంగా ఈ ప్రపంచం లోకి రాదు-వారిని బొందితో స్వర్గానికి తీసుకుపోదు. అందువల్ల వారు కాస్త మనుషుల్ని మనుషుల్లా చూస్తు, తాము కూడా మానవమాత్రులమేనన్న వాస్తవాన్ని జీర్ణించుకోవాలి.

మత పెద్దలు ఒకప్పుడు సైన్సు ఎదగకుండా శాస్త్రజ్ఞుల్ని మట్టుబెట్టారు. వారి ఆధిక్యతను ప్రశ్నించినందుకు చంపేశారు. అదంతా గతం. ఇప్పుడు ప్రశ్న బలపడింది. జవాబులు చెప్పగలగాలంటే నిరంతర అధ్యయనం, పరిశీలన, పరిశోధన అవసరం. జ్ఞానానికి కూడా అర్థం మారింది. అందువల్ల మత బోధకులే మతాల అడ్డుగోడల్ని కూలగొట్టే పని ప్రారంభిస్తే మంచిది. అప్పుడు జనం స్వచ్ఛందంగా ఒకరినొకరు కలుసుకుంటారు. ఒకరి గురించి ఒకరు పట్టించుకుంటారు. ప్రేమలు పెంచుకుంటారు. ఆత్మీయతను పంచుకుంటారు. ఆ ప్రయత్నంలో విశ్వ మానవ గీతికను పాడుకుంటారు.

(రచయిత సుప్రసిద్ధ సాహితీవేత్త, సైన్స్ ప్రొఫెసర్),
9908633949.

డాటర్ ఆఫ్ గ్రౌండ్‌మెన్



కాస్తంత ఆటలాడే స్థలం కనిపిస్తే.. పిల్లలు ఒక్కసారిగా సీతాకోక చిలుకలైపోతారు. తోటిపిల్లల్ని పదపద..రా..రమ్మంటూ.. రకరకాల ఆటల్లో తేలిపోతూ సమయం మర్చిపోతారు. ఆటస్థలానికి, పిల్లలకు మధ్య అనుబంధం అలాంటిది. కానీ, అలాంటి మైదానమే శైలూ నూర్ బాషాకు రాత్రిపగలు గడిపే ఇల్లయింది. తన తండ్రి క్రీడామైదానంలో గ్రౌండ్‌మెన్‌గా పనిచేస్తుండటంవల్ల.. అమ్మా నాన్న చెల్లితో కలిసి గ్రౌండ్‌లో ఉన్న ఓ చిన్నగదిలోనే పెరిగింది. అలా చిన్నప్పటి నుంచీ గ్రౌండ్‌ను చూస్తు పెరిగిన ఆ అక్కాచెల్లెళ్ల కలలు, ఆశయాలూ.. నిత్యం గ్రౌండ్ చుట్టూనే తిరిగాయి. దానికితోడు మైదానాన్ని కాపుకాసే గ్రౌండ్‌మెన్‌గా నాన్న పడే కష్టాలు, బిడ్డల కోసం అమ్మ పడే తపన అన్నీ వారి మనసులో ముద్రపడిపోయాయి. ఫలితంగా.. అందరూ శభాష్ అని అనేలా క్రీడల్లో రాణిస్తున్నారు. డాక్టర్ బిడ్డలు డాక్టర్లుగా, ఇంజనీర్ బిడ్డలు ఇంజనీర్లుగా పేరుపొందడంలో గొప్పేముంది? ఓ సాధారణ గ్రౌండ్‌మెన్ కూతురు అంతర్జాతీయ వేదికపైకి అడుగులు వేస్తోందంటే కచ్చితంగా ఆ తల్లిదండ్రుల గురించి మాట్లాడుకోవాలి. 'నా కూతురు ఇప్పుడు టేబుల్ టెన్నీస్‌లో ఇంటర్‌నేషనల్ ఛాంపియన్' అని ఆ తండ్రి గర్వంగా చెప్పకునేలా ఎదిగిన ఓ అమ్మాయి క్రీడాజీవిత విశేషాలు జీవన పాఠకుల కోసం.

ఖాసీం నూర్ బాషా, ఆషాబీ దంపతులు. వీరికి శైలూ నూర్ బాషా, నజీరాబీ బాషా ఇద్దరు అమ్మాయిలు. విజయవాడ ఇందిరాగాంధీ స్టేడియంలో ఖాసీంది గ్రౌండ్‌మెన్ పని. స్టేడియంలో కేటాయించిన ఓ చిన్న గదే పదిహేడు సంవత్సరాలుగా వారి నివాసం. ప్రస్తుతం శైలూ డిగ్రీ, నజీరా పదవ తరగతి చదువుతున్నారు.

ప్రతిభ వెలుగులోకి

శైలూ గతేడాది మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో జరిగిన అంతర్జాతీయ జూనియర్ ఓపెన్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్‌లో మంచి ప్రతిభ కనబరిచి అందరినీ ఆకర్షించింది. మొదటినుంచీ తండ్రి ఖాసీంకు ఆటలంటే ఎంతో ఇష్టం. దాంతో పిల్లలిద్దరినీ చిన్నప్పటి నుంచే అటువైపుగా అడుగులు పడేలా కృషిచేశారు. అమ్మాయిలిద్దరినీ ఇంటికి దగ్గరలోనే ఉన్న ఓ స్పోర్ట్స్ అకాడమీలో జాయిన్ చేశారు. టేబుల్ టెన్నిస్‌పై వీరి శిక్షణకు అక్కడే బీజం పడింది. పెద్దమ్మాయి శైలూ పదో తరగతిలోకి అడుగుపెట్టిప్పటి నుంచి వరుసగా ఈ క్రీడలో రాణిస్తూ వచ్చింది. 'మొదట్లో చాలామంది తెలిసినవారు ఆడపిల్లలకు ఈ ఆటలు అవసరమా? మీ ఆర్థిక స్థోమతకుమించి ఆశపడుతున్నారు! అంటూ నిస్పృహ కలిగించిన మాటలు మేం ఎప్పటికీ మర్చిపోలేం. అలాంటి వారందరికీ ఇప్పుడు నా కూతుళ్ల సమాధానం చెప్పే రోజులు వచ్చాయి' అంటూ మురిసిపోతున్నారు ఈ దంపతులు.

ఎన్నో సవాళ్లు!

పూటగడవడం కష్టంగా ఉన్న రోజుల్లో శైలూ టేబుల్ టెన్నిస్‌లో మంచి విజయాలు సాధించింది. ఎలాగైనా ఆటలో కూతురును ఉన్నస్థాయిలో చూడలన్న ఖాసీం తపన ఆ కష్టాలకు ఎదురునిలిచేలా చేసింది. 'అమ్మాయి ఏవైనా పోటీలకు వెళ్ళాల్సివస్తే ఆయన మొఖంలో సంతోషంతోపాటు టెన్షన్ ఎక్కుగా కనిపించేది. దూర ప్రాంతాలకు వెళ్లాలంటే డబ్బు కావాలి. అందుకోసం ఆయన చేసే ప్రయత్నాలు అన్నీఇన్నీ కావు' అంటూ నిన్నటిరోజున పడ్డ ఆర్థికపరమైన కష్టాలను గుర్తు చేసుకున్నారు శైలూ తల్లి ఆషాబీన్. మంచి కోచింగ్ ఇప్పించేంత ఆర్థిక స్థోమత లేకపోవడంతో ఖాసీం దంపతులు ఆలోచనలలో పడ్డారు. అలాంటి సందర్భంలో కోచ్ దామోదర్ రెడ్డి పరిచయం ఆ కుటుంబానికి ఓ వెలుగురేఖ అనే చెప్పాలి. 2009 నుంచి శైలూకు ఆయన కోచ్‌గా వ్యవహరిస్తున్నారు. ప్రతి క్షణం ఆమెకు వెన్నుదన్నుగా నిలుస్తున్నారు.

కఠోర సాధన

రోజూ ఉదయం ఐదు గంటలకు శైలూ దినచర్య మొదలవుతుంది. 5.30 కి బస్సు లేదా ఆటోలో ఆరు కిలోమీటర్ల దూరంలో పడమటలో ఉన్న సిహెచ్ఆర్‌కె ఇండోర్ స్టేడియంకు చేరుకుంటుంది. అక్కడ కోచ్ దామోదర్‌రెడ్డి సాయంతో ప్రాక్టీస్ మొదలు పెడుతుంది. మూడు గంటల ప్రాక్టీస్ తర్వాత ఇంటికి తిరుగు ప్రయాణం. మళ్లీ సాయంత్రం నాలుగు నుంచి ఎనిమిది వరకూ ప్రాక్టీస్. ఈ టైం టేబుల్ సంవత్సరాలుగా కొనసాగిస్తూ కఠోర దీక్షతో ముందుకు సాగుతోంది.






సమస్యలున్నాగానీ!

'ఊహ తెలిసిన నుంచి ఈ గ్రౌండే నా ప్రపంచం. ఎప్పుడూ ఆటపాటలతో కిటకిటలాడే ఈ గ్రౌండ్(క్రీడామైదానం) అంటే నాకు చాలా ఇష్టం. బహుశా అదే నాలో ఆటపై ఆసక్తి కలిగించి ఉండొచ్చు. మా ఇద్దరి దృష్టిలో నాన్న ఓ రియల్ హీరో!' అంటోన్న శైలూ మాటలు ఆడపిల్లలను కన్న ఎందరో తల్లిదండ్రులకు స్ఫూర్తినిస్తాయడంలో సందేహం లేదు. ప్రస్తుతం శైలూకు ఏడాది కాలంగా ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా స్కాలర్‌షిప్‌ను అందజేస్తుంది. నిజానికి టేబుల్ టెన్నీస్ అంటే ఓ ఖరీదైన ఆట. ఇందులో ఉపయోగించే ప్రతి క్రీడాపరికరం చాలా ఖరీదైనవి. దానితోపాటు ఓపెన్ ర్యాంకింగ్స్ టోర్నమెంట్స్‌లో ఆడేందుకు స్పాన్సర్‌షిప్ తప్పనిసరిగా ఉండాలి. ప్రస్తుతం శైలూ చెల్లెలు నజీరాబీన్‌కూడా అక్కలాగానే నేషనల్ స్థాయిలో టెబుల్‌టెన్నీస్‌లో రాణిస్తోంది. తన తల్లిదండ్రులు తమపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ముచేయనంటూ ధైర్యంగా చెబుతోంది.

'ఇండియన్ ఓపెన్ ఈ నవంబర్‌లో జరుగుతాయి. అందులో ఎంట్రీ దొరకుతుందని అనుకుంటున్నాను. అసోషియేషన్ మరింత సహకారం అందిస్తే భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధిస్తా. ఆటకు ప్రాధాన్యం ఇచ్చి నాకు ఇప్పటివరకూ సహకరించిన స్కూల్, కాలేజీ యాజమాన్యాలకు ధన్యవాదాలు. భవిష్యత్తులోకూడా ఈ సహకారం ఇలానే కొనసాగుతుందని ఆశిస్తున్నాను' అని తనని వెన్నంటి ప్రోత్సహిస్తున్న వారందరినీ గుర్తుచేసుకుంది శైలూ.

- చందు తిలారు

మా నాన్న గ్రౌండ్‌మెన్



టేబుల్ టెన్నీస్ అనగానే ఇదో రాయల్ గేమ్‌గా చెబుతారు. ఆర్థికంగా మంచి స్థితిలో ఉంటేనే ఇలాంటి గేమ్స్‌లో రాణించగలం అనేది తప్పు. నా దృష్టిలో సాధించగలం అనే ఆత్మవిశ్వాసం ఉంటే ఈక్రీడలో ఎవరైనా రాణించవచ్చు. మానాన్న గ్రౌండ్‌మెన్. చిన్నజీతగాడు. అయినా నేను టేబుల్‌టెన్నీస్‌లో రాణిస్తున్నా. భవిష్యత్తులో భారత్ తరపున ఒలంపిక్స్‌లో పతకం సాధించి, మన జెండా ఎగరేయాలి. నా తల్లిదండ్రుల్నీ బాగా చూసుకోవాలి. ఇవే నాముందున్న లక్ష్యాలు.

- శైలూ నూర్ బాషా,
ఫోన్ : 9985670058

ప్రోత్సాహం ఉంటే?!



టేబుల్ టెన్నిస్‌కు స్టేడియంతోపాటు అనుభవజ్ఞులైన కోచ్‌ల కొరత ఎక్కువగా ఉంది. ప్రాక్టీస్ సమయంలో సీనియర్ పాట్నర్స్ ఉండాలి. అది కూడా సమస్యగా ఉంది. ఎన్ని సమస్యలు ఉన్నా శైలూ ఏకాగ్రతతో ఆడుతుంది. అదే ఆమె ప్లస్ పాయింట్. స్పాన్సర్స్ సహకరిస్తే టేబుల్ టెన్నీస్‌లో ఓ సుస్థిర స్థానాన్నికైవసం చేసుకుంటుందనే నమ్మకం ఉంది.

- దామోదర్‌రెడ్డి, కోచ్

శైలూ ఆడిన కొన్ని పోటీలు



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉమెన్ ఛాంపియన్‌షిప్(2013), స్టేట్ ఛాంపియన్ రన్నరప్ (2012), 2014 జూనియర్ అండ్ సబ్ జూనియర్ డబుల్స్ విభాగాల్లో రెండు సిల్వర్ మెడల్స్. 2011-15 జార్ఖండ్ అండ్ కేరళ నేషనల్ గేమ్స్‌లో పార్టిసిపేట్ చేసిన యంగెస్ట్ ఉమెన్ పర్సన్‌గా సంపాదించింది. జూనియర్ ఇండివిడ్యువల్ మెడల్ 2015-16. అలాగే, సీనియర్ నేషనల్ ఛాంపియన్‌షిప్ ఉమెన్ బ్రాంజ్ మెడల్, ఎఎఐ కి 2016లో ప్రాతినిథ్యం వహించింది. పబ్లిక్ సెక్టార్ బ్రాంజ్ మెడల్ 2017ను శైలు సొంతం చేసుకుంది.

సెల్‌ఫోన్‌తో ముప్పే



కంప్యూటర్లు, సెల్‌ఫోన్‌లు లేని ప్రపంచాన్ని ఊహించలేము. ముఖ్యంగా ప్రతిఒక్కరికీ సెల్‌ఫోన్ తప్పనిసరి అవసరంగా మారిపోయింది. అయితే సెల్‌ఫోన్‌లు, సెల్‌ఫోన్ టవర్లు సమాచారానికి సంబంధించిన సంకేతాలను ఒకచోటి నుంచి మరోచోటికి పంపేందుకు అత్యంత శక్తిమంతమైన సూక్ష్మతరంగాలను (మైక్రోవేవ్స్) ఉపయోగిస్తాయి. ఎక్సరేలలాగా ఈ తరంగాలు కూడా అతి సులభంగా మన శరీరంలోకి చొచ్చుకుపోగలుగుతాయి. ఇలా శరీరంలో నుంచి ప్రయాణించే ఈ సూక్ష్మ తరంగాలు మన శరీరకణాల్లో కొన్ని అవాంఛనీయమైన మార్పులను తీసుకొస్తాయని, అవి భవిష్యత్తులో మనకు ప్రమాదకరంగా పరిణమిస్తాయని కొందరు నిపుణులు చెబుతున్నారు. వారు చెప్పేదాని ప్రకారం సెల్‌ఫోన్‌లకు సంబంధించిన తరంగాలు పెద్దవారి మెదడుపై కంటే పిల్లల మెదడుపై మూడురెట్లు ఎక్కువ ప్రభావాన్ని చూపుతాయి.

- మనలో ఎడమభాగపు మెదడు కన్నా కుడిభాగపు మెదడు సున్నితంగా ఉంటుంది. అందుకని సెల్‌లో మాట్లాడేటప్పుడు ఎడమ చెవినే ఎక్కువగా ఉపయోగించడం మంచిది.
- సెల్‌ఫోన్ ఎంత చిన్నగా ఉంటే తరంగాల వల్ల కలిగే దుష్ప్రభావం అంత ఎక్కువగా ఉంటుంది. సెల్‌ఫోన్‌లో గంటల తరబడి మాట్లాడటం మన ఆరోగ్యానికి ఏమాత్రం మంచిది కాదు. సాధ్యమైనంతవరకు సెల్‌ఫోన్‌లో క్లుప్తంగా మాట్లాడటం మంచిది. +

ప్రాణదాతగా మారిన ఆకాశ్



మారుతున్న కాలంతో పాటు కొత్త కొత్త రోగాలు ప్రజల్లో పీడుస్తున్నాయి, అందులో ముందు వరుసలో ఉండేది గుండె సంబందిత వ్యాధులు. రక్త ప్రసరణ సరిగ్గాకాక గుండెపోటు(హార్ట్ ఎటాక్)తో చనిపోయిన వారు ఈ మధ్య ఎక్కువవుతున్నారు. రోగికి తేరుకునే సమయం ఇవ్వకుండా సడెన్‌గా వచ్చి ప్రాణాలు హరిస్తుంది ఈ నిశ్శబ్ద గుండెపోటు. చాలా ఆరోగ్యంగా ఉండే తన తాత ఒక్కసారిగా సైలెంట్ హార్ట్ఎటాక్‌తో కుప్పకూలిపోవడాన్ని తట్టుకోలేకపోయాడు ఆకాశ్. తన తాతకు ఎందుకు ఇలా అయ్యిందో, ఇంత సాంకేతికత అందుబాటులో ఉన్నా తన తాత హార్ట్ ఎటాక్ గురించి ముందే ఎందుకు తెలుసుకోలేకపోయాడో బాగా ఆలోచించి, వదలకుండా పరిశోధించి రెండు సంవత్సరాలలో సైలెంట్ హార్ట్ఎటాక్‌లను ముందే పసిగట్టే పరికరాన్ని కనుగొన్నాడు.

ఇప్పుడు 10వతరగతి చదువుతున్న కర్ణాటకకు చెందిన ఆకాశ్, తన తాతకు హార్ట్ఎటాక్ వచ్చిన తరువాత దాని గురించి తెలుసుకోవడం మొదలు పెట్టాడు. చాలా పుస్తకాలు, మెడికల్ జర్నల్స్ చదివాడు, మరింత సమాచారాన్ని ఇంటర్‌నెట్ ద్వారా సంపాదించి సైలెంట్ హార్ట్ ఎటాక్‌లకు మూల కారణాన్ని తెలుసుకొని దాన్ని ఎలా గుర్తించాలన్న విషయం మీదా రెండేళ్ళు పరిశోధన చేసాడు. అతని పరిశోధన ఫలించి జపాన్‌లోని టోక్యో సైన్స్ యూనివర్సిటీ నుంచి పిలుపు అందింది. వారి ఆర్థిక సహకారంతో ఆకాశ్ సైలెంట్ హార్ట్ఎటాక్‌లను ముందే గుర్తించి రోగిని హెచ్చరించే సిలికాన్ పాచ్‌ని కనుగొన్నాడు. రోగి చెవి, మణికట్టు వెనుక భాగంలో అమర్చే ఈ పాచ్ ఆ రోగికి హార్ట్ ఎటాక్ వచ్చే సూచనలు ఉంటే వెంటనే తెలుపుతుంది. రోజుకు రెండు సార్లు ఎవరి సహాయం లేకుండా ఈ పరికరాన్ని ఉపయోగించి రోగులు తమ రక్త ప్రసరణ గురించి తెలుసుకోవచ్చు. తన కృషిని దేశానికి అంకితం చేస్తూ తన పరికరాన్ని భారత ప్రభుత్వంతో కలిసి 900 రూపాయలకే అందరికి అందుబాటులోకి తెస్తున్నట్లు ప్రకటించాడు ఆకాశ్. చదివింది 10వ తరగతి అయినా కోట్ల మంది హృద్రోగుల పాలిట ప్రాణదాతలా మారాడు ఈ ఆకాశ్. +





మీ కోసం

బంగాళదుంపని తురిమి గుజ్జులా చేసుకుని దాన్ని ముఖానికి పట్టించి, పది నిముషాల తర్వాత కడిగేస్తే.. ముఖంలో అలసట పోయి మెరుపు కనిపిస్తుంది.



జీవన సౌరభం

అన్నీ మన మంచికే అనుకుంటే ఆపదలోనూ ఆత్మవిశ్వాసం సడలదు.

'జీవన'పై మీ స్పందన

'జీవన' పేజీలు మీకెలా అన్పిస్తున్నాయి? ఇంకా ఏం కావాలని కోరుకుంటున్నారు? మీ కుటుంబసభ్యుల, మిత్రుల, బంధువుల స్పందన ఎలా ఉంది? 'ప్రజాశక్తి' కార్యాలయానికి రాయండి. మీ సూచనలు, సలహాలు మాకు తెలియజేయండి.

మా చిరునామా: జీవన, ప్రజాశక్తి దినపత్రిక, హౌస్ నెం : 7-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2, ఇ మెయిల్ jeevanapageps@gmail.com ఫోన్ నెం. 9490099006 మీ ప్రశ్నలకు 12-6 గంటల వరకు ఫోనులో చెప్పవచ్చు. ఆదివారం సెలవు.

సెన్సెక్స్ ▲ 322
31,770

నిఫ్టీ ▲ 103
9,897

రూపాయి ▼ 02 పైసలు
ఒక అమెరికా డాలరుకు రూ. 64.14



రూ.800 తగ్గిన వెండి

రూ.30వేల దిగువన పసిడి

న్యూఢిల్లీ : ఉత్తర కొరియా, అమెరికా దేశాల భౌగోలిక ఆందోళనల నేపథ్యంలో వరుసగా పెరిగిన బంగారం, వెండి ధరలు బుధవారం కొంత దిగివచ్చాయి. పది గ్రాముల బంగారంపై రూ.300 మేర తగ్గగా, కిలో వెండిపై ఏకంగా రూ.800 దిగివచ్చింది. ప్రపంచ మార్కెట్లలో స్తబ్దతకు తోడు దేశీయంగా స్థానిక అభరణాల వర్తకుల నుంచి డిమాండ్ తగ్గడం కూడా ఈ లోహాల ధరలు దిగిరావడానికి దోహదం చేశాయి. అంతర్జాతీయంగా సింగపూర్‌లో ఒక్క ఔన్స్ పసిడి ధర 0.09 శాతం తగ్గి 1,270 డాలర్లుగా పలికింది. దేశీయంగా న్యూఢిల్లీ బులియన్ మార్కెట్లో 99.9 శాతం, 99.5 శాతం స్వచ్ఛత కలిగిన 10 గ్రాముల బంగారంపై రూ.300 దిగివచ్చి వరుసగా రూ.29,750, రూ.29,600గా నమోదయ్యింది. కిలో వెండిపై రూ.800 కోల్పోయి రూ.39,300గా పలికింది. 100 వెండి నాణేలపై రూ.1000 కోల్పోయి రూ.72,000 వద్ద ముగిసింది.

అనూహ్య పరుగు


- సెన్సెక్స్ 322 పాయింట్ల ర్యాలీ
- 9900 పాయింట్లకు చేరువలో నిఫ్టీ

ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా రెండో సెషన్లోను తమ జోరును కొనసాగించాయి. అమెరికా-ఉత్తర కొరియాల మధ్య నెలకొన్న అనానుకూల వాతావరణాన్ని కాస్త తేలిక పరుస్తూ శాంతి ప్రక్రియ మొదలవడం, యుఎస్ ఫెడరల్ నుంచి అందిన సానుకూల పవనాలు, తక్కువ ధరల వద్ద అధిక మొత్తంలో స్టాక్స్‌ను చేజిక్కించుకొనేందుకు దేశీయ సంస్థాగత మదుపరులు ఉత్సుకత చూపడం తదితర వాటి నేపథ్యంలో మార్కెట్లు పరుగులు పెట్టాయి. వీటికి తోడు సెబీ అనుకూల నిర్ణయాలు కూడా మదుపర్లలో విశ్వాసాన్ని నింపాయి. దీంతో బుధవారం ఉదయం లాభాల్లో ప్రారంభమైన మార్కెట్లు ఆ తరువాత కొద్దిగా తడబడడం కనిపించింది. దేశీయంగా మార్కెట్ అనుకూల సంకేతాలు అందడం, ఐరోపా మార్కెట్ల దన్నుతో మధ్యాహ్నం తరువాత సూచీలు మరింత దూకుడును ప్రదర్శించాయి. చివరకు మార్కెట్లు ముగిసే సమయానికి బిఎస్ఇ సూచీ సెన్సెక్స్ 321.86 పాయింట్ల మేర పెరిగి 31,770.89 పాయింట్లకు చేరింది. మరోవైపు ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ కూడా 103.15 పాయింట్ల మేర పెరిగి మ్యాజిక్ ఫిగర్ 9,900 పాయింట్లకు చేరవలో 9,897.30 పాయింట్ల వద్ద ముగిసింది.

బిఎస్ఇలోని రంగాల వారీ సూచీల్లో ఎఫ్ఎంసిజి సూచీ అత్యధికంగా 2.94%, లోహ సూచీ 1.72%, వాహన రంగ సూచీ 1.62%, బ్యాంకింగ్ రంగ సూచీ 1.26%, మౌలిక రంగ సూచీ 0.18%, యంత్ర పరికరాల సూచీ 0.13% మేర పెరిగాయి. సెన్సెక్స్‌లో అత్యధికంగా టాటా మోటార్స్ 3.57% మేర పెరిగి ఆరేండ్ల గరిష్టాన్ని తాకింది. దీనికి తోడు సిప్లా 3.54%, ఐటీసీ 3.01%, హెచ్‌యూఎల్ 3.033%, సన్ ఫార్మా 2.69 శాతం మేర పెరిగింది. మరోవైపు అత్యధికంగా నష్టపోయిన స్టాక్స్‌లో ఎన్‌టీపీసీ 1.05%, ఏషియన్ పెయింట్స్ 0.94%, పవర్ గ్రిడ్ 0.81%, లూపిన్ 0.56% స్టాక్స్ ఉన్నాయి. దేశీయంగా రిటైల్ ద్రవ్యోల్బణం పెరిగినప్పటికీ దేశీయ సంస్థాగత మదుపరులు అధిక మొత్తంలో కొనుగోళ్లకు దిగుతుండడం మార్కెట్లకు బాగా కలిసి వస్తోందని స్టాక్ బ్రోకర్లు విశ్లేషిస్తున్నారు.

డిజిన్వెస్ట్‌మెంట్ వేగవంతం

- త్వరలో నాలుగు పిఎస్‌యుల్లో వాటాల విక్రయం
- మొదలైన అడ్వైజర్ల నియామక ప్రక్రియ



న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగ కంపెనీల్లోని వాటాల విక్రయంపై కొద్ది నెలలుగా నిశ్శబ్దంగా ఉన్న మోడీ ప్రభుత్వం తాజాగా మళ్లీ దృష్టి కేంద్రీకరిస్తోంది. పిఎస్‌యుల వాటాలను ప్రయివేటు మార్కెట్ శక్తులకు విక్రయించే ప్రక్రియను వేగవంతం చేసినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే త్వరలోనే నాలుగు పిఎస్‌యుల్లోని వాటాలను విక్రయించడానికి సలహాదారులను నియమించుకునే పనిలో పడింది. తాజా డిజిన్వెస్ట్‌మెంట్ జాబితాలో స్కూటర్ ఇండియా, బిఇఎంఎల్, పవన్ హాన్స్ లిమిటెడ్, హిందుస్థాన్ ప్రెఫబ్ కంపెనీలున్నాయని ఓ సీనియర్ అధికారి తెలిపారు.. ఈ కంపెనీల్లోని పాక్షిక లేదా మొత్తం వాటాలను ఉపసంహరించుకోవడానికి కేంద్ర ప్రభుత్వం ప్రక్రియను ప్రారంభించిందని ఈటి ఒక కథనం వెల్లడించింది. ప్రయివేటు కంపెనీలకు ప్రాధాన్యతనిస్తున్నట్లు ఆ అధికారి తెలిపారు. ఈ లావాదేవీలకు కావల్సిన విధానం కోసం ప్రొఫిషనల్ మధ్యవర్తులను నియమించుకోనున్నామన్నారు.

ప్రభుత్వం బ్యాంకు దివాలా కోడ్‌తో పాటు ఇతర ఆర్థిక సంస్కరణలను చేపట్టిందని ఆ అధికారి తెలిపారు. పిఎస్‌యులతో పాటు పలు స్పెసిఫైడ్ అండర్‌టేకింగ్ ఆఫ్ ది యూనిట్ ట్రస్టు ఆఫ్ ఇండియా (ఎస్‌యుయుటిఐ)ల్లోని సర్కార్ వాటాలను కూడా ఉపసంహరించుకునే ప్రక్రియ కొనసాగుతుంది. ఐటిసి, ఎల్అండ్‌టి, యాక్సిస్ బ్యాంకు లాంటి పలు ప్రయివేటు లిస్టెడ్ కంపెనీల్లో ఉన్న ప్రభుత్వ వాటాలను ఎస్‌యుయుటిఐ ద్వారా సమకూర్చినవి. ఈ కంపెనీల్లో సర్కార్‌కు ఉన్న మైనారిటీ వాటాలను విక్రయించనున్నారు. ప్రభుత్వ డిజిన్వెస్ట్‌మెంట్ జాబితాలో స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా, ఎన్‌టిపిసి, ఒఎన్‌జిసి లాంటి బ్లూచిప్ కంపెనీలతో పాటు ఎన్‌యుయుటిఐ పెట్టుబడులు కలిగిన ఎల్అండ్‌టి, ఐటిసి, యాక్సిస్ బ్యాంకు సంస్థలు న్నాయి.

లక్నో కేంద్రంగా పని చేస్తోన్న స్కూటర్స్ ఇండియా లిమిటెడ్‌లోని పూర్తి వాటాలను ఉపసంహరించుకోవడానికి కేంద్రం తీవ్ర ఆసక్తితో సన్నద్ధం అవుతోందని ఆ అధికారి తెలిపారు. కాగా బిఇఎంఎల్‌లో 26 శాతం వాటా విక్రయించాలని యోచిస్తోంది. ఢిల్లీ కేంద్రంగా పని చేస్తోన్న హెలిక్యాప్టర్ల తయారీ కంపెనీ పవన్ హాన్స్ లిమిటెడ్‌లోనూ 51 శాతం వాటా విక్రయానికి ఆసక్తి చూపుతోంది. ఇదే జరిగితే పవన్ హాన్స్‌లోని మెజారిటీ వాటా ప్రయివేటు కంపెనీల చేతికి పోనుంది. పవన్ హాన్స్‌లో వాటా విక్రయానికి పౌర విమానయాన మంత్రిత్వశాఖ అనుమతి కోసం ఎదురు చూస్తున్నామని సదరు అధికారి వెల్లడించారు.

హెచ్‌పిసిఎల్, ఒఎన్‌జిసి విలీనం కోసం కేంద్ర ప్రభుత్వం ఒక కన్సల్టెంట్, లీగల్ అడ్వైజర్లను నియమించే ప్రయత్నంలో ఉందన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు కేంద్ర ప్రభుత్వం వివిధ పిఎస్‌యుల్లో రూ.8,427 కోట్ల విలువ చేసే వాటాలను ఉపసం హరించుకుంది. వచ్చే మార్చి నాటికి రూ.72,500 కోట్ల డిజిన్వెస్ట్‌మెంట్ చేపట్టాలని మోడీ సర్కార్ 2017-18 బడ్జెట్‌లో నిర్దేశించుకుంది. ఇందులో స్ట్రాటిజిక్ వాటాల విక్రయం ద్వారా రూ.15,000 కోట్లు సమకూర్చుకుంది. కాగా ప్రస్తుతం మొత్తం ప్రతిపాదిత డిజిన్వెస్ట్‌మెంట్ ఇష్యూలు వేగవంతం అవుతున్నాయని సదరు అధికారి తెలిపారు. త్వరలోనే బీమా కంపెనీలు కూడా మార్కెట్లోకి రానున్నాయని పేర్కొన్నారు.

కోత బాటలో యస్ బ్యాంకు

న్యూఢిల్లీ : ఇప్పటికే సేవింగ్ ఖాతాలపై వడ్డీ రేట్లు తగ్గించని ఎస్‌బిఐ, యాక్సిస్ బ్యాంకు, ఇండియన్ బ్యాంకు బాటలో తాజాగా యస్ బ్యాంకు చేరింది. ప్రయివేటు రంగానికి చెందిన యస్ బ్యాంకు సేవింగ్స్ అకౌంట్ మొత్తాలపై పావు శాతం వడ్డీని తగ్గించి 6.25 శాతంగా నిర్ణయించింది. కాగా లక్ష రూపాయల కన్నా తక్కువున్న సేవింగ్ ఖాతాలపై వడ్డీని ఏకంగా 100 బేసిస్ పాయింట్లు కోత పెట్టింది. దీంతో ఈ వడ్డీరేట్లు 5 శాతానికి పడిపోయింది. లక్ష రూపాయల నుంచి కోటి లోపు ఉన్న మొత్తాలకు వడ్డీరేటును 6 శాతంగా ఉంచింది. కోటి రూపాయలు పైబడిన ఖాతాలపై 6.25 శాతం వడ్డీని అందించనుంది. తగ్గించిన వడ్డీ రేటు సెప్టెంబర్ ఒక్కటో తేది నుంచి అమల్లోకి వస్తుందని ఆ బ్యాంకు పేర్కొంది.

డొల్ల కంపెనీలపై ఆడిటింగ్

న్యూఢిల్లీ : డొల్ల కంపెనీల లావాదేవీలపై స్టాక్ మార్కెట్లు దృష్టి పెట్టాయి. ఇప్పటికే డొల్ల కంపెనీలుగా అనుమానిస్తున్న 331 వాటిల్లో ఆడిట్ చేయాలని సెన్సెక్స్, నిఫ్టీలు సమయత్తం అవుతున్నాయి. ఇందుకు సెబీ సహకారం తీసుకోనున్నాయి. తొలి విడతగా 100 కంపెనీల ఆడిట్లను పరిశీలించనుందని సమాచారం. ఇందుకుగాను ఆడిటర్ల బందాన్ని సైతం ఏర్పాటు చేసేందుకు స్టాక్‌ఎక్స్చేంజీలు సిద్ధం అవుతున్నాయి. డొల్ల కంపెనీలపై ఆడిట్ నిర్వహించాలని సెబీ సూచించిన నేపథ్యంలో బిఎస్ఇ 331 కంపెనీల్లో 162 కంపెనీల జాబితాను రూపొందించింది. 154 కంపెనీల సమాచారం మాత్రమే సంపాదించగలిగింది.

ఇక ధరాఘాతమే

- మరింత పెరగనున్న ద్రవ్యోల్బణం
- వడ్డీ రేట్ల తగ్గింపునకు అడ్డంకి..
- మోర్గన్ స్టాన్లే రిపోర్టు

న్యూఢిల్లీ : దేశంలో ధరలు మరింత పెరగనున్నాయని పలు రిపోర్టులు హెచ్చరిస్తున్నాయి. ఇప్పటికే ఓ స్థాయిలో పెరిగిన ధరలు వినియోగదారుల జేబులకు చిల్లులు పెడుతున్నాయి. వచ్చే మాసాల్లో అహారోత్పత్తుల ధరలు ద్రవ్యోల్బణ సూచీలకు మరింత ఆజ్యం పోయనున్నాయని తాజాగా మోర్గన్ స్టాన్లే ఒక రిపోర్టులో వెల్లడించింది. ఈ గ్లోబల్ ఫైనాన్సియల్ సర్వీసెస్ సంస్థ నివేదిక ప్రకారం ఇప్పటికే జూన్, జులైలో ధరలు పెరిగాయి. భవిష్యత్ మాసాల్లో ఈ ధరలు మరింత పెరగనున్నాయి. ప్రస్తుత ఏడాది జులైలో టోకు ద్రవ్యోల్బణం సూచీ 1.88 శాతానికి ఎగిసింది. ఇంతక్రితం జూన్ మాసంలో ఇది 0.90 శాతంగా చోటు చేసుకుంది. ప్రధానంగా అహారోత్పత్తులు, కూరగాయల ధరలు భారీగా పెరిగాయి. క్రితం మాసంలో రిటైల్ ద్రవ్యోల్బణం సూచీ 2.36 శాతానికి పెరిగింది. చక్కెర, కన్‌ఫెక్షణరీ ఉత్పత్తులు, పాన్, పొగాకు తదితర ఉత్పత్తుల ధరలు ఎగిశాయి.ప్రస్తుత ఆగస్టులో వినియోగదారుల ద్రవ్యోల్బణం సూచీ (సిపిఐ), టోకు ద్రవ్యోల్బణం సూచీ వరుసగా 3 శాతం, 2.1 శాతానికి పెరుగొచ్చని మోర్గాన్ స్టాన్లే తన పరిశోధన నివేదికలో పేర్కొంది.

ముఖ్యంగా గ్లోబల్ కమోడిటీ ధరల పెరుగుదలకు తోడు దేశీయంగా అహారోత్పత్తుల ధరలు భారీగానే అవకాశం ఉందని తెలిపింది. ఆగస్టు తొలి వారంలో జరిగిన రిజర్వు బ్యాంకు ద్రవ్య పరపతి విధాన సమీక్షలో భవిష్యత్తులో కొంత ద్రవ్యోల్బణం సూచీ దిగిరావచ్చని, దీంతో వడ్డీ రేట్లు తగ్గడానికి మరింత అవకాశం ఉందని సెంట్రల్ బ్యాంకు అంచనా వేసింది. వరుసగా మళ్లీ ధరలు పెరిగితే ఇక వడ్డీ రేట్ల కోతకు అవకాశం ఉండకపోవచ్చని మోర్గాన్ స్టాన్లే పేర్కొంది. అక్టోబర్‌లో జరగనున్న ఆర్‌బిఐ పరపతి సమీక్షలో ఆగస్టు, సెప్టెంబర్ వినియోగదారుల ద్రవ్యోల్బణం సూచీలను కీలకంగా తీసుకోనుందని తెలిపింది.

రానున్న రోజుల్లో ధరలు పెరగొచ్చు : ఆర్‌బిఐ

దేశీయంగా రానున్న రోజుల్లో ధరలు పెరిగే అవకాశం లేకపోలేదని రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా (ఆర్‌ఐ) 'ద్రవ్య పరపతి విధాన కమిటీ' (ఎంపసి సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నెల 2న సమావేశమైన ఎంపిసి మీటింగ్ వివరాల నివేదిక (మినెట్స్) బుధవారం మీడియాకు వెల్లడయింది. ద్రవ్యోల్బణం తగ్గు ముఖం పట్టడం తమకు వడ్డీరేట్లు తగ్గించాల్సిన ఆవశ్యకతను తెలియపరిచినట్టుగా ఎంపిసి ఇందులో పేర్కొంది. ఇదే సమయంలో రానున్న రోజుల్లో ద్రవ్యోల్బణం క్రమంగా పెరిగే అవకాశం లేకపోలేదని ఎంపిసి హెచ్చరికలు జారి చేసింది. ద్రవ్యోల్బణం మరింతగా పెరిగే అవకాశం ఉన్నందున ఇక కొత్తగా వడ్డీరేట్లలో కోత విషయం అటుంచి, ఇప్పటికే తగ్గించిన వడ్డీ రేట్లు ప్రజలకు చేరేలా వాణిజ్య బ్యాంకులు తగిన చర్యలు చేపట్టేలని ఎంపిసి సభ్యులు అభిప్రాయపడ్డట్టుగా మినిట్స్ ద్వారా తెలుస్తోంది.

వర్తమాన అంశాలు (అంతర్జాతీయ, జాతీయ, ప్రాంతీయ) పోటీ పరీక్షల ప్రత్యేకం

ఓతే



కుర్రా శ్రీనివాసరావు,
సబ్జెక్టు నిపుణులు, తెనాలి.
సెల్ : 9701415678

'షార్' ప్రస్తుత డైరెక్టర్ ఎవరు ?

ఎనిమిది భారతీయ భాషల్లో గూగుల్ సెర్చ్

టెక్ దిగ్గజ సంస్థ గూగుల్ ఆండ్రాయిడ్ ఫోన్లలో, ఐవోఎఎస్, ఆ సంస్థ యాప్‌లలో కొత్తగా ఎనిమిది భారతీయ భాషల్లో వాయిస్ సెర్చ్ సదుపాయాన్ని ప్రవేశపెట్టింది. ఇప్పటి వరకూ హిందీ, ఇంగ్లీష్ భాషల్లోనే ఈ సౌలభ్యం ఉండేది. ఇపుడు బెంగాలీ, మలయాళం, తమిళం, గుజరాతీ, కన్నడ, మరాఠీ, తెలుగు, ఉర్దూ భాషల్లోనూ దీనిని అందించనున్నామని సంస్థ టెక్నికల్ మేనేజర్ డాన్ వాన్ ఎస్చ్ తెలిపారు. గూగుల్ యాప్‌లో వాయిస్ సెట్టింగ్స్‌లో వారికి కావాల్సిన భాషను ఎంచుకోవాలని సూచించారు. 2021 నాటికి 19.9 కోట్ల మంది భారతీయులు ఆంగ్లంలో అంతర్జాలాన్ని వినియోగిస్తారని, అదే సమయంలో 53.6 కోట్ల మంది



ప్రాంతీయ భాషల్లో వినియోగించే అవకాశముందని సంస్థ నివేదిక తెలిపింది.

రొనాల్డోపై ఐదు మ్యాచ్‌ల నిషేధం

ఫుట్‌బాల్ స్టార్ క్రిస్టియానో రొనాల్డోపై స్పానిష్ ఫుట్‌బాల్ ఫెడరేషన్ ఐదు మ్యాచ్‌ల నిషేధం విధించింది. స్పానిష్ కప్‌లో భాగంగా ఆగస్టు 6న రొనాల్డో జట్టు రియల్ మాడ్రిడ్ వార్సిలోనా మధ్య లీగ్ మ్యాచ్ సందర్భంగా తనకు రెడ్ కార్డు చూపించిన రిఫరీని రొనాల్డో నెట్టాడు. ఈ విషయంపై ఆగ్రహించిన స్పానిష్ ఫుట్‌బాల్ ఫెడరేషన్ తరువాతి రోజు ఈ నిర్ణయం తీసుకుంది. దీంతోపాటు రూ.2.88 లక్షలు (4,500 అమెరికా డాలర్లు) జరిమానా విధించింది. ఈ నిషేధంపై అప్పీల్ చేసుకోడానికి రొనాల్డోకు పదిరోజుల సమయం ఉంది. ఈ విషయంపై అప్పీల్ చేస్తామని రియల్ మాడ్రిడ్ యాజమాన్యం తెలిపింది. ఈ మ్యాచ్‌లో రియల్ మాడ్రిడ్ 3-1తో వార్సిలోనాపై గెలిచింది.




రోజర్స్ ఫైనల్లో ఓడిన ఫెదరర్

వింబుల్డన్ గెలిచి ఊపుమీదున్న రోజర్ ఫెదరర్‌కు రోజర్స్ కప్ ఫైనల్లో ఓటమి ఎదురయ్యింది. 20 ఏళ్ల అలెగ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ) 6-3, 6-4 తేడాతో వరుస సెట్లలో ఫెదరర్‌ను ఓడించాడు. దీంతో జూన్ 25న హాలెలో ఫెదరర్ చేతిలో ఓటమికి అలెగ్జాండర్ ప్రతీకారం తీర్చుకున్నట్లయింది. ఈ సీజన్‌లో హార్డ్‌కోర్టులో తొలి టోర్నమెంటు ఆడిన ఫెదరర్‌ను గాయాలు వేధించాయి. ఈ విజయంతో ప్రపంచ టెన్నిస్ ర్యాంకింగ్స్‌లో అలెగ్జాండర్ ఏడో స్థానానికి చేరుకున్నాడు.

'డాక్టర్ దీదీ' ఇక లేరు

ఎంతోమంది పేదలకు ఉచిత వైద్యసేవలు అందించి, 'డాక్టర్ దీదీ'గా ప్రఖ్యాతిగాంచిన భక్తి యాదవ్ (91) కన్నుమూశారు. కొద్ది రోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆమె ఆగస్టు 14న ఉదయం తుది శ్వాస విడిచారు. ఆరు దశాబ్దాలుగా దాదాపు లక్ష మంది పేద మహిళలకు ఉచిత వైద్యసేవలు అందించారు. 1948-53 మధ్యకాలంలో ఇండోర్‌లోని మహాత్మాగాంధీ ప్రభుత్వ బోధనాసుపత్రిలో ఎంబీబీఎస్ కోర్సు అభ్యసించిన ఏకైక మహిళ భక్తి యాదవ్. మధ్యప్రదేశ్ రాష్ట్రంలో తొలి మహిళా వైద్యురాలు. గైనకాలజిస్టుగా సేవలందించిన ఆమెను ఇటీవల కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డుతో సత్కరించింది.



31న నింగిలోకి ఐఆర్ఎన్ఎస్ఎస్-1హెచ్ ఉపగ్రహం

శ్రీహరికోట రాకెట్ కేంద్రం (షార్) పరిధిలో మరో రెండు భారీ ప్రాజెక్టులు నిర్మాణం కానున్నాయని షార్ సంచాలకులు కున్హికృష్ణన్ పేర్కొన్నారు. శ్రీహరికోటలో ఘన ఇంధన కర్మాగారంలో ఏఎస్ఎంపీ నిర్మాణానికి రూపకల్పన చేస్తున్నామని ఆయన వివరించారు. ఇందులో 29 రకాల వసతులు సమకూరనున్నాయన్నారు. ఇది పూర్తయితే ఏడాదికి 12 పీఎస్ఎల్వీ రాకెట్లకు ఇంధనం అందించగలమని ఆశాభావం వ్యక్తం చేశారు. పీఎస్ఎల్వీ ఇంటిగ్రేషన్ ఫెసిలిటీ (పీఐఎఫ్) ప్రాజెక్టు త్వరలో అందుబాటులోకి రానుందని, దీనిద్వారా ఏడాదికి 15 పీఎస్ఎల్వీ రాకెట్లను నింగిలోకి పంపే అవకాశం ఉందని తెలిపారు. ఆగస్టు 31న పీఎస్ఎల్వీ-సీ39 రాకెట్ ద్వారా ఐఆర్ఎస్ఎస్-1హెచ్ ఉపగ్రమాన్ని నింగిలోకి పంపుతున్నట్లు వివరించారు. గతంలోపంపిన ఐఆర్ఎన్ఎస్ఎస్-1ఏ ఉపగ్రహం స్థానంలోకి దీన్ని పంపి సేవలు అందుబాటులోకి తీసుకురానున్నామని తెలిపారు. ఈ ఏడాది చివరిలోగా రెండు పీఎస్ఎల్వీ, ఒక జీఎస్ఎల్వీ ప్రయోగాలను చేయనున్నామని తెలిపారు. 2018 మార్చిలోగా చంద్రయాన్-2 రాకెట్‌ను నింగిలోకి పంపాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నట్లు తెలిపారు. షార్‌లో రెండు వాహక అనుసంధాన భవనాన్ని ఆరు నెలల్లో అందుబాలోకి తీసుకొస్తామని, దీని ఎత్తు 96 మీటర్లు ఉండగా 82 మీటర్ల నిర్మాణం పూర్తికావొచ్చిందని తెలిపారు. ఈ ఏడాది అక్టోబర్‌లో అంతరిక్ష వారోత్సవాలను రాష్ట్రంలోని 13 జిల్లాలలతో పాటు తమిళనాడులో ఐదుచోట్ల, ఒడిశాలోని భువనేశ్వర్‌లో కూడా నిర్వహిస్తామని తెలిపారు.



గుండె గాయాలను మాన్పే 'ఆంజియో చిప్'

గుండె గాయాలను మాయంచేసే చిట్టి పట్టీని శాస్త్రవేత్తలు అభివృద్ధిచేశారు. తపాలా బిళ్లకంటే చిన్నగా ఉండే దీన్ని నేరుగా గుండెపై అంటించే వీలుంది. గుండె కణజాలాన్ని హృద్రోగాలు దెబ్బతీస్తాయి. దీన్ని పూర్వస్థితికి తీసుకొచ్చేందుకు వైద్యులు శస్త్రచికిత్సలు నిర్వహిస్తుంటారు. వీటితో ఒక్కోసారి కొత్త ముప్పులు చుట్టుముడతాయి. వీటిని అడ్డుకోవడమే లక్ష్యంగా కెనడాలోని టొరంటో వర్సిటీ నిపుణులు తాజాగా ఈ పట్టీని అభివృద్ధిచేశారు. 'ఆంజియో చిప్'గా పిలుస్తున్న దీనిలో సూక్ష్మ గుండె కణజాలం, రక్తనాళాలు ఉంటాయట. వీటిని సిరంజిల సాయంతో రోగికి ఎక్కిస్తేచాలు. ఇవి రోగి గుండెపై అతుక్కుని పట్టీలా పరుచుకుంటాయి. దెబ్బతిన్న కణజాలాన్ని బాగుచేస్తాయి.

వ్యాధులను నిర్ధారించే 3డీ 'చిప్ ప్రయోగశాల'

వ్యాధులను నిర్ధారించే ఓ చిట్టి ప్రయోగశాలను పరిశోధకులు చిప్‌పై అభివృద్ధిచేశారు. ఇది రక్తంలోని వ్యాధికారక బయోమార్కర్లను మెరుగ్గా గుర్తించడం విశేషం. దీనిలో 18X20 మైక్రోమీటర్ల వైశాల్యంలో సూక్ష్మ విభాగాలున్నాయి. వీటిని అధునాతన 3డీ పరిజ్ఞానంతో ముద్రించారు. వీటిగుండా రక్తనమూనా ప్రసరించేటప్పుడు అతినీలలోహిత కాంతిని ప్రసరించే సూక్ష్మ ఎల్ఈడీలతో వ్యాధికారక బయోమార్కర్లను గుర్తించొచ్చు. తక్కువ ధరల్లోనే ఈ చిప్ ప్రయోగశాలలు అందుబాటులోకి వస్తాయని పరిశోధనలలో పాలుపంచుకున్న అమెరికాలోని బ్రింగ్‌హామ్ యంగ్ వర్సిటీ పరిశోధకులు గ్రెగ్ నోర్డిన్ చెబుతున్నారు.

పొగాకు మొక్కల్లో పోలియో టీకా ఉత్పత్తి



పోలియో టీకాను మొక్కల సాయంతో పరిశోధకులు ఉత్పత్తిచేశారు. దీనికోసం మొక్కల జీవక్రియలను వారు ఆధీనంలోకి తీసుకున్నారు. టీకా తయారీలో విప్లవాత్మక మార్పులకు బాటలు వేస్తున్నారు. ఈ పరిశోధనను బ్రిటన్‌లోని ఆక్స్‌ఫర్డ్ వర్సిటీ, జాన్ ఇన్నెస్ సెంటర్‌ల నిపుణులు చేపట్టారు. తొలుత పొగాకు మొక్కలకు ఇన్ఫెక్షన్ కలుగజేసే వైరస్‌లను వారు నియంత్రణలోకి తీసుకున్నారు. తాము చెప్పిన విధంగా నడుచుకునేలా వీటిలో జన్యుమార్పులు చేశారు. అనంతరం మట్టిలోని బ్యాక్టీరియాతో కలిపి వీటిని మొక్కలకు చేరవేశారు. దీంతో మొక్కల ఆకులను నకిలీ పోలియో వైరస్ తయారీకి ఉపయోగించుకోగలిగారు. ఇవి అచ్చంగా వైరస్‌లానే కనిపిస్తున్నా.. ఇన్ఫెక్షన్‌కు గురిచేయవు. వ్యాధి నిరోధక శక్తిని ప్రేరేపించడంలో క్రియాశీకలంగా పనిచేస్తాయి. ★


భారత ఉపరాష్ట్రపతి ఎన్నికలు

✧ భారత ఉపరాష్ట్రపతి ఎన్నిక 2017 ఆగస్టు 5న జరిగాయి.
✧ షంషేర్ షరీఫ్ ఈ ఎన్నికకు రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించారు.
✧ అధికార పార్టీ అభ్యర్థిగా పోటీచేసిన ఎం.వెంకయ్యనాయుడు 15వ ఉపరాష్ట్రపతిగా విజయం సాధించారు. (ఉపరాష్ట్ర పదవి పొందిన 13వ వ్యక్తి)
✧ ప్రతిపక్షాల అభ్యర్థి గోపాలకృష్ణగాంధీపై వెంకయ్యనాయుడు 272 ఓట్ల ఆధిక్యతతో విజయం సాధించారు.
✧ వెంకయ్యనాయుడుకు 516 ఓట్లు, గోపాలకృష్ణగాంధీకి 244 ఓట్లు వచ్చాయి.
✧ మొత్తం ఎలక్టోరల్ కాలేజీ ఓట్లు 790 కాగా, ప్రసుస్తత సభ్యులు 785. ఉపరాష్ట్రపతి ఎన్నిక పోలింగులో 771 సభ్యులు పాల్గొన్నారు. 11 ఓట్లు చెల్లలేదు (చెల్లిన ఓట్లు 760)
✧ వెంకయ్యనాయుడు ఆంధ్రప్రదేశ్‌కు చెందినవారు. గోపాలకృష్ణగాంధీ ఢిల్లీకి చెందినవారు.
✧ వెంకయ్యనాయుడు బిజెపి నుంచి ఎన్నికైన రెండో ఉపరాష్ట్రపతి (బిజెపి తొలి ఉపరాష్ట్రపతి భైరాన్‌సింగ్ షెకావత్)
✧ వెంకయ్యనాయుడు బిజెపి జాతీయ అధ్యక్షుడిగా, కేంద్రమంత్రిగా పనిచేశారు. గోపాలకృష్ణగాంధీ పశ్చిమబెంగాల్ గవర్నరుగా పనిచేశారు.



బిట్‌బ్యాంక్ / (భారత స్వాతంత్ర్యోద్యమం)

1. భారతదేశ స్వాతంత్ర్య సంగ్రామంలో 'ప్రథమ స్వాతంత్ర్య సమరం'గా ఏ సంఘటనను పేర్కొంటారు ? **- సిపాయిల తిరుగుబాటు (1857)**
2. భారత స్వాతంత్ర్య సమరంలో మితవాద యుగంగా ఏ కాలాన్ని పేర్కొంటారు ? **- 1885 - 1905**
3. భారత జాతీయ కాంగ్రెస్ స్థాపించిన సంవత్సరం ? **- 1885**
4. బెంగాల్ విభజన చేసిన బ్రిటీష్ గవర్నర్ జనరల్ ? **- లార్డ్ కర్జన్**
5. బెంగాల్ విభజనకు నిరసనగా పాడిన ఏ గీతం తర్వాత కాలంలో మనకు జాతీయ గేయం అయినది ? **- వందేమాతరం**
6. వందేమాతర గేయ రచయిత ? **- బంకిం చంద్ర చటర్జీ**
7. భారత జాతీయ కాంగ్రెస్ ఒక అల్ప సంఖ్యాక వర్గప్రాతినిధ్య సంస్థ అని ఏ బ్రిటీష్ గవర్నర్ జనరల్ విమర్శించాడు ? **- డఫ్రిన్**
8. భారత జాతీయ కాంగ్రెస్ స్థాపకుడు ? **- ఎ.ఓ.హ్యూం**
9. భారత జాతీయ కాంగ్రెస్ మొదటి సమావేశానికి (ముంబయిలో జరిగినది) అధ్యక్షత వహించినవారు ? **- డబ్ల్యూసి.బెనర్జీ**
10. బెంగాల్ విభజన చేసిన సంవత్సరం ? **- 1905**
11. భారత స్వాతంత్ర్య ఉద్యమ నాయకులు ఏ సమావేశంలో అతివాదులు, మితవాదులుగా విడిపోయారు ? **- సూరత్ సమావేశం**
12. సూరత్ కాంగ్రెస్ సమావేశం ఏ సంవత్సరంలో జరిగింది ? **- 1907**
13. సూరత్ సమావేశానికి అధ్యక్షత వహించినవారు ? **- ఫిరోజ్‌షా మెహతా**
14. ముస్లింలీగ్ పార్టీ ఏర్పడిన సంవత్సరం ? **- 1906**
15. ముస్లింలీగ్ ఏర్పాటుకు కారకుడైన ఢాకా నవాబు ? **- సలీముల్లాఖాన్**
16. మింటో-మార్లే సంస్కరణలు ప్రవేశపెట్టిన సంవత్సరం ? **- 1909**



17. హోంరూల్ ఉద్యమం ఎప్పుడు ప్రారంభమైంది? **- 1916**
18. హోంరూల్ ఉద్యమాన్ని మద్రాసులో ప్రారంభించినవారు ? **- అనిబిసెంట్**
19. భారత ఖండంబు చక్కని పాడియావు
హిందువులు లేగదూడలై ఏడ్చుచుండ
తెల్లవారను గడుసరి గొల్లవారు
పితుకుచున్నారు మూతులు బిగియకట్టి అనే పద్యాన్ని అల్లి వినిపించినవారు ? **- చిలకమర్తి లక్ష్మీనరసింహం**
20. మాంటేగ్ ఛేమ్స్‌ఫర్డ్ సంస్కరణలు చేసిన సంవత్సరం ? **- 1919**
21. అతివాదులు, మితవాదులు ఎక్కడ జరిగిన కాంగ్రెస్ సమావేశంలో కలిసిపోయారు ? **- లక్నో**
22. లక్నోలో భారత జాతీయ కాంగ్రెస్ సమావేశం ఎప్పుడు జరిగింది ? **- 1916**
23. కాంగ్రెస్, ముస్లిం లీగ్‌లు కలిసి పనిచేయడానికి నిర్ణయించుకొని కుదుర్చుకున్న ఒప్పందం ? **- లక్నో ఒప్పందం (1916)**
24. మొదటి ప్రపంచయుద్ధంలో బ్రిటన్ టర్కీని ఓడించి, టర్కీ సామ్రాజ్యాన్ని విచ్ఛిన్నం చేసినందుకు ప్రతిగా భారత దేశంలోని ముస్లింలు బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా ప్రారంభించిన ఉద్యమం ? **- ఖిలాఫత్ ఉద్యమం**
25. ఖిలాఫత్ ఉద్యమం జరిగిన సంవత్సరం ? **- 1916**

‘ఆది’ వ్యాఖ్యలపై వెల్లువెత్తిన నిరసనలు

- మంత్రి ఆదినారాయణరెడ్డిని పదవి నుంచి భర్తరఫ్ చేయాలి
- ఎస్‌సి, ఎస్‌టి కేసు నమోదుకు దళిత, ప్రజా సంఘాల డిమాండ్
- పలుచోట్ల దిష్టిబొమ్మ దహనం

ప్రజాశక్తి - యంత్రాంగం

దళితులు చదువుకోరని, శుభ్రంగా ఉండరని, దేశానికి స్వాతంత్ర్య వచ్చి 70 సంవత్సరాలు పూర్తయినా దళితులు మారలేదని మార్కెటింగ్ శాఖ మంత్రి ఆదినారాయణరెడ్డి చేసిన వివక్షపూరిత వ్యాఖ్యలను ఖండిస్తూ బుధవారం రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. మంత్రి పదవి నుంచి వెంటనే భర్తరఫ్ చేయాలని దళిత, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. పలుచోట్ల మంత్రి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కోరారు.

కడపలో వైసిపి ఆధ్వర్యంలో మంత్రి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఆర్‌టిసి బస్టాండ్ సమీపంలోని అంబేద్కర్ సర్కిల్ వద్ద కెవిపిఎస్ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా కెవిపిఎస్, డిహెచ్‌పిఎస్, వైసిపి, రాయలసీమ ఎస్‌సి, ఎస్‌టి హ్యూమన్ రైట్స్ ఫోరం నేతలు మాట్లాడుతూ.. మంత్రి ఆదినారాయణరెడ్డి వెంటనే దళితులకు క్షమాపన చెప్పకుంటే జిల్లాలో తిరగనివ్వమని హెచ్చరించారు. కాగా మంత్రిపై ప్రచార మాధ్యమాలలో వస్తున్నవి అవాస్తవాలని మాలమహానాడు జిల్లా అధ్యక్షులు బిర్రు నెల్సన్‌కుమార్ జమ్మలమడుగులో విలేకరుల సమావేశంలో పేర్కొనడం గమనార్హం. ఒంగోలులో కెవిపిఎస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద నిరసన చేపట్టారు. కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆంధ్ర మాల్యాద్రి ఆధ్వర్యంలో మంత్రికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం గోకవరం బస్టాండ్ వద్ద దిష్టిబొమ్మను దహనం చేశారు. సామర్లకోటలో పోలీసు స్టేషన్ ఎదుట, అమలాపురం గడియార స్తంభం సెంటర్, ఏలేశ్వరంలోని బాలాజీచౌక్ సెంటర్‌లో ధర్నాలు నిర్వహించారు. రాజోలులో మానవహారం నిర్వహించారు. పశ్చిమగోదావరి జిల్లా ఏలూరు ఫైర్‌స్టేషన్ సెంటరులో దిష్టిబొమ్మను దహనం చేశారు. పెనుమంట్ర మండలం మార్టేరు సెంటర్‌లో మాలమహానాడు ఆధ్వర్యంలో దిష్టిబొమ్మ దహనం చేశారు. టి.నరసాపురంలో బిఎస్‌పి, దళిత సంఘాల ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ సెంటరులో ధర్నా నిర్వహించారు. ఆచంటలో దళిత ప్రజాసంఘాల జెఎసి ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద కార్యకర్తలు అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. విజయవాడలో కెవిపిఎస్ ఆధ్వర్యంలో తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్ద ధర్నా అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. కృష్ణాజిల్లా అవనిగడ్డలోని చింతచెట్టు సెంటరులో వైసిపి ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో దిష్టిబొమ్మను దహనం చేశారు. గుంటూరులో వైసిపి ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలతో లాడ్జి సెంటర్ వద్ద నిరసన తెలిపారు. తాడేపల్లిలో వైసిపి ఎస్‌సి సెల్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. తెనాలిలో ఐతానగర్ రజకచెరువు కూడలిలో మాలమహానాడు ఆధ్వర్యంలో, సత్తెనపల్లిలో వైసిపి ఆధ్వర్యంలో దిష్టిబొమ్మను దహనం చేశారు. విశాఖలో వైసిపి ఎస్సీ సెల్ ఆధ్వర్యాన ఎల్ఐసి కార్యాలయం సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. వైఎస్ఆర్ స్టూడెంట్ యూనియన్ ఆధ్వర్యాన ఆంధ్రా యూనివర్సిటీ మెయిన్‌గేట్ వద్ద ఆందోళన నిర్వహించారు. అనంతరం దిష్టిబొమ్మను దహనం చేశారు.




గుంటూరు జిల్లా తెనాలిలో మంత్రి ఆదినారాయణరెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న మాల మహానాడు నాయకులు
ఒంగోలులో నిరసన తెలుపుతున్న కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆంధ్ర మాల్యాద్రి

దళితులకు క్షమాపణ చెప్పాలి : కారెం శివాజీ

దళితులు, గిరిజనులను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేసిన మంత్రి ఆదినారాయణరెడ్డి తక్షణం క్షమాపణ చెప్పాలని ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ చైర్మన్ కారెం శివాజీ డిమాండ్ చేశారు.

తూర్పుగోదావరి జిల్లా రామచంద్రపురం మండలం మాలపాడులో ఓ ప్రయివేటు కార్యక్రమంలో పాల్గొన్న ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఆదినారాయణరెడ్డి చేసిన వివాదాస్పద వ్యాఖ్యల వీడియో పుటేజీలను కడప జిల్లా కలెక్టర్‌కు పంపించి ఎస్‌సి, ఎస్‌టి కమిషన్‌కు నివేదిక అందజేయాలని ఆదేశించామన్నారు. మంత్రి వ్యాఖ్యలను ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ఘటనపై కమిషన్ దర్యాప్తు చేపడుతుందని స్పష్టం చేశారు.

కేబినెట్ నుంచి బర్తరఫ్ చేయాలి : ఎస్ఎఫ్ఐ

ఎస్సీలను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేసిన మంత్రి ఆదినారాయణ రెడ్డిని మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. భవిష్యత్‌లో ఇటువంటి వ్యాఖ్యలు చేసే అవకాశమివ్వకుండా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వై రాము, ఎస్ నూర్‌మహమ్మద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బాధ్యత కలిగిన మంత్రి స్థానంలో ఉండి అలా మాట్లాడడం దురదృష్టకరమన్నారు. ఎస్సీలు చదవరని, శుభ్రంగా ఉండరని చేసిన వ్యాఖ్యలు ఎస్సీల మనోభావాలు దెబ్బతీసే విధంగా ఉన్నాయన్నారు. తక్షణమే దళితులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దళిత వ్యతిరేక ప్రభుత్వానికి ఓట్ల రూపంలో తగిన బుద్ధి చెప్పాలన్నారు.

చెన్నయ్ బీచ్‌లో నెల్లూరు జిల్లా వాసి గల్లంతు



సాయితేజ (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి - జలదంకి (నెల్లూరు)

చెన్నయ్ బీచ్‌లో నెల్లూరు జిల్లాకు చెందిన ఓ యువకుడు గల్లంతయ్యాడు. ఈ సంఘటన బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బ్రాహ్మణక్రాక అగ్రహారానికి చెందిన కంచర్ల ప్రసాద్, రాధల కుమారుడు కంచర్ల సాయితేజ చెన్నయ్‌లో విద్యాభ్యాసం చేసి అక్కడే సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఉద్యోగం చేసేవాడు. అక్కడే ఉంటూ అప్పుడప్పుడూ తల్లిదండ్రుల వద్దకు వచ్చి వెళుండేవాడు. ఆదివారం సెలవు కావడంతో స్నేహితులతో కలిసి సరదాగా చెన్నైలోని మెరీనా బీచ్‌కు వెళ్లాడు. అప్పటినుంచి రాకపోవడంతో భయపడిన స్నేహితులు జమ్మలపాళెంలో ఉంటున్న తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. సమాచారం అందుకున్న తల్లిదండ్రులు హుటాహుటిన చెన్నై వెళ్లారు. నీలాంకిరి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కుమారుడి ఆచూకీకోసం వారు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

మునగలపాళ్యంలో అమరవీరుల స్థూపం

రాజకీయాలకు అతీతంగా ప్రారంభం

ప్రజాశక్తి - తిరుపతి ప్రతినిధి

ఇసుక మాఫియా ఆగడాలకు ఎదురొడ్డి పోరాడిన మునగలపాళ్యానికి చెందిన 15 మంది రైతులు ఏర్పేడు రోడ్డు ప్రమాద ఘటనలో అమరులైన విషయం విదితమే. ఈ నేపథ్యంలో ప్రభుత్వం స్పందించి ఆ ప్రాంతంలో ఇసుక మాఫియా జరగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఊరు బాగుకోసం ప్రాణాలర్పించిన ఆ రైతుల జ్ఞాపకార్థం పొలిమేరల్లో స్థూపం కట్టారు. గ్రామస్తులంతా చందాలు వేసుకుని నిర్మించిన స్థూపాన్ని రాస్ స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి గుత్తా మునిరత్నంనాయుడు ప్రారంభించారు. పెద్దఎత్తున గ్రామస్తులు ఈ కార్యక్రమానికి హాజరై కన్నీటి నివాళి అర్పించారు.

డెంగ్యూ జ్వర పీడితులకు సిపిఎం పరామర్శ

ప్రజాశక్తి-తిరువూరు (కృష్ణా)

కృష్ణాజిల్లా తిరువూరు మండలం కోకిలంపాడు దళితపేటలో డెంగ్యూ జ్వరంతో బాధపడుతున్న రోగులను సిపిఎం పశ్చిమ కృష్ణా కమిటీ కార్యదర్శివర్గ సభ్యులు సానికొమ్ము నాగేశ్వరరెడ్డి బుధవారం ఆ పార్టీ మండల కార్యదర్శి సాంబారు వెంకటేశ్వర్లుతో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ.. సైడుకాలువల్లేక మురుగునీరు ఇళ్ల మధ్యనే నిల్వ ఉంటుందని, ఫలితంగా దోమకాటుతో జ్వరాల బారినపడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తామంతా కూలి పనులు చేసుకుని జీవిస్తున్నామని, వేలకు వేల రూపాయలు చెల్లించి ప్రయివేటు ఆసుపత్రులలో వైద్యం చేయించుకోలేకపోతున్నామని వాపోయారు. చాలామంది ఇప్పటికే చినవుటుపల్లి వెళ్లి చికిత్స పొందివచ్చారని, ఇంకా కొంతమంది అక్కడే ఉన్నారని బృందం సభ్యులకు వివరించారు. అనంతరం నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ.. నెల రోజుల నుండి డెంగ్యూ జ్వరంతో బాధపడుతున్న రోగులకు ప్రభుత్వం ఆ నెలరోజుల వరకు ఆర్థిక భృతి కల్పించాలని, గ్రామాలలో పక్కా డ్రెయినేజీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

ప్రజ

జవాబులు

1. త్రిపుర సిఎం మాణిక్ సర్కార్
2. బ్లూ వేల్ ఛాలెంజ్
3. థాడ్, 4. గ్యారీ కాస్పరోవ్
5. కర్నాటక

పరిహారం కోసం రైతుల ఆందోళన

- గుంటూరులో వ్యవసాయ శాఖ కమిషనరేట్ ముట్టడి
- ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు మద్దతు



గుంటూరు వ్యవసాయ శాఖ కమిషనరేట్ వద్ద బైఠాయించిన రైతులు, ఎమ్మెల్సీ నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు

ప్రజాశక్తి-గుంటూరు/గన్నవరం (విజయవాడ)

కృష్ణా జిల్లా గంపలగూడెం మండలం పెనుగొలను, ఊటుకూరు, వలసపల్లి గ్రామాల్లో నకిలీ మిర్చినారు, విత్తనాల వల్ల నష్టపోయిన కౌలురైతులకు పరిహారం చెల్లించాలని కోరుతూ బాధిత రైతులు ఆంధ్రప్రదేశ్ కౌలురైతు సంఘం ఆధ్వర్యంలో గుంటూరులోని వ్యవసాయ శాఖ కమిషనరేట్‌ను బుధవారం ముట్టడించారు. రైతులకు చెల్లించాల్సిన రూ.2,49,44,560 లు నాలుగు నెలలుగా చెల్లించకపోవటంతో ఆందోళన చేపట్టారు. ఆందోళనకు ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు మద్దతు తెలిపారు. అధికారులు అందుబాటులో లేకపోవటంతో సాయంత్రం వరకూ ఆందోళనను కొనసాగించారు. సాయంత్రం 6 గంటలకు వ్యవసాయ శాఖ డైరెక్టర్ హరిజవహర్‌లాల్ రైతుల వద్దకు వచ్చి వారితో మాట్లాడారు. కంపెనీలు పరిహారం చెల్లింపునకు గడువు కోరినందున 19వ తేదీ వరకూ అవకాశం కల్పించామని, అప్పటికీ చెల్లించకపోతే చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. అవసరమైతే ఆర్‌ఆర్ యాక్ట్ కింద కంపెనీ ఆస్తులు జప్తు చేసి రైతులకు పరిహారం చెల్లిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సంఘం కృష్ణా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తిరుపతిరెడ్డి, నరశింహారావు పాల్గొన్నారు.

రుణమాఫీ చేయాలని గన్నవరంలో ధర్నా

కృష్ణాజిల్లా ముదినేపల్లి మండలం మోటూరు జెఎల్‌జి గ్రూపుల్లోని కౌలుదారులకు వెంటనే రుణమాఫీ వర్తింపజేయాలని కోరుతూ బుధవారం గన్నవరంలోని రైతు సాధికారత కేంద్రం వద్ద కౌలుదారుల సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. రుణమాఫీ సొమ్ము వెంటనే బ్యాంకుల్లో జమ చేయాలని, జెఎల్‌జి గ్రూపులకు పాత రుణాలతో సంబంధం లేకుండా కొత్త రుణాలివ్వాలని, గుర్తింపు కార్డులివ్వాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని నినదించారు. ఈ సందర్భంగా ఎపి కౌలుదారుల సంఘం జిల్లా అధ్యక్షులు టివి.లక్ష్మణస్వామి మాట్లాడుతూ.. కౌలుదారులకు బ్యాంకర్లు రుణాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వాకా రామచంద్రరావు, పంచకర్ల రంగారావు, దేవసహాయం పాల్గొన్నారు.

ప్రతి పైసా తిరిగివ్వాల్సిందే

- అగ్రిగోల్డ్ ఖాతాదారులు, ఏజెంట్ల సంక్షేమ సంఘం
- చైతన్యయాత్ర ప్రారంభం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం (శ్రీకాకుళం జిల్లా)

అగ్రిగోల్డ్ యాజమాన్యం, ప్రభుత్వం కలిసి నాటకాలాడుతున్నాయని అగ్రిగోల్డ్ ఖాతాదారులు, ఏజెంట్ల సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు ముప్పాళ్ల నాగేశ్వరరావు విమర్శించారు. డిపాజిటర్ల ప్రతి పైసా తిరిగి చెల్లించేవరకూ పోరాడుతామన్నారు. అగ్రిగోల్డ్ ఖాతా దారులు, ఏజెంట్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యాన చేపట్టిన అగ్రిగోల్డ్ బాధితుల రాష్ట్ర వ్యాప్త చైతన్యయాత్ర శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం మండల కేంద్రంలో బుధవారం ప్రారంభమైంది. స్థానిక దాసన్నపేట కూడలిలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణ మూర్తి జెండా ఊపి ఈ యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బి.విశ్వనాథరెడ్డి అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో నాగేశ్వరరావు మాట్లాడారు. రాష్ట్రంలో 19.52 లక్షల మంది అగ్రిగోల్డ్ సంస్థలో ఖాతాదారులుంటే, వీరిలో రూ.20 వేల లోపు దాచుకున్నవారు 13 లక్షలకుపైగా ఉన్నారని తెలిపారు. అగ్రిగోల్డ్ బాధితుల్లో 142 మంది మరణించినా రాష్ట్ర ప్రభుత్వంలో చలనం లేదన్నారు. మృతుల కుటుంబాలకు రూ.ఐదు లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించి నాలుగు నెలలైనా ఏ ఒక్క కుటుం బానికీ అందించలేదని తెలిపారు. సత్యనారాయణ మాట్లాడుతూ అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలను పరిష్కరించకపోతే ప్రభుత్వ కార్యకలాపాలను స్తంభింపజేస్తామన్నారు. ఇచ్ఛాపురంలో ప్రారంభమైన యాత్ర సోంపేట, పలాస మీదుగా టెక్కలి చేరింది. టెక్కలిలో రాత్రి బస చేశారు.



అగ్రిగోల్డ్ బాధితుల చైతన్య యాత్రను ప్రారంభిస్తున్న సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణమూర్తి

ఘనంగా గౌతు లచ్చన్న జయంతి

ప్రజాశక్తి - యంత్రాంగం

స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ గౌతు లచ్చన్న జయంతిని బుధవారం రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. గుంటూరు జిల్లా మంగళగిరి కూరగాలయ మార్కెట్ సెంటర్లోని ఆయన విగ్రహానికి మంత్రి నక్కా ఆనందబాబు పూలమాలేసి నివాళులర్పించారు. నిజాంపట్నంలోని విగ్రహానికి బిసి సంఘం ఆధ్వర్యంలో పూలమాలేశారు. అచ్చంపేట మండలం కోనూరులో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ పాల్గొన్నారు. గుంటూరులోని పలు రాజకీయ పార్టీ కార్యాలయాల్లోనూ కార్యక్రమాలు నిర్వహించారు. కృష్ణాజిల్లాలోని నూజివీడు, గుడివాడ, మచిలీపట్నం, తిరువూరు, నందిగామ, జి.కొండూరు, మొవ్వ తదితర ప్రాంతాల్లో జరిగాయి. మచిలీపట్నం కోనేరు సెంటరులోని లచ్చన్న చిత్రపటానికి మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపి కొనకళ్ల నారాయణరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలం నిమ్మాడలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో లచ్చన్న చిత్రపటానికి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పూలమాల వేసి నివాళులర్పించారు. శ్రీకాకుళంలో డే అండ్ నైట్ కూడలిలోని విగ్రహానికి జెడ్‌పి చైర్‌పర్సన్ చౌదరి ధనలక్ష్మి, ఎంపి కె.రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, కలెక్టర్ కె.ధనంజయరెడ్డి, టిడిపి జిల్లా అధ్యక్షులు గౌతు శిరీష పూలమాలలు వేశారు. పలాసలో లచ్చన్న తనయుడు, పలాస ఎమ్మెల్యే గౌతు శ్యామసుందర శివాజీ గౌతు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విశాఖలో మంత్రి గంటా శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఎంవివిఎస్.మూర్తి, పిసిసి ప్రధాన కార్యదర్శి ద్రోణంరాజు శ్రీనివాస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్ర వరంలో గౌడశెట్టిబలిజ సంఘం అధ్యక్షులు రెడ్డిరాజు ఆధ్వర్యంలో జయంతిని నిర్వహించారు.

బలవంతంగా కాలనీ ఖాళీకి యత్నం

- అడ్డుకున్న పారిశుధ్య కార్మికులు
- ఆరు ఇళ్లు, విద్యుత్ కనెక్షన్లు తొలగింపు

ప్రజాశక్తి- తిరుపతి టౌన్

తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న స్కావెంజర్స్ కాలనీని ఖాళీ చేయించేందుకు అధికారులు తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ఆ కాలనీలో ఉన్న పారిశుధ్య కార్మికులకు అపార్టుమెంటును నిర్మించి ఇస్తామని నమ్మబలుకుతూ తాత్కాలికంగా అక్కడే షెడ్లను నిర్మించారు. ఆ స్థలాన్ని కార్పొరేట్ కంపెనీకి అప్పగించి అపార్ట్‌మెంట్‌ను నిర్మించి వాటిలో కొన్నింటిని స్కావెంజర్స్‌కు ఇస్తామని ఇటీవల ప్రభుత్వం ప్రకటించింది. ఈ నేపథ్యంలో బుధవారం మధ్యాహ్న సమయంలో మున్సిపల్ అధికారులు జెసిబిలు, డ్రిల్లింగ్ మెయిన్‌లతో అక్కడి చేరుకున్నారు. ఇళ్లుఖాళీ చేసి కార్పొరేషన్ నిర్మించిన తాత్కాలిక గృహాలకు వెళ్లాలని హుకుం జారీ చేశారు. మీకు అపార్టుమెంట్ తరహాలో గృహాలు ప్రభుత్వం నిర్మించి ఇస్తుందని ఇక్కడ ఉండొద్దని హెచ్చరించారు. బలవంతంగా పారిశుధ్య కార్మికులను ఇళ్లలో నుంచి బయటకు లాక్కొచ్చి జెసిబిలతో ఇళ్లను కూల్చేశారు. విషయం తెలుసుకున్న సిపిఎం నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్ లక్ష్మీ, బుజ్జి, సుజాతమ్మ, వేణు, రాధాకృష్ణ లు హుటాహుటిన స్కావెంజర్స్ కాలనీకి చేరుకున్నారు. పారిశుధ్య కార్మికులకు బాసటగా నిలిచి జెసిబిలకు అడ్డుగా బైఠాయించారు. పారిశుధ్య కార్మికుల ఇళ్లను తొలగించడానికి వీల్లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్పొరేట్ కంపెనీలకు స్థలాన్ని కట్టబెట్టేందుకే స్కావెంజర్స్ ఇళ్లను ఖాళీ చేయిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వానికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే ఇళ్లు కట్టుకోవడానికి రుణాలు, ఇంటి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

అంతే తప్ప బలవంతంగా కార్మికుల కు ఇష్టం లేకుండా అపార్ట్‌మెంట్లు కట్టించి ఇస్తామంటూ బుకాయించడం దారుణమన్నారు. స్కావెంజర్స్ కాలనీలో కబ్జాకు గురైన స్థలంలో పెద్దపెద్ద భవనాలు నిర్మించుకున్న వారి జోలికి మాత్రం వెళ్లకుండా పారిశుధ్య కార్మికుల ఇళ్లను తొలగించడం దుర్మార్గమన్నారు. అయినా అధికారులు వినకుండా ఇళ్లను తొలగించారు. వస్తు సామగ్రిని తాత్కాలిక షెడ్లకు తరలించారు.



తిరుపతిలోని స్కావెంజర్స్ కాలనీలో ఇంటిని కూల్చేసిన అధికార యంత్రాంగం

విభజన హామీల అమలేదీ?

పిసిసి అధ్యక్షులు ఎన్.రఘువీరారెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

రాష్ట్ర విభజన హామీలపై స్పందించకుండా నంద్యాల, కాకినాడ ఎన్నికల్లో ఓటు అడిగే హక్కు అధికార టిడిపి, ప్రతిపక్ష వైసిపికి లేదని చెప్పారు. కోట్ల విజయభాస్కర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా బుధవారం అనంతపురం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో కోట్ల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులఅర్పించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర విభజన సమయంలో కేంద్రం ఇచ్చిన హామీలపై చర్చించేందుకు అఖిలపక్షాన్ని ఢిల్లీ తీసుకెళ్లాలని, దీనిపై 24 గంటల్లోపు సిఎం స్పందించాలని ఆయన కోరారు. ప్రధాన ప్రతిపక్షం వైసిపి కూడా 48 గంటల్లో స్పందించాలని డిమాండ్ చేశారు. గవర్నర్ పదవి రాజకీయ పంచాయితీలు చేయడానికా ఉండేదా అని ప్రశ్నించారు. ప్రత్యేకహోదా అమలుపై స్పందించకుండా నియోజకవర్గాల పునర్విభజన బిల్లు పెడితే రాజ్యసభలో అడ్డుకుంటామని హెచ్చరించారు.

కమీషన్ల కోసమే పురుషోత్తపట్నం : సిపిఎం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం ద్వారా కమీషన్లను దండుకునేందుకే పనులు పూర్తికాకపోయినా హడావుడిగా జాతికి అంకితం చేశారని సిపిఎం రాజమహేంద్రవరం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ విమర్శించారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో అరుణ్ మాట్లాడారు. ప్రాజెక్టు పూర్తికాకుండానే జాతికి అంకితం చేస్తున్నామంటూ ప్రకటనలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం పంపులకు స్విచ్ఛాన్ చేసినా పంపులు తిరగలేదని, పంపులు తిరిగినా నీరు రాలేదన్నారు. నీరు వచ్చేవరకు నీటిపారుదల శాఖామంత్రి దేవినేని ఉమను అక్కడే ఉండాలని చెప్పి, జగ్గంపేట సభకు వెళ్లిన సిఎం గోదావరి నీరు ఉరకలెత్తుతూ ఏలేరు ప్రాజెక్టులోకి వచ్చేస్తున్నాయంటూ చెప్పుకురావడం చాలా విడ్డూరంగా ఉందన్నారు. నిర్ణీత గడువులో పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం పూర్తిచేస్తే 16.50 శాతం బోనస్ ఇస్తామని మెగా కంపెనీతో కుదుర్చుకున్న ఒప్పందంలో భాగంగానే ప్రభుత్వం హడావుడిగా ప్రాజెక్టును ప్రారంభించారని ఆరోపించారు. పురుషోత్తపట్నం రైతులతో రెవెన్యూ, ఇరిగేషన్ శాఖ అధికారులు మాట్లాడటం లేదని, మెగా కంపెనీ అధికారులే మాట్లాడుతూ బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు.

చాగల్లు షుగర్స్ కార్మికుల ఆకలి కేకలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

చాగల్లు షుగర్స్ కార్మికుల ఆక్రందనలు మిన్నంటుతున్నా ప్రభుత్వానికి పట్టడం లేదు. పది నెలలుగా జీతాలు అందక కార్మికుల కుటుంబాలు పడుతున్న కష్టాలు వర్ణనాతీతంగా మారాయి. జీతాలు ఇప్పించండి మహాప్రభో అంటూ కార్మికులంతా బుధవారం నుంచి నిరహార దీక్షకు దిగారు. 2017 జనవరిలో ఫ్యాక్టరీని మూసివేశారు. అప్పటికే కార్మికులకు రెండు నెలల నుంచి వేతనాలు ఇవ్వడం లేదు. సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని చెప్పి పది నెలలు గడిచినా అడుగు ముందుకు పడలేదు. తమ కుటుంబాన్ని ఎలా పోషించుకోవాలో తెలియక మనోవేదనతో ఇప్పటికే ఆరుగురు కార్మికులు ప్రాణాలు సైతం వదిలారు.



దీక్షలకు మద్దతు తెలుపుతున్న ఎమ్మెల్సీలు నాగేశ్వరరావు, బాలసుబ్రమణ్యం, ఉమామహేశ్వరరావు తదితరులు

స్వచ్ఛ భారత్ ఎలా సాధ్యం?

మున్సిపల్ కార్మికుల తొలగింపుపై ప్రభుత్వాన్ని ప్రశ్నించిన సిఐటియు

ప్రజాశక్తి - సత్యనారాయణపురం (విజయవాడ)

పట్టణాలు, నగరాల్లో పని చేసే మున్సిపల్ కార్మికులను తొలగిస్తే స్వచ్ఛ భారత్ పథకం ఎలా అమలు అవుతుందని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు యు.ఉమామహేశ్వరరావు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. 279 జిఒను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ వర్కర్స్ జెఎసి ఆధ్వర్యంలో ధర్నా చౌక్ వద్ద చేపట్టిన రిలే దీక్షలు బుధవారం పదో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అవుట్‌సోర్సింగ్ అండ్ కాంట్రాక్టు పద్ధతిలో 40 వేల మంది మున్సిపల్ కార్మికులు పని చేస్తున్నారని చెప్పారు. టిడిపికి దళితులంటే వ్యతిరేక భావం ఉందని అన్నారు. గరగపర్రులో అంబేద్కర్ విగ్రహం పెట్టమన్నందుకు అక్కడ దళితులను సాంఘిక బహిష్కరణ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆగస్టు 22న నిర్వహించనున్న చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. దీక్షలకు శాసన మండలి సభ్యులు బొడ్డు నాగేశ్వరరావు, విఠపు బాలసుబ్రహ్మణ్యం సంఘీభావం తెలిపారు.

గుంటూరు జ్యూట్ మిల్లు పునఃప్రారంభం

ఫలించిన కార్మికుల పోరాటం

ప్రజాశక్తి-గుంటూరు

రెండేళ్లుగా లాకౌట్‌లో ఉన్న గుంటూరు భజరంగ్ జ్యూట్‌మిల్లు పున:ప్రారంభమైంది. బుధవారం కార్మికుల్ని పనిలోకి తీసుకున్నారు. 2015లో అక్రమంగా లాకౌట్ ప్రకటించిన అనంతరం కార్మికుల సుదీర్ఘ పోరాటం ఫలితంగా ప్రభుత్వం, యాజమాన్యం, మిల్లు పరిరక్షణా కమిటీ సంయుక్త సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు తిరిగి ప్రారంభించారు. మొదటి రోజు మిషనరీకి సంబంధించిన 20 మంది కార్మికుల్ని పనిలోకి తీసుకున్నారు. క్రమంగా మిగిలిన వారినీ తీసుకుంటామని మిల్లు జనరల్ మేనేజర్ అశోక్ శర్మ తెలిపారు. పున:ప్రారంభం సందర్భంగా ఉదయం 6 గంటలకు మొదటి షిఫ్టులో మిల్లు పరిరక్షణా సమితి నాయకులు, మాజీ ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు, ఎమ్మెల్యే మోదుగుల వేణుగోపాలరెడ్డి, సిపిఎం, సిపిఐ నగర కార్యదర్శులు ఎన్.భావన్నారాయణ, ఆంధ్ర మాల్యాద్రి తదితరులు మిల్లును సందర్శించి పనులను పరిశీలించారు.

కాపులను నిర్లక్ష్యం చేయడం వల్లే పాదయాత్ర

నల్లబోర్డులతో ముద్రగడ నిరసన

ప్రజాశక్తి - కిర్లంపూడి, జగ్గంపేట(తూర్పుగోదావరి)

అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం కాపులను మూడేళ్లుగా నిర్లక్ష్యం చేయడం వల్లే చలో అమరావతి పాదయాత్ర చేపట్టామని మాజీమంత్రి ముద్రగడ పద్మనాభం అన్నారు. తూర్పుగోదావరి జిల్లా కిర్లంపూడిలో 22 రోజులుగా ముద్రగడ చేపడుతున్న పాదయాత్రను పోలీసులు బుధవారం మళ్లీ అడ్డుకున్నారు. ఈ రోజైనా పాదయాత్రకు అనుమతి ఉందా? కాపుల రిజర్వేషన్ కోసం పాదయాత్ర చేస్తుంటే అడ్డుకోవడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. పాదయాత్రకు అనుమతి ఇవ్వాలని, మోకాళ్ల మీదైనా నడిచి వెళ్తామని, లేకపోతే పొర్లుదండాలైనా పెట్టుకుంటూ వెళ్తామని ముద్రగడ పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అయినప్పటికీ పోలీసులు ఒప్పుకోకపోవడంతో నల్లబోర్డులు చేతపట్టి చంద్రబాబుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో కాపుజెఎసి నేతలు ఆకుల రామకృష్ణ, వాసిరెడ్డి ఏసుదాసు, గౌతు స్వామి, ఆరేటి ప్రకాష్, తుమ్మలపల్లి రమేష్, గుండా వెంకటరమణ, గోపు అచ్యుతరామయ్య పాల్గొన్నారు.

దూరదర్శన్, ఆకాశవాణి ప్రసారం చేసేందుకు నిరాకరించిన
మాణిక్ సర్కార్ ప్రసంగం ఇదే

దేశ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని త్రిపుర ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్ తమ రాష్ట్ర ప్రజలనుద్దేశించి చేసిన ప్రసంగాన్ని యథాతథంగా ప్రసారం చేయడానికి దూరదర్శన్, ఆకాశవాణి అగర్తలా కేంద్రం నిరాకరించాయి. దీనిపై మాణిక్ సర్కార్ స్పందిస్తూ 'ఇది అసాదరణం, అప్రజాస్వామికం, అసహనం, నిరంకుశత్వం' అని విమర్శించారు. స్వయం ప్రతిపత్తి గలిగిన దూరదర్శన్, ఆకాశవాణిలు కేంద్ర సమాచార, ప్రసారాల శాఖలో భాగమైనట్లు వ్యవహరించడం ఏమిటని వామపక్షాలు నిలదీశాయి. మళ్లీ ఎమర్జెన్సీ కాలం నాటి ఆంక్షలు వస్తున్నాయని ప్రజాస్వామ్యవాదులు విమర్శిస్తున్నారు. ఈ నేపథ్యంలో మాణిక్ సర్కార్ ప్రసంగ పాఠాన్ని అందిస్తున్నాం.

ప్రియమైన త్రిపుర ప్రజలారా!



"దేశ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మీ అందరికీ శుభాకాంక్షలు. స్వాతంత్ర్యం కోసం పోరాడిన అమర వీరులకు నా నివాళులు. స్వాతంత్ర్యం కోసం పోరాడి ఇప్పటికీ మనందరి మధ్యనున్న యోధులకు నా గౌరవ వందనాలు. స్వాతంత్ర్య దినోత్సవం అంటే సాంప్రదాయబద్ధంగా ఏటా జరుపుకునే ఓ పండుగ కాదు. ఈ రోజున చారిత్రక ప్రాధాన్యతతోపాటు మన భావోద్రేకాలు ముడివడి ఉన్నాయి. ఈ సందర్భంగా మనం ఆత్మావలోకనం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. భిన్నత్వంలో ఏకత్వం మన సంప్రదాయ సంస్కృతి. లౌకిక భావాల వల్లనే మన భారతీయులంతా కలిసిమెలిసి బతుకుతున్నారు. ఈరోజున మన లౌకిక భావానికి ముప్పు వాటిల్లుతోంది. లౌకిక విధానంపై దాడి జరుగుతోంది. కులమతాల ప్రాతిపదికన సమాజంలో విభనలు తీసుకురావడానికి కుట్రలు జరుగుతున్నాయి. సంకుచిత భావాలు జాతీయ స్ఫూర్తిని దెబ్బతీస్తున్నాయి. గోరక్షణ పేరిట దళితులు, మైనారిటీలపై దాడులు జరుగుతున్నాయి. వారిలో అభద్రతా భావం పెరిగిపోతోంది. భారత దేశంలో మత రాజ్యాన్ని స్థాపించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. స్వాతంత్ర్య పోరాటానికి పురిగొల్పిన ఆదర్శాలు, కన్న కలలను దెబ్బతీసే విధంగా విచ్ఛిన్నకర శక్తులు రాజ్యమేలుతున్నాయి. స్వాతంత్ర్య ఉద్యమంతో ఏ మాత్రం సంబంధంలేని, పైగా స్వాతంత్ర్య ఉద్యమాన్ని అణచివేసేందుకు ప్రయత్నించిన జాతి వ్యతిరేకులు నేడు రకరకాల పేర్లతో చెలామణి అవుతూ దేశ ఐక్యతను, సమగ్రతలను దెబ్బతీస్తున్నారు. దేశభక్తి గల ప్రతి పౌరుడు దేశ ఐక్యతకు కట్టుబడి ఈ విచ్ఛిన్నకర శక్తులకు వ్యతిరేకంగా సంఘటితంగా నిలబడాలని ఈ రోజు ప్రతిజ్ఞ చేయాలి. దేశంలో మైనార్టీలకు, దళితులకు, అణగారిన వర్గాల భద్రత కొరకు ఐక్యంగా ఉద్యమించాలి. దేశంలో ప్రస్తుతం నెలకొన్న రుగ్మతలకు వ్యతిరేకంగా మనమందరం నిలబడాలి.

నేడు సమాజంలో ధనిక, పేద అంతరాలు పెరిగిపోతున్నాయి. అపారమైన దేశ సంపద కొద్ది మంది వ్యక్తుల చేతుల్లోకి చేరిపోగా మెజారిటీ ప్రజలు తినేందుకు తిండి కూడా దొరకక కుమిలిపోతున్నారు. అధిక శాతం ప్రజలు పేదరికంలో మగ్గిపోతున్నారు. ప్రస్తుత విధానాలకు బాధితులవుతున్నారు. తిండి, ఇల్లు, బట్టలు, విద్యా, వైద్య సదుపాయం, ఉద్యోగ భద్రతలకు లేకుండా అల్లాడుతున్నారు. ఇవన్నీ ప్రజలకు అందించేందుకు ప్రభుత్వం హామీ ఇవ్వాలి. అదే దేశ స్వాతంత్రోద్యమ లక్ష్యం. ప్రస్తుత కేంద్రం విధానాలు ఆ విధంగా లేవు. ప్రజా వ్యతిరేక విధానాలు పెరుగుతున్నాయి. దేశానికి నిరుద్యోగం ప్రధాన సవాళ్లుగా మారింది. ఉద్యోగం లేక యువత ఎదురుచూపులు చూస్తున్నారు. ఉద్యమాల ద్వారానే ఈ విధానాల మార్పు సాధ్యం. అందుకు విద్యార్థులు, యువత, కార్మికులు ఐక్యంగా ఉద్యమించేందుకు ఈ రోజున ప్రతిన బూనాలి.

కొద్ది మంది కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేస్తూ సామాజిక అంతరాలను పెంచి పోషిస్తోన్న ప్రస్తుత ఆర్థిక, సామాజిక విధానానికి ప్రత్యామ్యాయ విధానం తప్పకుండా ఉంది. మెజారిటీ పేద ప్రజలను ఆదుకునే అలాంటి ప్రత్యామ్నాయ ఆర్థిక, సామాజిక విధానాన్ని సాధించడం కోసం త్రిపుర ప్రజలంతా ఒక్కటవ్వాలి. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు భిన్నంగా రాష్ట్ర ప్రజలకు మేలు చేసేందుకు తన పరిధిలో ఈ ప్రభుత్వం కృషి చేస్తోంది. ఇది సరిపోదు. ప్రత్యామ్నాయ ఆర్థిక విధానాన్ని సాధించడం ఒక్కటే పరిష్కారం. అందుకు జరిగే పోరాటంలో ప్రతి ఒక్కరు భాగస్వామి కావాలని కోరుకుంటున్నాను."

– మాణిక్ సర్కార్
త్రిపుర ముఖ్యమంత్రి



కర్ణాటకలో ఇందిర క్యాంటీన్లు ప్రారంభం
హాజరైన రాహుల్ గాంధీ

బెంగళూరు: పేదలకు తక్కువ ధరకే రుచికరమైన భోజనం అందించే లక్ష్యంతో కర్ణాటక ప్రభుత్వం బుధ వారం ఇందిర క్యాంటీన్లు ప్రారంభించింది. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రాహుల్ గాంధీ హాజరయ్యారు. దక్షిణ బెంగళూరులోని జయనగర్‌లో ఏర్పాటు చేసిన ఇందిర క్యాంటీన్‌ను ఆయన ప్రారంభించారు. మరికొన్ని నెలల్లో కర్ణాటకలోని పలు పట్టణాలకు చెందిన ప్రజలు సబ్సిడీ ధరకే కడుపు నిండా భోజనం చేయవచ్చని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రజలు ఈ సౌకర్యాన్ని పొందడం తనకు ఆనందంగా ఉందన్నారు. అనంతరం ఆయన అదే క్యాంటీన్‌లో వంకాయ కూరతో భోజనం చేశారు. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ పేరుతో సిద్ధరామయ్య ప్రభుత్వం 101 కాంట్యీన్లను ప్రారంభించింది. వీటిలో రూ.5లకే అల్పాహారం, రూ.10లకే భోజనం పొందొచ్చు.

కాషాయీకరణకు అస్సాంలో పెరుగుతున్న ప్రతిఘటన

గువహతి : అస్సాంలో అధికారంలోకి వచ్చి పట్టుమని పదిహేను నెలలు కూడా గడవక ముందే బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వం తీవ్ర ప్రతిఘటనను ఎదుర్కొంటున్నది. రాష్ట్రాన్ని కాషాయీకరణ చేసే ప్రయత్నాలను ప్రజలు అడ్డుకుంటున్నారు. ప్రధానంగా ఇటీవల ప్రభుత్వం దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్ పేరుతో 22 ప్రభుత్వ కళాశాలలను ప్రారంభించాలని నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయాన్ని ప్రజలు తీవ్రంగా ప్రతిఘటిస్తున్నారు. ఇది విద్యను కాషాయీకరణ చేసే ప్రయత్నమని విమర్శిస్తున్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై రాష్ట్రవ్యాప్తంగా తీవ్రమైన ప్రతిఘటన, ఆగ్రహం వ్యక్తమవుతున్నది. బిజెపి సంకీర్ణ ప్రభుత్వంలో భాగస్వాములుగా ఉన్న అస్సాం గణ పరిషత్ (ఎజిపి), బోడోలాండ్ పీపుల్స్ ఫ్రంట్ (బిపిఎఫ్)లు కూడా ఈ నిర్ణయాన్ని వ్యతిరేకించాయి. ప్రభుత్వ నిర్ణయాన్ని ఖండిస్తూ ప్రాంతీయ ప్రింట్ మీడియా అనేక కథనాలను ప్రచురిస్తోంది. అస్సాంలోని లౌకిక రాజకీయ వాతావరణాన్ని కాషాయికరణ చేసేందుకే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని ప్రింట్ మీడియా కథనాలు, టి.వి. ఛానళ్ళ చర్చలు విశ్లేషిస్తున్నాయి.

కేరళ 'లవ్ జిహాద్' కేసు
ఎన్ఐఎ దర్యాప్తుకు సుప్రీం ఆదేశం

న్యూఢిల్లీ : ఒక హిందూ మహిళ ఇస్లాం మతంలోకి మారి ముస్లిం యువకుడిని పెళ్లి చేసుకున్న ఘటనకు సంబంధించిన 'లవ్ జిహాద్' కేసును సుప్రీంకోర్టు ఎన్ఐఎకి అప్పగించింది. ఈ దర్యాప్తును అత్యున్నత న్యాయస్థానం మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఆర్‌వి రవీంద్రన్ పర్యవేక్షించనున్నట్టు ప్రధాన న్యాయమూర్తి జెఎస్ ఖేహర్, జస్టిస్ డివై చంద్రచూడ్‌లతో కూడిన ధర్మాసం ఉత్తర్వుల్లో పేర్కొంది. కేరళకు చెందిన అఖిల అశోకన్ అనే యువతిని ఇస్లాం మతంలోకి మార్చి షఫిన్ జహాన్ అనే ముస్లిం యువకుడు పెళ్లి చేసుకోవడాన్ని 'లవ్ జిహాద్'గా భావించిన ఆ రాష్ట్ర హైకోర్టు వివాహాన్ని రద్దు చేసిన విషయం తెలిసిందే. కాగా, హైకోర్టు నిర్ణయాన్ని సవాల్ చేస్తూ అఖిల భర్త సుప్రీం కోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో అత్యున్నత న్యాయస్థానం ఎన్ఐఎ దర్యాప్తునకు ఆదేశిస్తే తమకెలాంటి అభ్యంతరం లేదని కేరళ ప్రభుత్వం కోర్టుకు స్పష్టం చేయడంతో ధర్మాసనం పైవిధంగా ఆదేశించింది.

గోరఖ్‌పూర్ ఘోరకలి వాస్తవాలు

- ఔషధాలకు నిధులు కేటాయించని ప్రభుత్వం
- ఔషధాల తలసరి వార్షిక బడ్జెట్ రు.152.62
- వాస్తవాలను కప్పిపెడుతున్న కేంద్ర దర్యాప్తు బృందం
- కేంద్రం వాదనను ఖండిస్తున్న ఆస్పత్రి రికార్డులు



లక్నో/గోరఖ్‌పూర్: గత శుక్రవారం గోరఖ్‌పూర్‌లోని బాబా రాఘవ్‌దాస్ వైద్య కళాశాల ఆస్పత్రిలో సంభవించిన 60 శిశుమరణాల కేసులో ఆసక్తికరమైన వాస్తవాలు వెలుగు చూస్తున్నాయి. ఈ వైద్య కళాశాల ఆస్పత్రికి ఆక్సిజన్ సిలిండర్లు మాత్రమే కాక, ఔషధాల సరఫరా కూడా పూర్తిగా నిలిచిపోయినట్లు తెలుస్తోంది. ఆస్పత్రిలో సౌకర్యా లను మెరుగుపరుస్తామని స్వయంగా ముఖ్యమంత్రి ఆదిత్యనాద్ ప్రకటించినా ఇక్కడి అనేక మంది రోగులు, వారి బంధువులు ప్రైవేటు షాపుల నుండి ఔషధాలను కొనుగోలు చేయాల్సిన దుస్థితి కొనసాగు తోంది. ప్రైవేటు షాపులనుండి ఔషధాలు కొనుగోలు చేసుకోవాలంటూ వైద్యులే తమకు సూచిస్తున్నారని కొంత మంది రోగులు ఫిర్యాదు చేస్తున్నారు. ఆస్పత్రి పోస్టుమార్టం హాలులోసైతం మృతుల కుటుంబీకులు పోస్టుమార్టం పరీక్షలకు మూల్యం చెల్లించు కోవాల్సిందే..

ఆస్పత్రి తలసరి వార్షిక బడ్జెట్ రు.152.62

గోరఖ్‌పూర్ బిఆర్‌డి ఆస్పత్రికి ఏటా వేలాది మంది రోగులు మెదడువాపు వ్యాధి, మెనింజైటిస్ వంటి వ్యాధులతో వస్తుంటారు. ఏటా దాదాపు 4 లక్షల మందికి పైగా రోగులు వచ్చే 955 బెడ్‌లు ఉన్న ఈ ఆస్పత్రికి ఔషధాల బడ్జెట్ కేవలం రు.5.32 కోట్లు మాత్రమేనని రాష్ట్ర ఆర్థికశాఖ లెక్కలు చెబుతున్నాయి. ఇందులో 150 బెడ్‌లకు మాత్రమే అత్యవసర చికిత్సకు వెంటిలేటర్స్ అందుబాటులో వున్నాయి. ఈ ఆస్పత్రికి వచ్చే రోగులకు అందించే చికిత్సకోసం ప్రభుత్వం రు.152.62ల తలసరి వార్షిక బడ్జెట్‌ను కేటాయిస్తోందని నిపుణులు చెప్పారు. తమ ఆస్పత్రిలో వెంటిలేటర్‌పై వుండే పేషెంట్‌కు రోజుకు రు.5 నుండి 8 వేల వరకూ ఖర్చువుతోందని, సగటున బెడ్‌కు వెయ్యి రూపాయల నిధులైనా అవసరమని ప్రముఖ వైద్య నిపుణుడు ప్రొ.దేవేంద్రగుప్తా వివరించారు. ప్రభుత్వం ఈ ఆస్పత్రి బడ్జెట్ పెంపుదలపై ఇప్పుడైనా దృష్టి సారించాల్సిన అవసరం వుందని, ఆస్పత్రికి అవసరమైన బడ్జెట్ కేటాయింపులు లేకపోవటంతో రోగులు తమకు అవసరమైన మందులు, వైద్య పరికరాలను బయటి నుండే కొనుగోలు చేసి తెచ్చుకోవాల్సి వస్తోందన్నారు.

రోజులు గడిచినా మెరుగుపడని పరిస్థితులు

బుధవారం ఉదయం వరకూ గడచిన 24 గంటల్లో ఈ ఆస్పత్రి ఎన్‌సెఫలైటిస్ వార్డులో మరో 5 మరణాలు వెలుగు చూశాయి. దీనితో ఈ ఏడాది జనవరి నుండి ఇప్పటి వరకూ 145 మరణాలు నమోదయినట్లు తెలుస్తోంది. శుక్రవారం నాటి శిశుమరణాలకు ఆక్సిజన్ కొరతే ప్రధాన కారణమని చెప్పలేమని బుధవారం ఈ ఆస్పత్రిని సందర్శించిన ఢిల్లీ వైద్య నిపుణుల బృందం వాస్తవాలను కప్పిపుచ్చే ప్రయత్నం చేసింది

కేంద్రం వాదనను ఖండిస్తున్న ఆస్పత్రి రికార్డులు

శుక్రవారం నాటి మరణాలలో అధికశాతం మేర మెదడు వాపు వ్యాధితో జరిగినవేనంటున్న ప్రభుత్వ వాదన అవాస్తవమని ఆస్పత్రి రికార్డులు వివరిస్తు న్నాయి. నవజాత శిశువులకు మెదడు వాపు వ్యాధి లక్షణాలుండవని న్యూఢిల్లీకి చెందిన ప్రముఖ వైద్య నిపుణుడు డా.దినేష్ కపిల్ చెప్పారు. శుక్రవారం నాటి శిశు మరణాల జాబితాలో అధికశాతం మంది నవజాత శిశువులేనని, వీరందరికీ అత్యవసర వైద్యచికిత్స అవసరమన్న విషయాన్ని ఆస్పత్రి రికార్డులు సూచిస్తున్నాయని అన్నారు. ఇటువంటి కేసులకు మాత్రమే వెంటిలేటర్లు అవసరమవుతాయ న్నారు. ఈ నెల 10,11 తేదీల్లో సంభవించిన 30 మరణాలలో ఐదు కేవలం మెదడు వాపు వ్యాధి కారణంగానే జరిగాయని, ఇతర మరణాలన్నీ తీవ్ర అస్వస్థతతో మరణించిన కేసులేనని ఆస్పత్రి రికార్డులు చెబుతున్నాయి.

మరో ఐదుగురు మృతి

గోరక్‌పూర్‌లోని బాబా రాఘవ్‌దాస్ ఆస్పత్రిలో మెదడువాపు వ్యాధితో మరో ఐదుగురు చిన్నారులు మృతిచెందారు. దీంతో ఆగస్టు 7 నుంచి ఈ వ్యాదితో మృతిచెందిన వారి సంఖ్య 71కి చేరిందని ఆస్పత్రి అధికారులు ప్రకటించారు. ఆగస్టు 15 నుంచి కొత్తగా 14 మంది రోగులు చేరారని, ప్రస్తుతం ఆసుపత్రిలో మొత్తం 64 మంది చికిత్స పొందుతున్నారని అధికారులు పేర్కొన్నారు.

దీర్ఘకాల సాగునీటి నిధి

- రూ.9020 కోట్లకు పెంపు
- సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి ఊతం
- కేంద్ర క్యాబినెట్ ఆమోదం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశవ్యాప్తంగా ప్రాధాన్యత క్రమంలో చేపడుతున్న 99 ప్రాజెక్టుల నిర్మాణానికి రూ.9020 కోట్ల అదనపు బడ్జెట్ కేటాయించేందుకు కేంద్ర క్యాబినెట్ నిర్ణయం తీసుకుంది. ప్రధానమంత్రి కృషి సించాయి యోజన కింద వివిధ రాష్ట్రాల్లో చేపడుతున్న ప్రాజెక్టుల నిర్మాణానికి ఈ నిధులను కేంద్ర ప్రభుత్వం ఆరు శాతం వడ్డీతో నాబార్డు ద్వారా రాష్ట్రా లకు అందజేయనుంది. ఈ మేరకు బుధవారం ప్రధాన మంత్రి నరేంద్రమోడీ నేతృత్వంలో సమావేశమైన క్యాబినెట్ ఆమోద ముద్ర వేసింది. సత్వర సాగునీటి లబ్ది కార్యక్రమం కింద దేశవ్యాప్తంగా భారీ, మధ్య తరహా ప్రాజెక్టుల నిర్మాణా నికి కేంద్రం నిర్ణయం తీసుకుంది. 2019 డిసెంబర్ లోగా ఈ 99 ప్రాజెక్టులను పూర్తిచేయాలని లక్ష్యంగా నిర్దేశించు కుంది. ఈ క్రమంలో ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరమైన నిధులు సమకూర్చేందుకు కేంద్ర ఆర్థికమంత్రి గతంలో ప్రత్యేక దీర్ఘకాల సాగునీటి నిధిని ప్రకటించారు. ప్రాజెక్టుల నిర్మాణానికి నాబార్డు నుంచి కేంద్రం ఆరు శాతం వడ్డీతో రాష్ట్రాలకు రుణాలు అందజేస్తోంది. ప్రాజెక్టులను నిర్దేశిత కాలంలో పూర్తి చేసిన రాష్ట్రాలకు సంబంధించిన రుణాల భారం కేంద్రమే భరించనుంది. 2016-17 యేడాదిలో నాబార్డు మొత్తంగా రూ.9086 కోట్లు పంపిణీ చేసింది. ఇందులో ఒక్క పోలవరం ప్రాజెక్టుకు రూ.2414.16 కోట్లు విడుదల చేసింది. మిగిలిన రూ.6671.86 కోట్లు మిగతా ప్రాజెక్టులకు కేటాయించింది. ఇదే యేడాదికి సంబంధించి కేంద్ర సాయంగా రూ.924.9 కోట్లు విడుదల చేశారు. ఇక 2017-18 యేడాదికి గాను దీర్ఘకాల సాగునీటి నిధి రూ.29,000 కోట్లు అవసుందని కేంద్రం అంచనా వేసింది. ఇందులో అదనపు బడ్జెట్ రూ.9020 కోట్లు అవసరమని భావించి ఈ మేరకు నిర్ణయం తీసుకుంది.

ఏపి నిట్‌లో సిబ్బంది నియామకానికి కేంద్రం ఆమోదం
ఒక డైరెక్టర్, ముగ్గురు భోదనేతర సిబ్బంది

ఆంధ్రప్రదేశ్ నిట్ (నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ)కి ఒక డైరెక్టర్, ముగ్గురు భోదనేతర సిబ్బంది నియామకానికి కేంద్ర కేబినేట్ అంగీకారం తెలిపింది. ముగ్గురు భోదనేతర సిబ్బందిలో రిజిస్ట్రారు, లైబ్రేరియన్, క్రీడాధికారి పోస్టులు భర్తీకి కేంద్ర మంత్రి వర్గం నిర్ణయం తీసుకొంది. బుధవారం నాడిక్కడ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రి వర్గ సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. నిట్‌లో ఒక డైరెక్టర్, మూడు భోదనేతర సిబ్బంది నియామకం, వారి జీతభత్యాలుపై నిర్ణయం తీసుకోవడం జరిగింది. డైరెక్టర్ వేతనం నెలకు రూ. 75 వేలతో పాటు రూ.5 వేల ప్రత్యేక భత్యముంటుంది. రిజిస్ట్రారు, లైబ్రేరియన్, క్రీడాధికారికి 10 వేల వేతనం ఇచ్చేందుకు నిర్ణయం తీసుకుంది.

భయాందోళనలో దేశ ప్రజలు
శరద్ యాదవ్




న్యూఢిల్లీ : దేశంలో ప్రజలు భయాందోళనలో ఉన్నారనీ, దేశ భిన్నమైన సంస్కృతి సాంప్రదాయాలను కాపాడటానికి తాను చివరికి వరకు పోరాడాతాననీ జెడి(యు) బహిష్కృత నేత శరద్‌యాదవ్ పేర్కొన్నారు. ఇదే నినాదంతో ప్రతిపక్ష పార్టీలను కలుపుకొని 'సహజ విరాజసత్ బసావో' కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నట్లు ప్రకటించారు. గురువారం ఢిల్లీ నుంచి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి ప్రతిపక్ష పార్టీలతోపాటు, రైతులు, నిరుద్యోగులు, మేధావులు, దళితులు హాజరుకావాలన్నారు. రాజ్యాంగం ప్రాథమికంగా ప్రసాధించిన వాక్కు స్వాతంత్ర హక్కు, స్వేచ్ఛ, సమానత్వానికి ప్రస్తుతం విఘాతం కలుగుతోందన్నారు. రాజ్యాంగ స్ఫూర్తికి పూర్తి విరుద్ధంగా ప్రస్తుతం భారతదేశంలో పాలన ఉందనీ, ప్రజలు భయాందోళనలో ఉన్నారనీ అన్నారు. జెడి(యు) అధ్యక్షుడు బీహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ ఈ కార్యక్రమంలో పాల్గొంటారా? అన్న ప్రశ్నకు స్పందిస్తూ తాను అందరిని ఆహ్వానించానన్నారు.

పదేళ్ల కష్టాన్ని ఒక నెలలో నాశనం చేశాడు
కాశ్మీర్‌లో ఉద్రిక్తతలపై రాహుల్ వ్యాఖ్య

బెంగళూరు: యుపిఎ హయాంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న పదేళ్ల కాలంలో కాశ్మీర్‌లో శాంతియుత వాతావరణం ఉండేలా చూస్తే దాన్ని ప్రధాని మోడీ నెలరోజుల్లో నాశనం చేశాడని కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు రాహుల్‌గాంధీ విమర్శించారు. బుధవారం కర్నాటకలో కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ర్యాలీలో ఆయన మాట్లాడుతూ .. ప్రధాని నరేంద్ర మోడీ విధానాలతోనే కాశ్మీర్ సమస్య మరింత జఠిలం అయ్యిందన్నారు. దీంతోనే పాకిస్తాన్‌కు కాశ్మీర్‌లో అవకాశం కల్పించినట్లు అయ్యిందనీ, తద్వారా దేశభద్రతకు ముప్పు ఏర్పడే పరిస్థితి తలెత్తిందన్నారు. బుల్లెట్ల ద్వారా కాశ్మీర్ సమస్యను పరిష్కరించలేరనీ, కాశ్మీర్ ప్రజలతో మమేకం కావడం ద్వారా మాత్రమే అది సాధ్యమన్నారు. కాశ్మీర్‌లో భయానక వాతావరణాన్ని మోడీ తయారు చేశారన్నారు. 2004లో అటల్ బిహారి వాజ్‌పయి నుంచి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ బాధ్యతలు తీసుకొనే సమయానికి కాశ్మీర్ సమస్య తీవ్రంగా ఉందన్నారు. మన్మోహన్‌సింగ్ ప్రధానిగా ఉన్న సమయంలో చిదంబరం, జయరాం రమేష్‌లతో కాశ్మీర్ సమస్యను శాంతియుతంగా పరిష్కరించినట్లు గుర్తు చేశారు. అది తాము సాధించిన గొప్ప విజయమనీ, అక్కడ పంచాయితీ ఎన్నికలు నిర్వహించామనీ, బ్యాంకుల్లో మహిళలను రప్పించామనీ పేర్కొన్నారు. 'ప్రభుత్వం కాశ్మీర్ ప్రజలతో మమేకం కావాలని కోరుకుంటున్నాం. అక్కడ శాంతియుత వాతావరణం కొనసాగాల్సి ఉంది. జమ్ముకాశ్మీర్‌లో పాకిస్తాన్ చేయ గలిగిందేమీ లేదు. పాకిస్తాన్‌కు అవకాశం ఇచ్చి ప్రమాదాన్ని కొనితెచ్చుకుంటున్నాం.' అని రాహుల్ పేర్కొన్నారు.

ఆర్టికల్ 35ఎ పై విచారణకు ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం



న్యూఢిల్లీ : జమ్మూ కాశ్మీర్ వాసులకు ప్రత్యేక హక్కులు కల్పిస్తున్న రాజ్యాంగంలోని 35ఎ అధికరణంపై విచారణకు ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు సుప్రీంకోర్టు చేసిన ప్రకటన మరో వివాదానికి దారి తీస్తోందని పరిశీలకులు చెబుతున్నారు. ఈ అధికరణం ద్వారా ప్రత్యేక హక్కులు కల్పించటం లింగ వివక్షతో కూడినదా? ఇది రాజ్యాంగానికి సంబంధించిన మూల వ్యవస్థను ఉల్లంఘిస్తోందా? అన్న అంశాలను ఈ ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం పరిశీలిస్తుందని సర్వోన్నత న్యాయస్థానం చెప్పటమే ఇందుకు కారణం. 1954లో రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం రాజ్యాంగంలో చోటు చేసుకున్న ఆర్టికల్ 35 ఎ ప్రకారం జమ్మూ కాశ్మీర్ పౌరులకు ప్రత్యేక హక్కులు, సౌకర్యాలు కల్పించటమే కాక రాష్ట్రేతరులను వివాహమాడిన మహిళలకు ఆస్థి హక్కును నిరాకరిస్తోంది. ఈ నిబంధన కేవలం ఆ మహిళకు మాత్రమే కాక ఆమె వారసులకు కూడా వర్తిస్తుండటం గమనార్హం. జమ్మూ కాశ్మీర్ రాష్ట్ర ప్రజలకు ప్రత్యేక హక్కులు, సౌకర్యాలు కల్పిస్తున్న ఆర్టికల్ 35ఎ రాజ్యాంగ మౌలిక సూత్రాలను ఉల్లంఘిస్తున్నదా? రాజ్యాంగ పరిధిని అతిక్రమిస్తోందా? అన్న అంశాలను ఈ ఐదుగురు సభ్యుల ధర్మాసనం విచారిస్తుందని సుప్రీంకోర్టు ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. ఇదే ఆర్టికల్‌ను సవాలు చేస్తూ దాఖలై ముగ్గురు సభ్యుల ధర్మాసనం ముందు పెండింగ్‌లో వున్న మరో పిటిషన్‌ను కూడా సుప్రీంకోర్టు దీనికి జత చేసింది.

మాలేగావ్ పేలుళ్ళ కేసులో
నిందితుల పిటిషన్లపై నేడు సుప్రీం విచారణ

న్యూఢిల్లీ : మాలేగావ్ బాంబు పేలుళ్ళ కేసులో నిందితుల అభ్యర్థనలపై వివరణాత్మక పరిశీలన అవసరమని, వాటిని పునఃవిచారణ జరుపుతామని సుప్రీం కోర్టు పేర్కొంది. 2008లో జరిగిన మాలేగావ్ బాంబు పేలుళ్ళ కేసుకు సంబంధించి మాజీ లెఫ్టినెంట్ కల్నల్ శ్రీకాంత్ ప్రసాద్ పురోహిత్‌కు బెయిల్ మంజూరు చేయడం, సాధ్వీ ప్రజ్ఞా సింగ్ ఠాకూర్‌కు బెయిల్ రద్దు చేయడానికి సంబంధించి వివరణాత్మక పరిశీలన అవసరమని కోర్టు పేర్కొంది. ఈ కేసు విచారణను గురువారం చేపట్టనున్నట్లు న్యాయమూర్తులు ఆర్.కె. అగర్వాల్, ఎం.ఎం.శంతనగౌడర్‌తో కూడిన ధర్మాసనం తెలిపింది. ఈ కేసులో నిందితులు ఇద్దరూ చేసుకున్న అభ్యర్థనలు ఒకే విధమైన వాస్తవాలపై ఆధారపడి ఉన్నాయని, అందువల్ల దీనిపై సుదీర్ఘ విచారణ అవసరమని సుప్రీం ధర్మాసనం పేర్కొంది.

'బ్లూవేల్' మింగేసింది

- ఆ గేమ్ ఆడుతూ ఆత్మహత్య చేసుకున్నారు
- కేరళ చిన్నారుల తల్లిదండ్రుల ఆరోపణ
- పోలీసుల దర్యాప్తు ప్రారంభం

తిరువనంతపురం: 'బ్లూవేల్ ఛాలెంజ్'...ఇదొక భయంకరమైన గేమ్. ఈ గేమ్ చిన్నారుల్లో ఎంత ఆసక్తి కలిగిస్తుందో..పెద్దల్లో అంతకంటే ఎక్కువ ఆందోళన కలిగిస్తోంది. దీనికి కేరళ, ముంబయి, పశ్చిమ బెంగాల్‌లో చోటుచేసుకున్న ఘటనలే కారణం. కేరళలో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న ఇద్దరు చిన్నారులు బ్లూవేల్ గేమ్ కారణంగానే మరణించినట్లు వార్తలు వచ్చిన నేపథ్యంలో తల్లిదండ్రుల భయం మరింత పెరిగింది. కన్నూరుకు చెందిన సావంత్ అనే యువకుడు బ్లూవేల్ గేమ్ ఆడుతూ జూలైలో ఆత్మహత్య చేసుకున్నట్లుగా ఆయన తల్లిదండ్రులు బుధవారం పోలీసులకు తెలిపారు. కేరళ రాజధాని తిరువనంతపురానికి చెందిన మనోజ్ సి మను(16) అనే బాలుడు కూడా ఈ గేమ్‌కు బానిసై జూలై 26న ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లుగా ఆయన తల్లి ఓ న్యూస్ చానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించిన సంగతి తెలిసిందే. అయితే వీరిద్దరి శరీరాలపై పదునైన పరికరంతో వాళ్ల ఇంటిపేరుతో గాట్లు ఉన్నట్లుగా తల్లిదండ్రులు పేర్కొన్నారు. దీంతో బుధవారం ఉదయం పోలీసు బృందం ఈ ఘటనలపై దర్యాప్తు ప్రారంభించింది. బ్లూవేల్ ఛాలెంజ్ గేమ్ ఆడుతూ వారు ఆత్మహత్య చేసుకున్నారనడానికి ఇంత వరకూ ఆధారాలు లభించలేదని, అయినా తల్లిదండ్రులు ఇచ్చిన సమాచారం మేరకు దర్యాప్తు చేస్తామని పోలీసులు వెల్లడించారు. దేశవ్యాప్తంగా ఇప్పటివరకూ ఆరుగురు యువకులు ఈ గేమ్ బారినపడి చనిపోయి ఉంటారని అధికారులు పేర్కొన్నారు. షోలాపూర్, ఇండోర్‌కు చెందిన ఇద్దరు యువకులు కూడా గేమ్ చివరి దశలో ఆత్మహత్యకు యత్నించగా కుటుంబసభ్యులు, స్నేహితులు అడ్డుకున్నారని గతవారం వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. మనోజ్ తల్లి ఓ ఛానెల్‌తో మాట్లాడుతూ గతేడాది నవంబరు నుంచీ మనోజ్ ఓ గేమ్ ఆడుతున్నాడనీ, ఆ తరువాత కాలంలో పలుమార్లు పగిలిన గాజులతో అవయవాలను కోసుకోవడం, 'ఎబిఐ' అని తన చేతిపై వృత్తలేఖినితో ఇంటిపేరు రాసుకోవడం వంటి హింసాత్మక ఘటనలకు పాల్పడినట్లుగా వెల్లడించారు. ఆ గేమ్ చివరి దశలో ఒకరిని చంపాల్సి ఉంటుంది లేదా చావాల్సి ఉంటుందని తనకు మనోజ్ స్వయంగా చెప్పినట్లుగా కూడా ఆమె తెలిపారు. ఏప్రిల్‌లో ఓసారి ఏదో పనిలో ఉన్న తన దగ్గరకు వచ్చి "అమ్మా! నేను చనిపోతే నువ్వు ఏడుస్తావా?" అని అడిగాడని ఆమె కన్నీళ్లు తుడుచుకుంటూ గతాన్ని నెమరువేసుకున్నారు. ఆత్మహత్య చేసుకోడానికి కొన్ని రోజుల ముందు వరుసగా కొన్ని హర్రర్ చిత్రాలు కూడా చూశాడని ఆమె పేర్కొన్నారు. జూన్ చివర్లో ముంబయికి చెందిన ఓ విద్యార్థి బహుళ అంతస్తు భవనం మీద నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్న సంగతి కూడా తెలిసిందే. భారత్‌లో చోటుచేసుకున్న తొలి 'బ్లూవేల్' ఆత్మహత్యగా దీన్ని పరిగణించారు. అయితే ఈ ఘటనకు కూడా ఆధారాలు లేవని పోలీసులు పేర్కొన్నారు.

మధ్యప్రదేశ్ 'పుర' ఎన్నికల్లో బిజెపికి ఆధిక్యత

భోపాల్ : మధ్యప్రదేశ్‌లో ఈ నెల 11న జరిగిన పురపాలక సంస్థల ఎన్నికల ఫలితాలు బుధవారం వెలువడ్డాయి. మొత్తం 43 మున్సిపాల్టీల అధ్యక్ష పదవులకు జరిగిన ఎన్నికలలో 26 స్థానాలను బిజెపి గెలుచుకుంది. కాంగ్రెస్ తన స్థానాలను 14కు పెంచుకుంది. మూడు స్థానాలలో స్వతంత్ర అభ్యర్థులు గెలుపొందారు. ఫలితాలు సంతృప్తికరంగానే వచ్చాయని కాంగ్రెస్ రాష్ట్రశాఖ అధ్యక్షుడు అరుణ్ యాదవ్ పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ గతంలో కంటే తన స్థానాలను రెట్టింపు చేసుకోవడం విశేషం.

లడక్‌లో చొరబాటు వార్తలను తోసిపుచ్చిన చైనా

బీజింగ్: లడఖ్‌లోని పాగోగ్ తిసో సరస్సు ప్రాంతంలో భారత భూ భాగంలోకి తమ సైనికులు చొరబడినట్లు వెలువడిన వార్తలు అవాస్తవమని చైనా అధికారులు ప్రకటించారు. తాము శాంతికి కట్టుబడి ఉన్నామనీ, సరిహద్దులో ప్రశాంత వాతావరణం కోరుకుంటున్నామనీ పేర్కొన్నారు. లడఖ్‌లో చైనా-భారతదళాల మధ్య మంగళవారం కొద్దిపాటి ఘర్షణ జరిగినట్టు వార్తలు వెలువడ్డాయి,. చైనా సైనికులు ఆక్రమణకు దిగుతుండడంతో తాము అడ్డుకున్నామని భారత ఆర్మీ అధికారులు పేర్కొన్నారు.. ఇరుదేశాల సైనికుల మధ్య కొద్ది పాటి రాళ్ల దాడి జరిగినట్లుగా కూడా వార్తలు వెలువడిన నేపథ్యంలో చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి హు చునియింగ్ మాట్లాడుతూ, ఈ ఘటన గురించి తన వద్ద ఎలాంటి సమాచారం లేదన్నారు. చైనా సరిహద్దు వెంబడి తమ పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ (పిఎల్ఎ) బలగాలు గట్టి పహారా నిర్వహిస్తున్నాయన్నారు. భారత్-చైనా సరిహద్దులో శాంతిని, స్నేహపూర్వక వాతావరణాన్నే చైనా కోరుకుంటుందన్నారు. భారత్ కూడా శాంతికి కట్టుబడి ఉండి ఇరుపక్షాల మధ్య శాంతియుత వాతావరణానికి బాటలు వేయాలని తాము కోరుకుంటున్నట్లు తెలిపారు. భూటాన్ సరిహద్దుల్లో డోక్లాం వద్ద ఘర్షణ వాతావరణం నెలకొన్న సంగతి తెలిసిందే. భారత్-చైనా బలగాలు మోహరించడంతో గత 60 రోజులుగా ఆ ప్రాంతంలో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. భారత్ చైనాల మధ్య లడఖ్ వెంబడి సరిహద్దులో ఉద్రిక్తతలు తలెత్తిన నేపథ్యంలోఇరుదేశాల సీనియర్ అధికారులు బుధవారం ఫ్లాగ్ మీటింగ్ నిర్వహించారు. మంగళవారం లడఖ్ ప్రాంతంలో ఇరు దేశాల సైనికులు ఘర్షణపడ్డట్టు వచ్చిన వార్తల నేపథ్యంలో ఈ భేటీ జరిగింది. లడఖ్‌లోని పాగోగ్ సరస్సు ప్రాంతంలో 15 మంది చైనా సైనికులు చొరబడ్డారని భారత్ పేర్కొంటోంది. రాళ్లదాడి ఘటనలను సీనియర్ అధికారులెవరూ ధ్రువీకరించలేదు.

సిక్కుల ఊచకోత కేసుల మూసివేతపై కమిటీ : సుప్రీం

న్యూఢిల్లీ : సిక్కుల ఊచకోత ఘటనలకు సంబంధించి కేసుల విచారణను పర్యవేక్షించేందుకు ఒక సూపర్‌వైజరీ కమిటీని నియమించనున్నట్లు సుప్రీం కోర్టు బుధవారం తెలిపింది. 1984లో చోటు చేసుకున్న సిక్కులపై దాడుల ఘటనలకు సంబంధించి సిట్ మూసివేయ తలపెట్టిన 241 కేసులలో దర్యాప్తు తగిన విధంగా జరిగిందో లేదో తెలుసుకునేందుకు కమిటీని నియమించనున్నట్లు సుప్రీం కోర్టు వెల్లడించింది. సూపర్‌వైజరీ కమిటీలో ఇద్దరు మాజీ న్యాయమూర్తులు ఉంటారని పేర్కొంది. సిక్కులపై దాడుల కేసులపై విచారణ జరిపిన ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) ఆ కేసులను మూసివేయనున్నట్లు కోర్టుకు తెలిపింది. విచారణ నిలిచిపోయిన కారణంగా 199 కేసులను మూసివేసినట్లు గత మార్చిలో సిట్ సుప్రీం కోర్టుకు తెలియచేసింది. మరో 59 కేసులపై దర్యాప్తు జరుగుతోందని తెలిపింది. అయితే దీనిపై సుప్రీం స్పందిస్తూ సిట్ దర్యాప్తు సరిగా జరిగిందో లేదో తెలుసుకునేందుకు ఒక కమిటీని నియమిస్తామని, దాని నివేదిక ఆధారంగా నిర్ణయం గైకొంటామని జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది. ఈ కమిటీ మూడు నెలల్లోగా నివేదికనిస్తుందని,. కమిటీలో ఉండే న్యాయమూర్తుల పేర్లను తరువాత వెల్లడిస్తామని పేర్కొంది.

ఇంట్లో సంక్షోభం మోత బయట యుద్ధం బాట

వెనిజులాపై మైక్‌పెన్స్ వ్యాఖ్యలను ఖండించిన ఎవో మొరేల్స్

లాపాజ్ : వెనిజులాకు వ్యతిరేకంగా అమెరికా ఉపాధ్యక్షుడు మైక్ పెన్స్ చేసిన కొన్ని ప్రకటనలను బొలీవియా అధ్యక్షుడు ఎవో మొరేల్స్ తిరస్కరించారు. కొలంబియాలో జరిపిన 48గంటల పర్యటనలో భాగంగా మైక్ పెన్స్ ఈ వ్యాఖ్యలు చేశారు. అమెరికాకు వెనిజులా ముప్పుగా పరిణమించగలదని పెన్స్ వ్యాఖ్యానించారు. కానీ ఈ ప్రపంచానికి అసలైన ప్రమాదం వర్ణవివక్ష, విద్వేషాల నుండి పొంచి వుందని, హింసాగ్నిని ప్రజ్వరిల్లచేసేది ఇవేనని బొలీవియా అధ్యక్షుడు పేర్కొన్నారు. ఆదివారం కొలంబియా వచ్చిన పెన్స్ ఆ దేశ అధ్యక్షుడితో భేటీ అయ్యారు. వెనిజులాపై సైనికచర్య అవకాశాన్ని తోసిపుచ్చలేమని పెన్స్ పేర్కొన్నారు. ఇందుకు గానూ ఆ ప్రాంతంలోని తమ మిత్ర పక్షాలతో కలిసి పనిచేస్తామని తెలిపారు. వెనిజులా నియంతృత్వానికి పాల్పడుతోందని అమెరికా ఆరోపిస్తోందని, కానీ వెనిజులాపై సైనిక చర్యను సమర్థించుకోవడంలో మాత్రం విఫలమైందని మొరేల్స్ ట్వీట్ చేశారు. ఇదిలావుండగా, బొలివారియన్ విప్లవం ప్రజాస్వామ్యానికి చక్కని ఉదాహరణ అని వెనిజులా అధ్యక్షుడు నికొలస్ మదురో వ్యాఖ్యానించారు.



సైనిక చర్య పరిష్కారం కాదు

అర్జెంటైనా అధ్యక్షుడి వ్యాఖ్య

బ్యూనస్ ఎయిర్స్ : వెనిజులాలో నెలకొన్న సంక్షోభాన్ని పరిష్కరించడానికి అవసరమైతే సైనిక చర్యకు దిగుతామంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన హెచ్చరికను లాటిన్ అమెరికా మిత్ర దేశాలు తీవ్రంగా విమర్శించాయి. బల ప్రయోగమనేది పరిష్కారం కాదని అర్జెంటైనా అధ్యక్షుడు మాక్రి వ్యాఖ్యానించారు. ప్రస్తుతం ఇక్కడ పర్యటిస్తున్న అమెరికా ఉపాధ్యక్షుడు మైక్ పెన్స్‌తో కలిసి సంయుక్త పత్రికా సమావేశంలో పాల్గొన్న మాక్రి పై వ్యాఖ్యలు చేశారు. ట్రంప్ చేసిన హెచ్చరికల ప్రభావాన్ని తగ్గించేందుకు, వెనిజులా విషయంలో అమెరికాకు మద్దతు కూడగట్టుకునేందుకు పెన్స్ ప్రయత్నిస్తున్నారు. అందులో భాగంగానే లాటిన్ అమెరికా దేశాల్లో పర్యటిస్తున్నారు. శాంతియుతంగా ఒత్తిడి తీసుకురావడానికే తాము ప్రాధాన్యత ఇస్తామని పెన్స్ స్పష్టం చేశారు. అయితే సైనిక చర్య అవకాశాన్ని కూడా ఆయన తోసిపుచ్చలేదు.

ట్రంప్ వైఖరిపై విమర్శల వెల్లువ

వాషింగ్టన్ : స్వదేశంలో ప్రభుత్వ యంత్రాంగంలో సంక్షోభం నెలకొన్నప్పటికీ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ దాన్ని పట్టించుకోకుండా, పరిష్కరించడానికి ప్రయత్నించకుండా విదేశాల్లో యుద్ధ భేరీ మోగిస్తున్నారు. దేశంలో రాజకీయ అసహనం, రాజకీయపరమైన హింసాకాండ పెరుగుతున్నాయని అనేకమంది అమెరికన్లు విశ్వసిస్తున్నారని అభిప్రాయ సేకరణల్లో వెల్లడైంది. అలాగే వీధి స్థాయి నిరసనలు, హింస కూడా పెరిగే



అవకాశం వుందని ఒపీనియన్ పోల్స్ వెల్లడిస్తున్నాయి. ప్రదర్శనలు, నిరసనలు, పికెట్లు, బ్లాకేడ్లు, అప్రమత్తత ప్రకటించడం వంటి పరిస్థితులు గత కొన్ని మాసాలుగా అమెరికావ్యాప్తంగా చోటు చేసుకుంటున్నాయి. వీటికి పరాకాష్ట, తాజా ఉదాహరణ చార్లెట్స్‌విల్లె నిరసనలు, హింసాకాండ. వర్జీనియాలో చోటు చేసుకున్న సంఘటనలకు దేశవ్యాప్తంగా నిరసనలు హోరెత్తాయి. వరుసగా రెండు రోజుల పాటు వాటి ప్రకంపనలు వినిపించాయి. ఇదిలావుంటే, చార్లెట్స్‌విల్లె ఘటనకు ఉభయ పక్షాల బాధ్యత వుందని ట్రంప్ పేర్కొన్నారు. శ్వేత జాతీయులు, నయా నాజీలు రెచ్చిపోయి పాల్పడిన చర్యలను సమర్థిస్తూ వారిని, వారిని వ్యతిరేకిస్తూ నిరసనలకు పాల్పడిన వారిని ఒకే గాటన కట్టారు. కాన్ఫెడరేట్ స్మారక విగ్రహాలను పరిరక్షించేందుకు మితవాదుల గ్రూపులు కృషి చేశారంటూ వారిపట్ల సానుభూతి ప్రదర్శించారు. వర్జీనియాలో హింసాకాండ జరిగిన వెంటనే ట్రంప్ వైట్‌హౌస్‌లో ఒక ప్రకటన చేస్తూ కెకెకె సభ్యులను, నయా నాజీలను నేరస్తులుగా అభివర్ణించారు. వాటికి పూర్తి భిన్నంగా ట్రంప్ తాజా వ్యాఖ్యలు వెలువడ్డాయి. అయితే ఈ వ్యాఖ్యలకు సొంత పార్టీ రిపబ్లికన్ల నుండే ఘాటుగా విమర్శలు వెల్లువెత్తవచ్చని ట్రంప్ సలహాదారులు భావిస్తున్నారు.

వైట్‌హౌస్‌లో మళ్ళీ మార్పులు?

గత కొన్ని మాసాలుగా, ట్రంప్ జాతీయ భద్రతా సలహాదారు, ట్రంప్ ముఖ్య వ్యూహకర్తల మధ్య పోరు కొనసాగుతున్న నేపథ్యంలో వైట్‌హౌస్‌లో మళ్ళీ మార్పులు తప్పని పరిస్థితి కనిపిస్తోంది. లెఫ్టినెంట్ జనరల్ మెక్‌మాస్టర్, రాజకీయ వ్యూహకర్త స్టీఫెన్ బానన్‌ల మధ్య వివాదం తీవ్ర స్థాయికి చేరుకుంది. ట్రంప్ సలహాదారుల బృందం కుదుపులకు లోనవుతోందని అధికారులు పేర్కొంటున్నారు. బానన్‌ను తొలగించాలని మోడరేట్ రిపబ్లికన్లు ఒత్తిడి తెస్తున్నారు. దానికి ట్రంప్ బహిరంగంగానే నిరాకరిస్తున్నారు.

'ఉత్తర కొరియాతో చర్చలకు సిద్ధమే'

వాషింగ్టన్ : ఉత్తర కొరియాతో చర్చలకు తాము సిద్ధంగానే వున్నామని అమెరికా విదేశాంగ మంత్రి రెక్స్ టిల్లర్‌సన్ మంగళవారం తెలిపారు. చర్చలు జరపడం ద్వారా పరిష్కారాన్ని కనుగొనడానికి తాము కూడా ఆసక్తిగానే వున్నామని, అయితే దీనిపై నిర్ణయించాల్సింది ఉత్తర కొరియా నేత కిమ్ జోంగ్ ఉన్ అని టిల్లర్‌సన్ వ్యాఖ్యానించారు. అమెరికా భూభాగమైన గుయామ్‌పై క్షిపణులతో దాడికి తమ వద్ద పకడ్బందీ ప్రణాళిక వుందని, కిమ్ జోంగ్ తీసుకునే నిర్ణయంపై ఈ ప్రణాళిక అమలు ఆధారపడి వుందని గత గురువారం ఉత్తర కొరియా సైన్యం ప్రకటించిన నేపథ్యంలో గత కొన్ని రోజులుగా కొరియా ద్వీపకల్పంలో ఉద్రిక్తతలు నెలకొన్నాయి.

అమెరికా, జపాన్ సంయుక్త సైనిక విన్యాసాలు

ఎనివా (జపాన్) : ప్రాంతీయ ఉద్రిక్తతలు నెలకొన్న నేపథ్యంలో ఉత్తర జపాన్‌లో దాదాపు 300మంది జపాన్, అమెరికా సైనిక సిబ్బంది బుధవారం సైనిక విన్యాసాలు నిర్వహించారని అధికారులు తెలిపారు. 19 రోజుల పాటు సాగే విన్యాసాల్లో భాగంగా లైవ్ ఫైర్ డ్రిల్ నిర్వహించారు. గుయామ్‌పై క్షిపణులను ప్రయోగిస్తామంటూ ఉత్తర కొరియా హెచ్చరించిన నేపథ్యంలో ఇరు పక్షాల మధ్య మాటల యుద్ధం చోటు చేసుకుంది. ఉత్తర ద్వీపమైన హోక్కైడోలో జపాన్ పదాతి రక్షణ బలగాలు (జిఎస్‌డిఎఫ్), అమెరికా మెరైన్స్ బలగాలు కలిసి సాయుధ వాహనాల నుండి కాల్పులు జరిపారు. ఈ కార్యకలాపాల్లో 1300మంది జిఎస్‌డిఎఫ్ బలగాలు, 2వేల మంది మెరైన్లు పాల్గొన్నారు. ఈ డ్రిల్‌కు, ఉత్తరకొరియా ఉద్రిక్తతలకు సంబంధం



లేదని జపాన్ రక్షణ మంత్రిత్వ శాఖ ప్రతినిధి తెలిపారు. ఏ ఒక్క దేశాన్ని లేదా ప్రాంతాన్ని దృష్టిలో వుంచుకుని ఈ విన్యాసాలు నిర్వహించలేదని చెప్పారు. ఒకవేళ ఉత్తర కొరియా క్షిపణిని ప్రయోగిస్తే దాన్ని అడ్డుకునేందుకు అది వెళ్ళే దారి పొడుగునా జపాన్ కూడా పలు క్షిపణి వ్యవస్థలను మోహరించింది.



ఈశాన్య నైజీరియాలో ఆత్మాహుతి దాడులు

27 మంది మృతి, 83 మందికి పైగా గాయాలు

మైదుగురి : నైజీరియా ఈశాన్య ప్రాంతంలో మంగళవారం జరిగిన ఆత్మాహుతి దాడిలో కనీసం 27 మది మరణించారని అధికారులు తెలిపారు. బొకోహరం మిలిటెంట్ దళానికి చెందిన ఒక ఆత్మాహుతి దళ సభ్యురాలు ఈ దాడికి పాల్పడినట్లు అత్యవసర సేవల విభాగం అధికారి ఒకరు వివరించారు. మరో ఘటనలో ఇద్దరు ఆత్మాహుతి దళ సభ్యులు ఒక శరణార్థి శిబిరం వద్ద తమను తాము పేల్చివేసుకున్న ఘటనలో పలువురు గాయపడ్డారని వివరించారు. ఈ మూడు ఘటనల్లోనూ మొత్తం 83 మందికి పైగా గాయపడ్డారన్నారు. నైజీరియాలో ఇస్లామిక్ స్టేట్ స్థాపనకు ఎనిమిదేళ్ల క్రితం బొకొహరం సంస్థ ప్రారంభించిన పోరాటంలో ఇప్పటి వరకు 20 వేల మంది మరణించగా, మరో 27 లక్షల మంది నిర్వాసితులుగా మారిన విషయం తెలిసిందే.

చార్లెట్స్‌విల్లె సంఘటన నేపథ్యంలో ట్రంప్ కౌన్సిల్‌కు అమెరికన్ కార్మిక నేత రాజీనామా

వాషింగ్టన్ : అమెరికాలో ప్రధాన కార్మిక సంఘం ఎఎఫ్ఎల్-సిఐఒ అధ్యక్షుడు రిచర్డ్ ట్రంకా, చార్లెట్స్‌విల్లె హింసాకాండకు నిరసనగా ట్రంప్ కౌన్సిల్‌కు మంగళవారం రాజీనామా చేశారు. ఈ ఘటన పట్ల అధ్యక్షుడు స్పందించిన తీరు చూస్తుంటే వర్ణవివక్షను, దేశీయ తీవ్రవాదాన్ని ఆయన



ప్రోత్సహిస్తున్నట్లు భావించాల్సి వస్తోందని ఆయన విమర్శించారు. ఇటువంటి భావజాలంతో వున్న వ్యక్తితో కలిసి కౌన్సిల్‌లో కూర్చోలేమని ఆయన స్పష్టం చేశారు. " కెకెకె సభ్యులు, నయా నాజీలకు వ్యతిరేకంగా సోమవారం బలవంతంగా ట్రంప్ చేసిన వ్యాఖ్యలను తిరస్కరించేలా, నిరాకరించేలా ఈనాటి వ్యాఖ్యలు వున్నాయి. ఈ విద్వేష గ్రూపుల భావజాలాన్ని తిరస్కరించే అమెరికా కార్మిక ప్రజల తరపున మనం రాజీనామా చేయాలి" అని ఆయన పేర్కొన్నారు. చార్లెట్స్‌విల్లె సంఘటనపై సరిగా స్పందించలేదంటూ తనపై వస్తున్న విమర్శలపై ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సంఘనటలో ఇరు పక్షాలదీ తప్పు వుందంటూ వ్యాఖ్యానించారు.

దక్షిణాఫ్రికా దేశాల ప్రాంతీయ సమగ్రతకు చర్యలు

ప్రిటోరియా : ఆఫ్రికా దేశాల ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే ప్రయత్నంలో భాగంగా దక్షిణాఫ్రికా, ఇతర ప్రాంతీయ దేశాల సమగ్రత కోసం దక్షిణ ఆఫ్రికా దేశాల అభివృద్ధి కమ్యూనిటీ (ఎస్‌ఎడిసి) ఎజెండా ప్రాముఖ్యతను దక్షిణాఫ్రికా మంత్రి మైతే నికొనా మాషబనె ప్రశంసించారు. ఈ నెల 19, 20 తేదీల్లో ప్రిటోరియాలో జరగనున్న ఆఫ్రికా దేశాల ప్రభుత్వాధినేతల సమావేశానికి ముందుగా ఎస్‌ఎడిసి మంత్రిత్వ స్థాయి సమావేశాన్ని ఆయన ప్రారంభించారు. వచ్చే ఏడాది ఆగస్టు వరకు ఎస్‌ఎడిసి ఛైర్మన్ బాధ్యతలను దక్షిణాఫ్రికా నిర్వహించనుంది. ఛైర్‌వుమన్‌గా ఎన్నికైన అనంతరం మాషబనె మాట్లాడుతూ, ఈ సంస్థ లక్ష్యసాధనకు స్విట్జర్లాండ్ ప్రిన్స్ డ్లామిని చేసిన కృషిని ప్రశంసించారు. ప్రాంతీయ సమగ్రత దిశగా మనం సాగించే ప్రయాణంలో ప్రాంతీయ ప్రాధాన్యతలను గుర్తించడం చాలా ముఖ్యమని అన్నారు. ఆఫ్రికన్ యూనియన్ రూపొందించిన 2063 ఎజెండా ఆశయాలను కూడా గుర్తించాల్సి వుందని అన్నారు. ఇందుకు సంబంధించి ఎస్‌ఎడిసి ఎజెండా కొన్ని చొరవలు తీసుకుందని అన్నారు.

8వేలకు పైగా ఆయుధాలను అప్పగించిన ఫార్క్ తీవ్రవాదులు

బొగొటా : కొలంబియా ప్రభుత్వంతో శాంతి ఒప్పందం కుదిరిన తర్వాత 8వేలకు పైగా ఆయుధాలను, 13లక్షల తూటాలను ఫార్క్ తీవ్రవాదులు అప్పగించినట్లు ఐక్యరాజ్య సమితి తెలిపింది. మంగళవారంతో ఫార్క్ తీవ్రవాదుల నిరాయుధీకరణ క్రమం అధికారికంగా ముగిసింది. ఆయుధాల అప్పగింత కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న ఐక్యరాజ్య సమితి లా గుయాజిరా ప్రావిన్స్‌లోని ఫోన్సెకా శిబిరం నుండి చివరి విడతగా ఆయుధాలను తరలించింది. ఈ ఏడాది ప్రారంభం నుండి దేశంలోని పలు జోన్లలో ఫార్క్ తీవ్రవాదులు నివసిస్తున్నారు. అందులోని ఒక శిబిరం నుండి ఆయుధాల తరలింపు జరిగింది. 8,112 ఆయుధాలను స్వాధీనం చేసుకున్నామని, 13లక్షల తూటాలను నాశనం చేశామని ఐక్యరాజ్య సమితిలో కొలంబియా వ్యవహారాల ఇన్‌చార్జి జేన్ అర్నాల్ట్ చెప్పారు. 7,132 ఆయుధాలు వున్నాయని జూన్‌లో ఐక్యరాజ్య సమితి తొలుత పేర్కొన్న దానికన్నా ఎక్కువగా ఆయుధాలు ఇప్పుడు అప్పగించారు. ఈ ఒప్పందం కింద దాదాపు 7వేల మంది ఫార్క్ తీవ్రవాదులు తమ ఆయుధాలను అప్పగించారు. ఇందుకు ప్రతిగా పార్లమెంట్‌లో 10 స్థానాలను వారికి కేటాయిస్తామని హామీ ఇచ్చారు.

మొదటి పేజీ తరువాయి

ఒక్క ఇంటినైనా కట్టించారా..?

పలికారు. హిందూ, ముస్లిం మహిళలు జగన్‌కు రాఖీలు కట్టి సెల్ఫీ ఫొటోలు దిగారు. ఈ సందర్భంగా పలు సెంటర్లలో జగన్ మాట్లాడారు. వైఎస్ పాలనలో నంద్యాలలో 21,800 పింఛన్లు ఉండేవని, బాబు పాలనలో 15 వేలకు కుదించారని తెలిపారు. చంద్రబాబు మోసపూరిత మాటలతో గద్దెనెక్కి బాబు పాలనలో రేషన్‌షాపులో బియ్యం తప్ప ఏ ఒక్కటీ ఇవ్వడం లేదని, అది కూడా వేలిముద్రలు సరిగా పడడం లేదని ఎద్దేవా చేశారు. నంద్యాలలోని కాలనీల అభివృద్ధికి బాబు ఒక్క రూపాయీ ఇచ్చిన పాపాన పోలేదన్నారు. ఇక్కడే జరిగే ఉపఎన్నికలో మనం వేసే ఓటు ఎవరినో ఎమ్మెల్యేను చేసేందుకు కాదని తెలిపారు. చంద్రబాబు పాలనపై వేసే ఓటు ధర్మానికి, అధర్మానికి వేసేదన్నారు. ఈ మూడున్నరేళ్లలో బాబు కేబినెట్‌లో ఏ మంత్రయినా నంద్యాల నడ్డిరోడ్డుపై ఏనాడైనా మళ్లి చూశారా అని ప్రశ్నించారు. నంద్యాలలో ఉప ఎన్నికలు రావడంతోనే బాబుకు అన్ని మళ్ళీ గుర్తుకొచ్చాయని, సిఎం హోదాలో ఇచ్చిన హామీలనూ అమలు చేయలేదని విమర్శించారు. ఈ ఉపఎన్నికలో ఓడిపోతాననే భయం బాబుకు పట్టుకుందని, దీంతో ప్రతి ఒక్కరినీ భయభ్రాంతులకు గురి చేస్తూ పోలీసు బలంతో ఓట్లు అడుగుతున్నారన్నారని ఆరోపించారు. నంద్యాల అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాని కోరారు.

ఓటు తూటాతో కాల్చేయండి

రెండుసార్లు అవకాశమిచ్చి గౌరవించినట్లు తెలిపారు. అయినా టిడిపికి ద్రోహం చేస్తూ వైసిపిలో చేరి టిడిపినే విమర్శిస్తున్నారన్నారు. కుల, మత, జాతి, ప్రాంతీయ విభేదాలను రెచ్చగొట్టి నేటి ఉపఎన్నికల్లో గెలిచేందుకు వైసిపి ప్రయత్నిస్తోందన్నారు. సాక్షి ఛానల్, పేపర్, ఎవరిదో జగన్ ప్రజలకు చెప్పాలని తెలిపారు. జగన్ చెప్పే మాటల్లో వాస్తవం లేదని, పేపర్, టివిలతో సంబంధం లేకపోతే సిబిఐ, ఇడి ఆస్తులను ఎలా జప్తు చేసిందని ఆయన ప్రశ్నించారు. మాజీ సీఎం వైఎస్.రాజశేఖర్‌రెడ్డి జలయజ్ఞాన్ని ధనయజ్ఞంగా మార్చి రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని విమర్శించారు. రాష్ట్రాన్ని విభజించిన ఘనత కాంగ్రెస్‌దేదని తెలిపారు. సాగునీటి ప్రాజెక్టులను శరవేగంగా పూర్తి చేస్తున్నామని చెప్పారు. మైనార్టీల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. భూమానాగిరెడ్డికి తొలిసారిగా ఆళ్లగడ్డలో టిడిపి నుంచి ఎన్‌టిఆర్ అవకాశం కల్పించారని గుర్తు చేశారు. నేడు వారి వారసులకు అవకాశం కల్పించామని తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని గెలిపించాలని, టిడిపికి గత వైభవం తీసుకురావాలని కోరారు. అనంతరం దీబగుంట్ల, యాల్లూరు గ్రామాల మీదుగా రోడ్ షోలు నిర్వహించి, రైతునగరం, కానాల, గోస్పాడు మండలంలోని పసురపాడు, చింతకుంట్ల, జూలెపల్లె, ప్రాంతాల్లో పర్యటించారు.

అనుకున్నదే జరిగింది !

తావిస్తోంది. రోహిత్ ఆత్మహత్యకు ప్రభుత్వమే కారణమంటూ అప్పట్లో విద్యార్థులు దేశవ్యాప్తంగా ప్రదర్శనలు నిర్వహించిన నేపథ్యంలో ఈ ఘటనపై నిజనిర్ధారణ కోసం నియమించిన జస్టిస్ ఎకె రూపన్‌వాల్ కమిటీ అందజేసిన నివేదికను కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ బుధవారం బహిర్గతం చేసింది. ఆ నివేదిక ప్రకారం రోహిత్ కేసులో ఎవరిపైనా చర్యలు అవసరం లేదని కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ తెలిపింది.

రోహిత్ ఆత్మహత్యకు దారితీసిన పరిస్థితులకు సంబంధించి ఎటువంటి ఆధారాలు లేవని, ఆయన ఆత్మహత్యకు ఎవరూ కారణం కాదని నివేదిక పేర్కొన్నట్లుగా ప్రభుత్వం చెప్పింది. అంతేగాక రోహిత్ దళితుడు కాదని, ఒబిసి కేటగిరీకి చెందిన వాడని కూడా రూపన్‌వాల్ కమిటీ నివేదిక తేల్చిందని చెప్పింది. అయితే భవిష్యత్తులో ఈ తరహా ఘటనలు పునరావృతం కాకుండా కమిటీ చేసిన సూచనలను అమలు చేసేందుకు ప్రభుత్వం అంగీకరించింది. యూనివర్శిటీలో అధ్యాపకులు విధించే శిక్షలు, జరిమానాలపై విద్యార్థులు అప్పీళ్లు చేసుకునేందుకు వీలుగా యంత్రాంగం, అందరికీ సమానంగా అవకాశాలు అందేలా వివక్ష వ్యతిరేక కమిటీలు, పర్యవేక్షక కమిటీలు, కౌన్సిలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని యుజిసిని కోరినట్లు ప్రభుత్వం తెలిపింది.

రోహిత్ వేముల కేసులో ప్రభుత్వం మోసపూరితంగా వ్యవహరించిందని పలువురు సామాజిక కార్యకర్తలు పేర్కొన్నారు. ఆత్మహత్య అనంతరం దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తిన సమయంలో రోహిత్ ఎస్సీ అని అధికారులు ధృవీకరించారు. అయితే ఇంతలోనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఒత్తిడి ఎక్కువ అవడంతో రోహిత్ ఎస్సీ కాదని, ఒబిసి కేటగిరీకి చెందిన వారని అధికారులు ప్రకటించారు. దీన్ని ఆధారంగా చేసుకునే రూపన్‌వాల్ కమిటీ రోహిత్ ఎస్సీ కాదని నివేదికలో పేర్కొంది. మరోవైపు యూనివర్శిటీ విధించిన ఆంక్షలు రోహిత్ ఆత్మహత్యకు దారి తీశాయని విద్యార్థులు వాదిస్తున్నారు.

రక్తమోడిన వంశధార

(మొదటి పేజీ తరువాయి)

పనులు కొనసాగించేందుకు ఉపక్రమించడంతో నిర్వాసితులు అడ్డుకున్నారు. పోలీసులు వారిని అక్కడి నుంచి చెదరగొట్టేందుకు ప్రయత్నించారు. ఈ సందర్భంగా నిర్వాసితులకు, పోలీసులకు మధ్య వాగ్వివాదం జరిగింది. దీంతో పోలీసులు రెచ్చిపోయారు. వృద్ధులు, మహిళలు అనే తేడా లేకుండా లాఠీలతో విరుచుకుపడ్డారు. వాహనాలపై వస్తున్న నిర్వాసితులను గ్రామ పొలిమేరల్లో అడ్డగించి చిదకబాదారు. పోలీసుల దెబ్బలకు రక్తం ధారగా కారుతున్న నిర్వాసితులను సైతం వాహనాల్లోకి బలవంతంగా ఎక్కించి జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్లకు తరలించారు. సుమారు 40 మంది నిర్వాసితులను అరెస్టు చేశారు. వారిలో 21 మందిని మెళియాపుట్టి పోలీస్ స్టేషన్లో ఉంచినట్లు సమాచారం. పోలీసుల లాఠీఛార్జి సందర్భంగా గొడవలో జెఆర్‌పురం సి.ఐ, వీరఘట్టం, లావేరు ఎస్‌ఐలతో పాటు మరో ముగ్గురు కానిస్టేబుళ్లకు గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో పిహెచ్‌సికి తరలించారు. వార్తను సేకరించడానికి వెళ్లిన ఆంధ్రజ్యోతి విలేకరి ప్రసన్న కుమార్‌పై పోలీసులు లాఠీ ఛార్జి చేశారు. ఆముదాల స్టేషన్‌కు తరలించి, అనంతరం విడుదల చేశారు.

లాఠీఛార్జికి సిపిఎం ఖండన

వంశధార నిర్వాసితులపై లాఠీఛార్జిని సిపిఎం తీవ్రంగా ఖండించింది. ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం. కృష్ణమూర్తి, జిల్లా కార్యదర్శి వి. కృష్ణమూర్తి కాశీబుగ్గలో విలేకరులతో మాట్లాడారు. రైతులు కష్టపడి పండించుకుంటున్న పంటలను చంద్రబాబు ప్రభుత్వం దౌర్జన్యంతో ధ్వంసం చేయడాన్ని అడ్డుకున్న దుగ్గిపురం, పాడలి, తులగాం ప్రజలపై పాశవికంగా దాడి చేయడం అమానుషమన్నారు. అక్రమంగా అరెస్టులు చేయడాన్ని ప్రజలు వ్యతిరేకించాలన్నారు. నిర్వాసితులకు పునరావాసం కల్పించకుండా అన్యాయం చేస్తున్నారని తెలిపారు. అధిక సంఖ్యలో పోలీసులను మోహరింపజేసి నిర్వాసితులపై యుద్ధం ప్రకటించడం, ప్రజల్ని భయభ్రాంతులకు గురి చేయడం దారుణమన్నారు. ఇటువంటి రాక్షస చర్యలను సిపిఎం ఖండిస్తోందని, వంశధార నిర్వాసితులకు అండగా నిలుస్తుందని తెలిపారు.



చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు : ఎస్పీ

చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ త్రివిక్రమవర్మ హెచ్చరించారు. లాఠీఛార్జి అనంతరం పాడలి, దుగ్గుపురం ప్రాంతాలను ఆయన పరిశీలించారు. ఆ తర్వాత హిరమండలం పోలీస్ స్టేషన్లో విలేకర్లతో మాట్లాడారు. పనులను నిర్వాసితులు అడ్డుకుంటే సహించేది లేదన్నారు. అదుపులోకి తీసుకున్న నిర్వాసితులను జిల్లా మెజిస్ట్రేట్ ముందు హాజరు పరుస్తామని చెప్పారు. నిర్వాసితులు సంయమనం పాటించాలని అన్నారు.

నేర రహిత ఎపి

(మొదటి పేజీ తరువాయి)

చంద్రబాబు ప్రత్యేకంగా అభినందించారు. ఆక్టోపస్ సిబ్బంది కమాండో ఆపరేషన్స్‌లో వినియోగించే ఆధునిక ఆయుధాల ప్రదర్శనను సిఎం తిలకించారు.

'వినుకొండ' అధికారులకు అభినందనలు

గుంటూరు జిల్లా వినుకొండ వద్ద బోరు బావిలో పడిన బాలుడిని రక్షించిన అధికారులను సిఎం చంద్రబాబు ప్రత్యేకంగా అభినందించారు. టెక్నాలజీ, నాలెడ్జ్ ఎక్కడ ఉన్నా దాన్ని రాష్ట్రానికి తీసుకొచ్చి ఇక్కడ ఉపయోగించడానికి ఆలోచన చేస్తానన్నారు. ఐటి, ఐఒటిలను వినియోగించుకుని బెస్ట్ ప్రాక్టీసెస్ చేస్తే అత్యుత్తమ ఫలితాలు వస్తాయనే దానికి వినుకొండ ఘటన ఒక ఉదాహరణగా చెప్పారు. పోలీస్ హెడ్ క్వార్టర్స్ నిర్మాణంలో కీలకంగా వ్యవహరించిన అధికారులకు మెమొంటోలు బహూకరించారు. స్పీకర్ కోడెల శివప్రసాదరావు, పలువురు మంత్రులు, హోం శాఖ కార్యదర్శి అనురాధ సహా పోలీస్ అధికారులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

బ్రిటన్ విమానాశ్రయం సమీపంలో పేలుడు

లండన్ : బ్రిటన్‌లో ఎసెక్స్ విమానాశ్రయం సమీపంలో భారీ పేలుడు సంభవించింది. దీంతో, దట్టమైన మంటలు ఎగిసిపడ్డాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక వాహనాలు ఘటనాస్థలికి చేరుకుని మంటను ఆర్పివేశాయి. పేలుడుకు గల కారణాలు తెలియరాలేదు.

వెలగని 'జగజ్జీవన్ జ్యోతి'

- రెండు నెలలైనా వెలువడని మార్గదర్శకాలు
- 75 యూనిట్లలోపున్నా వస్తున్న విద్యుత్ బిల్లులు



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ గృహాలకు 75 యూనిట్లలోపు విద్యుత్ బిల్లులు వచ్చే వారికి ఉచిత విద్యుత్‌ను అందిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేసిన ప్రకటన అమలుకు నోచుకోలేదు. ఇప్పటి వరకు 50 యూనిట్లలోపు విద్యుత్ ఛార్జీలు వచ్చే ఎస్సీ, ఎస్టీ గృహాలకు సంబంధించి ఉచితంగా విద్యుత్‌ను అందిస్తూ వస్తున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 5న బాబు జగజ్జీవన్‌రామ్ 110వ జయంతిని పురస్కరించుకుని ముఖ్యమంత్రి ఈ స్లాబ్‌ను 50 యూనిట్ల నుంచి 75 యూనిట్లకు పెంచారు. 75 యూనిట్లలోపు విద్యుత్ ఛార్జీలు వచ్చే వారందరికీ ఉచిత విద్యుత్‌ను అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు ఏప్రిల్ 28న ప్రభుత్వం జీవో నంబరు 32ను జారీ చేసింది. ఆ ఉత్తర్వుల ప్రకారం జూన్ ఒకటో తేదీ నుంచి 75 యూనిట్లలోపు విద్యుత్ ఛార్జీలు వచ్చే ఎస్సీ, ఎస్టీ గృహాలకు ఉచిత విద్యుత్ సరఫరా చేయాలి. ఆ తేదీ దాటి రెండు మాసాలు పూర్తయింది. ఇంత వరకు జగజ్జీవన్ జ్యోతి పథకానికి సంబంధించి మార్గదర్శకాలు వెలువడలేదు. దీంతో ఈ పథకం అమలుకు నోచుకోకుండా ప్రకటనకే పరిమితమైంది.

58 యూనిట్లకు బిల్లు వచ్చింది

బుక్కరాయసముద్రం మండల కేంద్రంలో ఉంటున్న ఒ.ఓబులేసుకు సంబంధించి సర్వీసు నంబరు 7123202000556 గల ఎస్సీ గృహానికి గత నెలలో 58 యూనిట్ల విద్యుత్‌ను వినియోగించారు. దీనికి రూ.93.30 బిల్లును ఆగస్టులో అందజేశారు. ప్రభుత్వం చెప్పిన ప్రకారమైతే గత నెల నుంచే ఉచిత విద్యుత్ రావాల్సి ఉంది. అలాకాకుండా బిల్లు రావడంపై అధికారులను సదరు వ్యక్తి అడిగితే తమకు మార్గదర్శకాలు ప్రభుత్వం నుంచి రానందున బిల్లులు వసూలు చేస్తున్నామని చెప్పారు. అధికారుల మాటతో చేసేది లేక బిల్లును చెల్లించారు. ఈ పథకం కింద రాష్ట్రంలో 14.24 లక్షల మందికి లబ్ధిచేకూరుతుందని ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది. వీరందరికీ ఎప్పటి నుంచి పథకాన్ని వర్తింపజేసారన్న దానిపై నేటికీ స్పష్టత కరువైంది.

ప్రభుత్వ ఉత్తర్వులను అమలు చేయాలి

జగజ్జీవన్ జ్యోతికి సంబంధించి ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేయాలి. ఏప్రిల్ నెలలో ఉత్తర్వులిచ్చి ఇంత వరకు మార్గదర్శకాలు జారీ చేయకపోవడం సరికాదు. ముఖ్యమంత్రి గొప్పగా ప్రకటించిన పథకం ఆచరణకు నోచుకోలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మార్గదర్శకాలు జారీ చేసి అమలు జరిగే విధంగా చూడాలి.

- ఒడ్డుపల్లి నల్లప్ప, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి, అనంతపురం.

రాష్ట్రాల హక్కులపై దాడి

(మొదటి పేజీ తరువాయి)

సామరస్య పూర్వకంగా పరిష్కరిస్తామనడాన్ని స్వాగతిస్తున్నాం. కాని అఖిలపక్ష బృందానికి కశ్మీర్ పర్యటన సందర్భంగా ఇచ్చిన హామీలలను ఎందుకు అమలు చేయడం లేదు? ప్రధాని ప్రసంగంపై మాకున్న అభ్యంతరాలను పార్లమెంటులో ప్రశ్నిస్తాం. ఇదే విధంగా త్రిపుర ముఖ్యమంత్రి ప్రసంగంపై ఏమైనా అభ్యంతరాలు వ్యక్తం చేస్తే అసెంబ్లీలో సమాధానం ఇస్తారు. త్రిపుర ముఖ్యమంత్రి ఏం మాట్లాడాలో మీరెలా నిర్ణయిస్తారు? ఆరెస్సెస్ విధానాలు మాత్రమే ప్రసారమయ్యేలా ప్రభుత్వ వ్యవస్థలను, మీడియాను బిజెపి ప్రభుత్వం నియంత్రిస్తోంది. బిజెపియేతర రాష్ట్రాల ముఖ్యమంత్రులతో చర్చించి ఈ విషయంపై ముందుకెళ్తాం. రాజకీయాల వల్లే మోడీ ప్రధాని, మాణిక్ సర్కార్ ముఖ్యమంత్రి అయ్యారు. ముఖ్యమంత్రి ప్రసంగంలో రాజకీయాలు ఉంటే తప్పేంటి? ప్రధాని ప్రసంగంలో రాజకీయ అంశాలు ఉండొచ్చు, త్రిపుర ముఖ్యమంత్రి ప్రసంగంలో రాజకీయ అంశాలు ఉండకూడదా? ఇదెక్కడి న్యాయం. మోడీని ఎన్నుకున్నట్లే త్రిపురలో మాణిక్ సర్కార్‌ను ప్రజలు ఎన్నుకున్నారు. అది మరిచిపోకూడదు. కేంద్ర ప్రభుత్వ చర్యలు కేంద్రం, రాష్ట్రాల మధ్య సంబంధాలను దెబ్బతీస్తున్నాయి." అని సీతారాం ఏచూరి పేర్కొన్నారు. "రాజకీయ నాయకులు స్కూల్, ప్రభుత్వ కార్యాలయాల్లో స్వాతంత్ర వేడుకలు చేయకూడదు. తమ పార్టీ కార్యాలయాల్లో చేసుకోవాలి. మేము అలానే మా పార్టీ ఆఫీస్‌లో చేసుకున్నాం. మోహన్ భగవత్ కూడా నాగపూర్ ఆరెస్సెస్ ఆఫీస్‌లో చేసుకుంటే మంచిది. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో ప్రజా ప్రతినిధులు పతాకావిష్కరణలు చేస్తారు. ఎందుకంటే వారు ప్రజలకు జవాబుదారీగా ఉండాలి" అని వ్యాఖ్యానించారు.

దేశ చరిత్రలో ఇలా జరగలేదు: బృందా కరత్

ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రసంగాన్ని ప్రసారం కాకుండా అడ్డుకోవడం దేశ చరిత్రలోనే ఎన్నడూ జరగలేదని సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యురాలు బృందా కరత్ పేర్కొన్నారు. ఇది దారుణమైన, అన్యాయమైన చర్యగా ఆమె వర్ణించారు. రాష్ట్రాలతో సహకారాత్మక సమాఖ్య విధానం అవలంభిస్తామని చెబుతున్న ప్రధాని నరేంద్ర మోడీ ప్రకటనలపై సందేహాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. "నరేంద్ర మోడీ సహకారాత్మక సమాఖ్య విధానం గురించి మాట్లాడుతున్నారు. ఇదే సమయంలో బిజెపి నేతత్వంలోని ప్రభుత్వం..దూరదర్శన్‌లో త్రిపుర ముఖ్యమంత్రి ప్రసంగాన్ని ప్రసారం చేయడానికి నిరాకరించింది. సహకారాత్మక సమాఖ్య విధానం అంటే ఇదేనా? ప్రజలతో ఎన్నుకోబడిన ముఖ్యమంత్రి ప్రసంగ పాఠంలో మార్పులు చేసే అధికారం దూరదర్శన్‌కు ఎవరిచ్చారు? ఇది దారుణం, పూర్తిగా అన్యాయం. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా తమ రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి ప్రసంగించే హక్కు ముఖ్యమంత్రికి ఉందని పేర్కొంది. మోడీ సర్కారు ఎమర్జెన్సీ రోజులను గుర్తుకు తెస్తోంది. దూరదర్శన్, ప్రసార భారతి స్వయం ప్రతిపత్తిని దెబ్బతీస్తోంది" అని బృందా విమర్శించారు.

వినాయక చవితికి



ఎన్టీఆర్

ఎన్టీఆర్ ప్రస్తుతం 'జై లవ కుశ' చిత్రం పనుల్లో బిజీగా ఉన్నాడు. ఈ సినిమాను భారీ బడ్జెట్‌లో అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్నారు కళ్యాణ్ రామ్. ఎన్టీఆర్ ఆర్ట్స్ బ్యానర్‌లో రూపొందుతోంది. ఇందులో ఎన్టీఆర్ త్రిపాత్రాభియనం చేస్తున్నాడు. అందులో అంధుడిగానూ కనిపించబోతుండడంతో క్రేజ్ ఏర్పడింది. నాయకుడు, ప్రతినాయకుడు రెండు పార్శ్వాలు ఎన్టీఆర్‌లోనే చూపించబోతున్నాడు దర్శకుడు బాబీ. ఇప్పటికే 'జై' పోస్టర్, టీజర్ విడుదలైంది. సామాజిక మాధ్యమాల్లో దీనికి విశేష స్పందన వచ్చింది. ఈ సినిమాను దసరా బరిలో భాగంగా సెప్టెంబర్ 21న విడుదల చేయబోతున్నారు. మొన్న 'లవ' పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ వినాయక చవితిని పురస్కరించుకుని లవ పాత్ర ఎలా ఉండబోతుందో తన అభిమానులకు పరిచయం చేయబోతున్నాడు ఎన్టీఆర్. ఈ విషయాన్ని ఎన్టీఆర్ ఆర్ట్స్ బుధవారం ట్విట్టర్‌లో పేర్కొంది. ఇందులో రాశీ ఖనా, నివేదా థామస్ హీరోయిన్లుగా నటిస్తున్నారు.



సురేందర్ రెడ్డి, పరుచూరి గోపాలకృష్ణ, వెంకటేశ్వరరావు, చిరంజీవి, రామ్ చరణ్, సురేఖ, అల్లు అరవింద్ తదితరులు

'ఉయ్యాలవాడ'.. మొదలైంది

చిరంజీవి 151వ చిత్రంగా స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జీవిత కథను వెండితెరపై ఆవిష్కరించనున్నారు. ఉయ్యాలవాడ నరసింహారెడ్డిగా చిరంజీవి కనిపించనున్నాడు. ఈ సినిమా చిత్రీకరణ పనులు లాంఛనంగా బుధవారం ప్రారంభమయ్యాయి. కొణిదెల ప్రొడక్షన్స్ కార్యాలయంలో పూజా కార్యక్రమంతో షూటింగ్ మొదలైంది. సురేందర్ రెడ్డి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నాడు. కొణిదెల ప్రొడక్షన్స్ బ్యానర్‌పై రామ్ చరణ్ నిర్మిస్తున్నాడు. ఈ చిత్రంలో కథానాయికగా నయనతారను తీసుకోవాలని చిత్రబృందం భావిస్తోంది. ఈనెల 22న చిరంజీవి పుట్టిన రోజుని పురస్కరించుకొని ఈ సినిమా టైటిల్, ఫస్ట్‌లుక్‌ను విడుదల చేయాలని నిర్మాతలు భావిస్తున్నారు. ఈ పూజా కార్యక్రమంలో చిరంజీవి, సురేఖ, అల్లు అరవింద్, పరుచూరి బ్రదర్స్, డాక్టర్ కె. వెంకటేశ్వరరావు తదితరులతో పాటు, చిత్ర నిర్మాత రామ్‌చరణ్, దర్శకులు సురేందర్ రెడ్డి పాల్గొన్నారు

ఎవరినీ టార్గెట్ చేయలేదు

- సురేష్ బాబు



'నేనే రాజు నేనే మంత్రి'లో పాత్రలు చాలా ఓపెన్‌గా మాట్లాడుతుంటాయని, ఆ పాత్రల్లో ఇవాల్టి రాజకీయ నేతలందరినీ చూస్తామే తప్పా ఏ ఒక్కరినో ప్రత్యేకంగా టార్గెట్ చేయలేదని సురేష్ బాబు అన్నారు. పలానా ప్రభుత్వానికి వ్యతిరేకంగా అంటూ ఈ సినిమా లేదని చెప్పారు.

'నేనే రాజు నేనే మంత్రి' పొలిటికల్ డ్రామానే అయినా సినిమాలో సమకాలీన రాజకీయాలపై చాలానే సెటైర్లు వేశారు. ఈ నేపథ్యంలో ఓ మీడియా సంస్థతో మాట్లాడిన సురేష్ బాబు.. ప్రస్తుత రాజకీయాలపై తన అభిప్రాయాల్ని కుండబద్దలు కొట్టినట్లు చెప్పారు.

ఒక పార్టీ నుంచి పోటీ చేసి గెలిచి, వేరే చోట ఏదో ఆశ చూపిస్తే.. గెలిపించిన పార్టీ కండువా పక్కన పెట్టేసి వెళ్లిపోతున్నారని, ఇది సరి కాదని చెప్పారు. జనానికి ఏ పార్టీ గుర్తు చూపించి ఓట్లు వేయించుకున్నారో, ఆ పార్టీకే పని చేయాలని, అధికారం వైపు వెళ్లిపోవడం అంటే నమ్మి ఓటేసిన వాళ్లను అగౌరవ పరచడమే అని పేర్కొన్నారు. ఇలా చేస్తే ఎన్నికల ద్వారా వచ్చిన అధికారాన్ని దుర్వినియోగం చేయడమే అని అన్నారు సురేష్ బాబు.

తన తండ్రి రామానాయుడు రాజకీయాల్లో చేరినప్పుడు రాజకీయ వ్యవస్థ ఇలా ఉంటుందన్నది తనకు తెలియదని, డబ్బులిచ్చి ఓట్లు కొంటారన్న విషయం తెలిసి షాకయ్యానని చెప్పారు. తన తండ్రి ఎంపీ అయ్యాక తాను ఒక్కసారీ ఢిల్లీకి వెళ్లలేదని అక్కడికి వెళ్తే అధికారాన్ని దుర్వినియోగానికి పాల్పడతానేమో అని ఆగిపోయానని పేర్కొన్నారు. నాన్నను ఎన్నుకున్న ప్రజలకు సాయం చేయాలనే ఆలోచించా తప్పా ఇంజనీరింగ్ కాలేజీలు వస్తున్నాయి.. మనం కూడా ఒకటి పెట్టేద్దాం లాంటి ఆలోచనలేమీ చేయలేదని సురేష్ బాబు చెప్పారు. ప్రస్తుత రాజకీయాలు ఏ మాత్రం సంతృప్తికరంగా లేవని, అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు చేయాల్సింది చాలా ఉందని అన్నారు.

తనకు ఎన్టీఆర్ ఆ తర్వాత వైఎస్ రాజశేఖర్ రెడ్డే నచ్చిన ముఖ్యమంత్రులని సురేష్ తెలిపారు. వీళ్లిద్దరూ నిజమైన నాయకులని, కష్టపడి పని చేస్తారని వేగంగా నిర్ణయాలు తీసుకోవటంలో వీరిని మించిన వారు లేరన్నారు.

సవ్యసాచి



నాగచైతన్య



సవ్యసాచి ఫస్ట్‌లుక్

అక్కినేని నాగ చైతన్య కథానాయకుడిగా చందు మొండేటి దర్శకత్వంలో రూపొందుతోన్న సినిమాకు 'సవ్యసాచి' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది. భారీ బడ్జెట్‌తో తెరకెక్కనున్న ఈ యాక్షన్ ఎంటర్ టైనర్ ప్రీలుక్ పోస్టర్, టైటిల్‌ను బుధవారం విడుదల చేశారు. అనంతరం నిర్మాతలు మాట్లాడుతూ 'చందు మొండేటి రాసిన కథకు హీరో క్యారెక్టరైజేషన్‌కు 'సవ్య సాచి' సరైన టైటిల్‌గా భావించాం. 'ప్రేమమ్' అనంతరం నాగ చైతన్య, చందు మొండేటి కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో భారీ అంచనాలున్నాయి. హై ఓల్టేజ్ యాక్షన్ ఎంటర్ టైనర్‌గా తెరకెక్కనుంది. ప్రేక్షకుల్ని ఆశ్చర్యపరిచే స్థాయిలో సినిమా ఉంటుంది. సెప్టెంబర్‌లో రెగ్యులర్ షూటింగ్ మొదలు కానుంది' అని తెలిపారు.

సాయి ధరమ్ తేజ్ కొత్త చిత్రం



సాయి ధరమ్ తేజ్, కరుణాకరన్, కె.ఎస్. రామారావు తదితరులు


సాయి ధరమ్ తేజ్ హీరోగా కొత్త సినిమా మొదలైంది. ఈ చిత్రానికి ఎ.కరుణాకరన్ దర్శకత్వం వహిస్తున్నాడు. క్రియేటివ్ కమర్షియల్స్ పతాకంపై కె.ఎస్.రామారావు నిర్మిస్తున్నారు. హైదరాబాద్‌లోని ఫిలింనగర్ కల్చరల్ సెంటర్‌లో బుధవారం చిత్రం పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

అనంతరం కె.ఎస్.రామారావు మాట్లాడుతూ 'మా క్రియేటివ్ కమర్షియల్స్ బేనర్‌లో ఇది 45వ సినిమా. విజయ దశమి రోజున షూటింగ్ ప్రారంభోత్సవం జరుగుతుంది. దర్శకుడు మ్యూజిక్ సిట్టింగ్స్‌లో ఉన్నారు. 'డార్లింగ్' స్వామి మాటలు రాస్తున్నారు. సాయిధరమ్ తేజ్‌తో సినిమా చెయ్యడం అంటే మా కుటుంబంలో ఒక యంగ్‌స్టర్‌తో చేస్తున్న ఫీలింగ్ నాకుంది. గతంలో ఈ దర్శకుడు తీసిన సినిమాలన్నీ మంచి ప్రేమతో నిండి ఉంటాయి. అటువంటి మా కరుణాకరన్‌తో మళ్ళీ ఓ మంచి లవ్‌స్టోరీ, మ్యూజికల్ హిట్‌తో మీ ముందుకు వస్తున్నందుకు ఎంతో ధైర్యంగానూ, నమ్మకంగానూ ఉంది.

దర్శకుడు ఎ.కరుణాకరన్ మాట్లాడుతూ 'ఇది పూర్తిగా లవ్‌స్టోరీ. కలర్‌ఫుల్ రొమాంటిక్ ఫ్యామిలీ ఎంటర్‌టైన్‌మెంట్‌తో జాలీగా ఉండే సినిమా ఇది" అని తెలిపారు.

సాయి ధరమ్ తేజ్ మాట్లాడుతూ 'ఏడాది నుంచి రామారావు, నేను సినిమా చేద్దామనుకుంటున్నాం. కానీ, కథ సెట్ అవ్వలేదు. ఎవరి దగ్గరకి ఏ కథ వెళ్ళాలనేది ముందే రాసి పెట్టి ఉంటుందని చాలా మంది చెప్పారు. అలా కరుణాకరన్ కథ నాకు రాసి పెట్టి ఉందని నేను అనుకోలేదు. కానీ, అలా కుదిరింది. కరుణాకరన్ నాకు చిన్నప్పటి నుంచి తెలుసు' అని చెప్పారు. ఈ చిత్రంలో సాయి ధరమ్ తేజ్, అనుపమ పరమేశ్వరన్ జంటగా నటించనున్నారు. ఈ చిత్రానికి సంగీతం : గోపీ సుందర్ సి.ఎస్., సినిమాటోగ్రఫీ : ఐ.ఆండ్రూ.

షారుఖ్‌ది సల్మాన్ బాట





తెలుగు చిత్రసీమలో పవన్ కళ్యాణ్‌కు ఓ విషయంలో మంచి పేరు ఉంది. తన సినిమా తీసుకున్న పంపిణీదారులు నష్టపోతే వారికి ఆ నష్ట పరిహారాన్ని ఇచ్చి ఆదుకుంటాడని. బాలీవుడ్ కూడా ఇటువంటి ట్రెండ్ ఉంది. మొన్నామధ్య సల్మాన్ ఖాన్ ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుని చేసిన 'ట్యూబ్‌లైట్' చిత్రం బాక్సాఫీస్ వద్ద తీవ్ర నిరాశ పరిచింది. అది మామూలుగా కాదు. ఇప్పటి వరకూ సల్మాన్ చేసిన సినిమాలేవీ ఇంతగా ఫ్లాప్ కాలేదు. దాంతో నష్టపోయిన పంపిణీదారులకు పరిహారం అందించాడు. 'ట్యూబ్‌లైట్' చిత్రం రంజాన్‌ను పురస్కరించుకుని విడుదలైంది. తర్వాత రణబీర్ కపూర్, కత్రినా కైఫ్ జంటగా చేసిన చిత్రం 'జగ్గా జాసూస్'. ఇదీ అంతే. ఈ సినిమా తీసుకున్న డిస్ట్రిబ్యూటర్లు నష్టపోతే పరిహారం ఇచ్చేస్తానని ముందే రణబీర్ ప్రకటించాడు. ఇప్పుడు సల్మాన్ బాటలో షారుఖ్ కూడా నడుస్తున్నాడు. ఆయన, అనుష్క శర్మ హీరో హీరోయిన్లుగా చేసిన చిత్రం 'జబ్ హ్యారీ మెట్ సెజల్'. భారీ అంచనాలతో విడుదలైంది. ఏవేవో లెక్కలు వేసేశారు సినీ విశ్లేషకులు. కానీ బాక్సాఫీస్ వద్ద బోల్తా కొట్టింది. అనుకున్న స్థాయిలో కలెక్షన్లు రాలేదు. దీంతో పంపిణీ దారులు షారుఖ్ వద్దకు క్యూ కడుతున్నారు. తమను ఆదుకోవాలని అభ్యర్థిస్తున్నారు. దీనికి షారుఖ్ సుముఖంగానే ఉన్నాడని తెలుస్తుంది. 2015లో ఈ హీరో చిత్రం 'దిల్వాలే' కూడా నష్టపోయిన వారిని ఆదుకున్నాడు. సుమారుగా 25 కోట్లు పంపిణీదారులకు తిరిగి ఇచ్చేశాడు.

'నీడపోయింది' అంటే షార్ట్ ఫిల్మా అన్నారు



ఆనంద్ రవి, కోమలి

ఆచార్య క్రియేషన్స్, ఆనంద్ రవి కాన్సెప్ట్ బ్యానర్స్‌పై రూపొందుతున్న చిత్రం 'నెపోలియన్'. ఆనంద్ రవి దర్శకుడు. బోగేంద్ర గుప్త మడుపల్లి నిర్మాత. ఈ సినిమా ట్రైలర్‌ను ప్రసాద్ ల్యాబ్స్‌లో ఆవిష్కరించారు. కె.ఎల్.దామోదర్ ప్రసాద్, హీరో సందీప్‌కిషన్ ట్రైలర్‌ను విడుదల చేశారు.

కె.ఎల్.దామోదర్ ప్రసాద్ మాట్లాడుతూ 'ఆనంద్ రవి చేసిన 'పేరెంట్స్' మూవీ చూసిన రోజే తప్పకుండా మంచి దర్శకుడు అవుతాడని భావించాను. 'ప్రతినిధి' సినిమా కూడా చాలా మంచి కథతో రన్ అవుతుంది. తను ఈ సినిమాలో నటిస్తున్నాడని తెలియగానే తను ఎందుకు నటన పట్ల ఆసక్తి చూపుతున్నాడని అనుకున్నాను. అయితే ట్రైలర్, పోస్టర్స్ చూడగానే తనైతేనే కరెక్ట్‌గా సరిపోతాడనిపించింది. ఇక సినిమా గురించి చెప్పాలంటే టెక్నికల్‌గా మంచి సినిమా' అని అన్నారు.

సందీప్‌కిషన్ మాట్లాడుతూ 'ప్రతినిధి' సినిమా నేనే చేయాల్సింది కానీ కుదరలేదు. తర్వాత మూవీ అయినా చేయాలనుకుంటున్నాను. రవన్న సినిమా కథలన్నీ బావుంటాయి. ఈ నెపోలియన్ సినిమా వాటన్నింటి కంటే మరో ఎత్తులో ఉంటుందని భావిస్తున్నాన'ని అన్నారు. లక్ష్మీ భూపాల్ మాట్లాడుతూ 'రెగ్యులర్ సినిమాలు చూసే ప్రేక్షకులకు కొత్తదనం ఇచ్చే సినిమా. నీడ కనపడకపోవడం అనేదే కొత్త కాన్సెప్ట్. అంతే కాకుండా దర్శకుడు ఆనంద్ రవి 'ప్రతినిధి'లో సామాజిక అంశాన్ని ఎలా టచ్ చేశాడో ఈ సినిమాలో కూడా అలాంటిది ఉంటుంది. నిర్మాత అనుకున్న ప్లానింగ్‌లో అనుకున్న బడ్జెట్‌లో సినిమాను పూర్తి చేశాడు" అని తెలిపారు.

ఆనంద్ రవి మాట్లాడుతూ 'నేను ఈ కథతో చాలా మందిని కలిశాను. 'నీడపోయింది' అనే పాయింట్ చెప్పగానే ఇది షార్ట్ ఫిలిమా! అని అడిగారు. తర్వాత నేనే హీరో అనగానే నువ్వే హీరోనా! అని చాలా మంది అన్నారు. నిర్మాత ఎవరని అడిగారు. ఇలా అందరి ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చుకుంటూ ఈ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నాం. థ్రిల్లర్ జోనర్ మూవీయే అయినా, కొత్త కాన్సెప్ట్‌తో సాగుతుంది. ఇంత వరకు ప్రేక్షకులు నా సినిమాల నుండి ఏం కోరుకుంటున్నారనే అనుభవాన్నంతా కూడా ఈ సినిమాలో రాసుకున్నాను. అందరికీ కనెక్ట్ అయ్యే సినిమా" అన్నారు.

సెప్టెంబర్‌లో 'మేడ మీద అబ్బాయి'



నిఖిల విమల్, అల్లరి నరేష్

అల్లరి నరేష్ నటిస్తున్న తాజా చిత్రం 'మేడ మీద అబ్బాయి'. జాహ్నవి ఫిల్మ్స్ పతాకంపై శ్రీమతి నీలిమ సమర్పణలో బొప్పన చంద్రశేఖర్ నిర్మిస్తున్నారు. నిఖిల విమల్ కథానాయిక. జి.ప్రజిత్ దర్శకత్వం వహిస్తున్నారు. చిత్రీకరణను పూర్తి చేసుకున్న ఈ చిత్రం నిర్మాణానంతర పనులు తుదిదశకు చేరుకున్నాయి. పాటలను త్వరలో విడుదల చేసి సెప్టెంబరు మొదటి వారంలో చిత్రాన్ని విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

నిర్మాత మాట్లాడుతూ 'కొత్తదనంతో కూడిన కథతో చేస్తున్న విభిన్న చిత్రమిది. నరేష్ కెరీర్‌లో మరో మైలురాయిలా నిలిచిపోతుందనే నమ్మకముంది. 'గమ్యం', 'శంభో శివ శంభో' తర్వాత ఆ తరహా సున్నితమైన కథతో నరేష్ చేస్తున్న చిత్రమిది. రొమాంటిక్ కామెడీ థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ చిత్రంలో స్క్రీన్‌ప్లే హైలైట్.





మరణం లేని జీవి వుందా?



మార్కెట్‌లోకి వచ్చిన నోకియా 8

హెచ్ఎండి గ్లోబల్ సంస్థ నోకియా 8 పేరుతో మరో ఆండ్రాయిడ్ స్మార్ట్‌ఫోన్‌ను బుధవారం విడుదల చేసింది. లండన్‌లో నిర్వహించిన ఓ ప్రత్యేక కార్యక్రమంలో ఈ ఫోన్‌ను మార్కెట్‌లోకి విడుదల చేశారు. డ్యుయల్ లెన్స్ కెమెరా ఈ ఫోన్‌లో అందుబాటులో ఉంటుంది. Carl-Zeiss optics తో వస్తోన్న ఈ డ్యుయల్ కెమెరా క్వాలిటీ విషయంలో వినియోగదారులను ఏమాత్రం నిరుత్సాహపరచదు. డ్యుయల్ రియర్ కెమెరా సెటప్‌తో, మార్కెట్‌లోని లీడింగ్ ప్రాసెసర్‌లలో ఒకటైన స్నాప్‌డ్రాగన్ 835 ప్రాసెసర్ ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. బ్లూ, గోల్డ్ బ్లూ, గోల్డ్ కాపర్, స్టీల్ కలర్ ఆప్షన్స్‌లో ఇది లభ్యం కానుంది. రెండు వేరియంట్లలో (6జీబీ, 128 స్టోరేజ్, 4 జీబీ 64 స్టోరేజ్) ఇది లాంచ్ అయింది. అంతేకాదు వచ్చే ఏడాది 8 జీబీ వేరియంట్‌ను కూడా లాంచ్ చేయనున్నట్లు సమాచారం. మరోవైపు దీని ధర రూ.44 వేలు రూ. 55వేల మధ్య ఉంటుందని అంచనా వేస్తున్నారు.

నోకియా 8 స్మార్ట్‌ఫోన్‌లోని మిగతా స్పెసిఫికేషన్ల విషయానికొస్తే... 5.3 అంగుళాల క్యూహైడెఫినిషన్ డిస్‌ప్లే, 1440 x 2560 రిజల్యూషన్, ఆండ్రాయిడ్ 7.1.1 నౌగట్ ఆపరేటింగ్ సిస్టం, 4జీబి ర్యామ్, 64జీబి ఇంటర్నల్ స్టోరేజ్, మైక్రోఎస్డీ సపోర్ట్, డ్యుయల్ సిమ్ కనెక్టివిటీ, 13 ఎంపీ డబుల్ రియర్ కెమెరా, 12 మెగా పిక్సెల్ ఫ్రంట్ కెమెరా, 3500 ఎంఏహెచ్ బ్యాటరీతో లభ్యమవుతోంది.

21న గూగుల్ కొత్త ఓఎస్ ?



ప్రముఖ సాఫ్ట్‌వేర్ దిగ్గజం గూగుల్ 'ఆండ్రాయిడ్ ఓ' పేరుతో సరికొత్త ఆపరేటింగ్ సిస్టమ్‌ను విడుదల చేయనుంది. ఆగస్టు 21న ఈ 'ఆండ్రాయిడ్ ఓ'ను విడుదల చేయనున్నట్లు సమాచారం. లేటెస్ట్ టెక్నాలజీల ఆవిష్కరణకు సంబంధించిన ముందస్తుగానే సమాచారాన్ని లీక్‌చేసే ఇవాన్ బ్లాస్ అనే వ్యక్తి ట్వీట్ చేశారు. ఈ ఓఎస్ ఆగస్టు 21 అధికారికంగా విడుదలైతే... మొదటగా పిక్సెల్, నెక్సల్ డివైజ్‌లో దీని అప్‌డేట్ ఉంటుందని టెక్ వర్గాల సమాచారం. అంతేకాదు దీని పేరును కూడా అదే రోజు ప్రకటిస్తారని తెలుస్తోంది. ఆండ్రాయిడ్ 7.0 నౌగట్‌ను కూడా గూగుల్ గతేడాది ఆగస్టు 22నే ఆవిష్కరించింది. అదే వరవడిని అనుసరిస్తూ ఒక్క రోజు ముందుగా 'ఆండ్రాయిడ్ ఓ' విడుదలకు కు ముహూర్తం నిర్ణయించినట్లు సమాచారం. అయితే దీనిపేరు 'ఓరియోగా' నిర్ణయించినట్టు వార్తలు వస్తున్నాయి.

మీ చిట్కాలు :

కంప్యూటర్, మొబైల్, యాప్, ఇంటర్నెట్ టెక్నాలజీ వినియోగంలో మీకు మాత్రమే తెలిసిన చిట్కాలను మాకు పంపండి.'సైటెక్' పేజీలో ప్రచురిద్దాం... మన విజ్ఞానాన్ని అందరితో పంచుకుందాం.

పంపించాల్సిన చిరునామా :
సైటెక్ పేజీ, ప్రజాశక్తి
డోర్ నెం: 27-30-4
ఆకులవారి వీధి, గవర్నర్ పేట
విజయవాడ, కృష్ణాజిల్లా, ఎపి
ఇమెయిల్ : scitechpage@gmail.com


ప్రశ్న : విశ్వంలో అనేక జీవులు ఉన్నాయి. వాటిలో మరణంలేని జీవి ఉందా? ఉంటే అది చిరంజీవిగా ఉండడానికి కారణమేమిటి?
- వి.లావణ్య, సెయింట్‌యాన్స్ కళాశాల, గుంటూరు

జవాబు : విశ్వంలో చాలా చోట్ల జీవులుండటానికి ఆస్కారం ఉన్నా, సైద్ధాంతిక అవకాశం వున్నా మనకు లభించిన వైజ్ఞానిక ఆధారాల ప్రకారం భూమి మీద తప్ప మరెక్కడా జీవం ఉన్న ఆనవాళ్లు కనిపించడంలేదు. అంగారక గ్రహం (మన సౌర మండలంలోనే మన పొరుగున ఉన్న గ్రహమే) మీద గతంలో ఎపుడో జీవం వున్నట్లు అరకొర ఆధారాలు అగుపించినా అవి బలమైన ఆధారాలు కావు.

జీవి అంటే కొన్ని లక్షణాలున్నాయి. మన భూమ్మీదే వృక్ష జాతులు, జంతుజాతులు అటుయిటూ గాని జాతులు లక్షలాదిగా వున్నా జీవులన్నింటికీ సార్వత్రికంగా (Universal or Common) కొన్ని లక్షణాలున్నాయి. రాయిని చూపి పుస్తకమని అనలేము. ఇటుకను చూపి మొబైల్ ఫోన్ అనము. నదిని చూపి పర్వతం అనము. అలాగే వేటిని జీవులు అనకూడదో, వేటిని జీవులు అనాలో నిర్ద్వంద్వంగా చెప్పగలము. మిల్లీమీటరులో సుమారు వెయ్యోవంతు ఉన్న తిత్తిలాంటి కోశం (sac) లో DNA లేదా RNA అనే పొడవాటి బృహదణు (macro molecular) సముదాయం వుండడం జీవికి వున్న ప్రాథమిక లక్షణం. దీనికి ఏ జీవీ (చెట్టూ చేమా, చీమా దోమా, పురుగుపుట్రా, కప్పలు పాములూ, ఆవూ పందీ, తులసీ తుమ్మా, ఉమ్మెత్త ఉలవ, నత్త నల్లి, అమీబా అనకొండ, తేయాకు తిమింగలం, నువ్వు నేను) ఉపేక్షణీయం (exception) కాదు. ఇలాంటి తిత్తినే కణం(cell) లేదా జీవకణం (biological cell) అంటాము. తిత్తిలో RNA మాత్రమే వున్న అత్యంత ప్రాథమిక కణం వైరస్. ఇవి జీవికి, నిర్జీవికీ మధ్యస్తంగా వుంటాయి. కానీ నిజమైన జీవకణంలో ప్రవేశించాక వీటికి జీవ లక్షణాలు అబ్బుతాయి. అది వేరే విషయం.

జీవికి ఉన్న మరో లక్షణం ప్రత్యుత్పత్తి (reproduction). ఒక రాయి తన చుట్టూ తనలో ఎలాంటి రసాయనాలున్నాయో అలాంటి రసాయనాల్ని ఎన్నిరోజులు ఉంచినా ఆ రాయి తనలాంటి రాయిని తయారు చేసుకోలేదు. పదార్థాలు, రాయి విడివిడిగా స్వతంత్రంగా అరకొర మార్పులతో ఉంటాయి తప్ప మరో రాయి ఏర్పడదు. కానీ జీవకణం అలాకాదు. తనలో వున్న అంతర్భాగాలలోని లక్షణాలున్న రసాయనిక భౌతిక పరిస్థితుల్ని ఒనగూర్చితే తన లాంటి (Xerox కాపీ లాగా) మరో కణాన్ని నిర్మించుకొంటుంది. ఏకకణ జీవి (monocellular organism) మరో ఏకకణ జీవిని, కుక్కలాంటి బహుకణ జీవి (multicellular organism) కుక్కలాగే వున్న మరో బహుకణ జీవిని నిర్మించుకొంటుంది. వరి మొక్క మరో వరిమొక్కను, తులసి చెట్టు మరో తులసి చెట్టును నిర్మించుకొంటుంది. అంతేగాని ఇటుక మరో ఇటుకను, మొబైల్ ఫోన్ మరో మొబైల్ ఫోన్‌ను, ఒక గడియారం మరో గడియారాన్ని నిర్మించుకోలేవు.

జీవికున్న మరో లక్షణం పరిణామం (evolution). ఏ జీవి అనంతకాలం పాటు తనలాంటి జాతి జీవినే నిర్మించుకోదు. తక్కువ కాల వ్యవధిలో (అంటే సెకన్లు గంటలు కాదు సుమా, కొన్ని వేల లేదా లక్షల సంవత్సరాలు) పెద్దగా తేడాలు కనిపించని పునరుత్పాదక సంతానం వచ్చినట్టున్నా లక్షలాది సంవత్సరాల పర్యంతంలో మొదటి జీవి లక్షణాలకు, తదుపరి జీవి లక్షణాలకు ఎంతోకొంత తేడా వుంటుంది. తద్వారానే ఈ భూమ్మీద వివిధ వృక్ష, జంతు జాతులు రూపొందాయి. దీనినే మహనీయుడు చార్లెస్ డార్విన్ తన 'ప్రకృతివరణం ద్వారా జాతుల ఆవిర్భావం (Origin of Species by Natural Selection)' గ్రంథంలో సోదాహరణంగా విపులీకరించాడు. ఇక నాల్గవ లక్షణం: జీవులు ప్రకృతితో ఘర్షించుకొంటాయి. ఆ ఘర్షణలో రక్షణను, అపాయాన్ని రెంటినీ ఎదుర్కొంటాయి. దీనినే గతితార్కిక భౌతికవాదం (Dialectical Materialism) అనే సర్వ వైజ్ఞానిక సమాకలిత తత్వశాస్త్ర (Integrated Scientific Philosophy) పరిభాషలో సంఘర్షణ (contradiction) అంటాము. ఉదాహరణకు భూమి ఆకర్షణకు విరుద్ధంగా పైకి చెట్టు ఎదగడం ప్రకృతికి విరుద్ధం. కానీ అదే భూమి ఆకర్షణ వల్లే చెట్టు నేలలో కుదురుగా నిలబడింది. ఉష్ణోగ్రత పెరిగితే జీవకణం చనిపోతుంది. కానీ ఉష్ణోగ్రతే లేకుంటే కూడా జీవకణం చనిపోతుంది. గాలి లేకుండా బతకలేము. కానీ మరీ ఎక్కువయితే కొట్టుకుపోయి తునాతునకలవుతాము. ఇంకా ఇలాంటివే ఎన్నో లక్షణాలు జీవులకు వున్నాయి. ఇక జీవులకున్న అత్యంత ముఖ్యమైన లక్షణం శక్తిని పొందే విధానం. దాదాపు 99.99 శాతం వరకు జీవులన్నీ ప్రకృతి అవరోధాన్ని ఎదుర్కొని ఎదుగుతాయి. ఇలా అవరోధాన్ని ఎదుర్కొని పదార్థాన్ని స్థానభ్రంశం (positional displacement) చేయించడాన్నే పని (work) అంటాము. పని చేయడానికి శక్తి (energy) అవసరమనేది ప్రకృతి నియమం (natural law). ఎదగడం, కదలడం, పారిపోవడం, తలపడడం, మాటువేయడం, కాటువేయడం, కనడం, కూడడం, నవ్వడం, కవ్వడం, ఏడ్వడం, ఏర్పడడం వంటివన్నీ పనులే. జీవి మొత్తంగా కదిలినా, భాగాలు భాగాలుగా కదిలినా పని జరిగినట్టే. ఇన్ని విధాల పనులు చేయాలంటే శక్తి అవసరం. అదీ యిదీ అని తేడాలేకుండా పైన చెప్పినట్టు 99.9999 శాతం జీవులన్నీ రసాయనిక శక్తి ఆధారంగానే జీవాన్ని ఈడేరిస్తున్నాయి. ఆ రసాయనిక యింధనం గ్లూకోజు. గ్లూకోజులో వున్న రసాయనిక శక్తి దానిని ఆక్సిజన్‌తో కలిపితే వచ్చే కార్బన్ డైయాక్సైడ్, నీటి అణువుల శక్తి కన్నా ఎక్కువ. కాబట్టి గ్లూకోజును కార్బన్‌డయాక్సైడ్, నీటి అణువులుగా మార్చగా దొరికే అదనపు శక్తిని వాడుకోవడం వల్లే దాదాపు అన్ని జీవులు జీవించగలుగుతున్నాయి. బాబాలు, ఆస్తికులు, నాస్తికులు, అమెరికన్లు, అల్బేలియన్లు, అన్ని



జంతువులు, అన్ని వృక్షాలు, అన్ని మొక్కలు, అన్ని జీవులు ఈ గ్లూకోజులోని శక్తితో తప్ప మరేదో దివ్య శక్తితోనో, అభూత శక్తితోనో, వారికే ప్రత్యేకమైన (reserve) శక్తితోనో జీవించడంలేదు. జీవకణం (లేదా జీవి) బయట గ్లూకోజును కార్బన్‌డయాక్సైడ్, నీటి అణువులుగా మార్చడం ద్వారా శక్తిని రాబట్టుకోవాలంటే గ్లూకోజును మండించాలి లేదా దహనం (combustion) చేయాలి. అందుకోసం గ్లూకోలను ఆక్సిజన్ వున్న గాలి సమక్షంలో సుమారు 300 సెంటిగ్రేడు ఉష్ణోగ్రతకు వేడి యాలి. కానీ ఏ జీవిలోను ఇంత ఉష్ణోగ్రత ఉండదు. అంతటి వేడితో ఏ జీవకణమూ బతకదు. మరి జీవకణములకు గ్లూకోజు నుంచి శక్తి ఎలా లభ్యమవుతుంది? అందుకోసం దశలు ఉన్నాయి. అంచెలంచెల ఆ దశల్ని కూడగట్టి క్రెబ్స్ వలయం (Krebb's Cycle) లేదా సిట్రికామ్ల వలయం (Citric Acid Cycle- CAC) లేదా త్రయ కార్బాక్సిలిక్ ఆమ్ల వలయం (Tricarboxylic Acid Cycle- TAC) అంటాము. తమాషా ఏమిటంటే ఈ క్రెబ్స్ వలయం దాదాపు పైన పేర్కొన్నట్టుగా గ్లూకోజుల నుంచి శక్తిని దండుకొని బతికే 99.99 శాతపు జీవులన్నింటికీ సార్వత్రికం.

ఇలా ఎన్నో సాధారణ జీవ లక్షణాల ఆధారంగానే నేడు ఆధునిక జీవశాస్త్రం డార్విన్ పరిణామవాద సిద్ధాంతానికి తిరుగులేని సాక్ష్యాధారాల్ని ఇస్తోంది. అయినా అమెరికా లాంటి అభివృద్ధి(?) చెందిన దేశాలలో పాఠశాల విద్యలో పరిణామ సిద్ధాంతాన్ని తీసివేశారు. తమ మత గ్రంథాల ఉవాచలకు పరిణామ వాదం గొడ్డలి పెట్టుగా వుండడం వల్ల మతతత్వ రాజకీయాలు, ఆర్థిక వ్యవహారాల బలంతో నడిచే పాలకవర్గాలు పరిణామ వాదానికీ, శాస్త్రీయ దృక్పథానికి తరతరాలుగా అడ్డుకట్ట వేయడానికి ప్రయత్నిస్తున్నాయి. కానీ 'సత్యమే వ జయతే (సత్యమే జయిస్తుంది) అన్న నానుడిలాగే నిజాలు బయటపడుతూనే వున్నాయి. అది వేరే విషయం.

ఇక మీరన్న ప్రశ్నకు సమాధానం పైన పేర్కొన్న వివరణ ద్వారా లభిస్తుంది. జీవికున్న ప్రతి కార్యకలాపంలోను పని యిమిడి వుంది. ప్రతి పనిలోనూ శక్తి మార్పిడి వుంది. జీవి చేసే చాలా పనుల్లో తన ప్రమేయం లేని విధంగా సహజత్వం వుంది. ఉదాహరణకు నాకు యిష్టం వున్నా లేకపోయినా నా గుండె కొట్టుకుంటుంది. బాబాలు లేదా దైవాంశ సంభూతులు అనుకొనేవారు అలా నమ్మబలికే వారు కూడా తమ గుండెల్ని "ఆగిపో హృదయమా, నా స్వంత హృదయమా, ఓ నిముషమే సుమా నీ కదెంత సమయమా", అని నాజూగ్గా అడిగినా గుండె ఆగదు. ఆడితే ఆయన యిక మరణించడం ఆగదు. ఇలాంటి ప్రకృతి సిద్ధ సహజ కార్యకలాపాల్ని వైజ్ఞానిక శాస్త్ర పరిభాషలో ఇర్రివెర్సిబుల్ చర్యలు (Irreversible Processes) అంటారు. ఇలాంటి చర్యల్లో సహజంగానే ఎంట్రోపీ (Entropy) పెరుగుతుంది. ఇది కూడా ఓ సార్వత్రిక ప్రకృతి నియమం. ఎంట్రోపీ అంటే పదార్థాల్లో క్రమ రాహిత్యాని (disorder) కి, చంచలిత (randomness) కు, చలనాల (motions) కు కొలమానం. జీవుల్లో జీవిత పర్యంతం జరిగే సహజ ఇర్రివెర్సిబుల్ చర్యలే జీవిలో క్రమరాహిత్యాన్ని పెంచుతాయి. ఓవైపు సహజ చర్యల ద్వారా తన జీవకణంలో వున్న క్రమానుగత చర్యల సమాకలనం ద్వారా జీవిస్తూనే అవే సహజ చర్యల ద్వారా ఉత్పన్నమయ్యే ఎంట్రోపీ ద్వారా కణాలకి క్రమరాహిత్యాన్ని పెంచుకొంటుంది. ఇది కూడా గతితార్కిక భౌతికవాదపు మొదటి నియమమయిన contradiction of the opposites కి బలాన్ని చేకూర్చుతుంది. ప్రతి జీవి ఈ భౌతిక ప్రపంచంలో అంతర్భాగమే కానీ, ప్రకృతికి ఆవల ఏమీ లేదు. అందుకే జీవిలో వున్న క్రమత్వపు రక్షణ, అక్రమత్వపు ఆపదలలో ఆపదపాలే కాలక్రమేణా ఎక్కువవుతుంది. గతితార్కిక భౌతికవాదంలో కూడా ఘర్షణ చెందే రెండు పరస్పర విరుద్ధ అంశాలలో ఒకదానిది పైచేయి అయ్యే సందర్భం వస్తుంటుంది.

ఇలా జీవానికే ప్రతినిధి అయిన జీవకణంలో ఎంట్రోపీ స్థాయి పెరిగేకొద్దీ జీవకణపు హంగులు, ఆర్భాటాలు, చలాయింపులూ, గెలుపులూ మందగిస్తాయి. ఈ విశాల విశ్వంలో కాలక్రమేనా ఎంట్రోపీ పెరుగుతోందన్న సార్వత్రిక నియమానికి జీవకణం దాసోహమంటుంది. అందుకే కొంతకాలమయ్యేక జీవకణపు చర్యలు కాలక్రమేనా క్రమరాహిత్యానికి లోనవుతాయి. అపుడు ఆ కణం చనిపోయింది అంటాము. అందుకే ప్రాణం పోయాక కూడా పదార్థం అలాగే వుంటుంది. బహుకణ జీవులయిన మనము ఇతర వృక్ష జంతు జాతులు కొన్ని కణాల్ని పునరుత్పత్తి చేసుకోగలవు. కానీ అన్నింటినీ కాదు. ఇక జీవి నిర్మాణాన్ని బట్టి, జీవి జాతిని బట్టి ఎప్పుడోకప్పుడు జీవి మొత్తంలో జీవలక్షణాలు సన్నగిల్లుతాయి. ఇదే సహజ మరణం. దీనికి ఏ జీవీ ఉపేక్షణీయం కాదు. ఆయా జీవుల ఆంతరింగిక నిర్మాణం, జీవన కార్యకలాపాల ఆధారంగా ఆయా జీవులకు ఆయుర్దాయం వుంటుంది. చిరంజీవి ఏదీ, ఎవరు కాదు కాబట్టి ప్రశ్నలో రెండవ భాగానికి అర్థమే లేదు. ఎక్కువకాలం ఆరోగ్యంగా బతకడమెలా అన్నదే మిగిలిన తంతు. అది వేరే సమాధానం.



ప్రొ॥ ఎ. రామచంద్రయ్య
సంపాదకులు,
చెకుముకి, జనవిజ్ఞాన వేదిక.
email: allikayala@gmail.com



పొడుపు కథ


నూరు పళ్లు..
ఒక్కటే పెదవి.

హాస్యం

టీచర్ : ఒరేయ్ రామూ..! మధ్య యుగాన్ని చీకటి యుగం అని పిలుస్తారు ఎందుకు ?
రాము : అప్పుడు కరెంటు లేదు కదా టీచర్.. !
టీచర్ : ఆ..!



తినే విషయంలో బలవంతపెట్టొద్దు.!



అన్నం తినమంటూ చిన్నపిల్లలు మారాం చేయడం మనం నిత్యం చూస్తూనే ఉంటాం. వాళ్లు తినమంటున్నా కూడా వినిపించుకోకుండా అమ్మలు నాలుగు దెబ్బలు వేసి మరీ అన్నం పెడుతుంటారు. దీనిపైన ఇటీవల కొంతమంది శాస్త్రవేత్తలు పరిశోధనలు నిర్వహించారు. అన్నం తినాలని లేదంటున్నా పిల్లల చేత బలవంతంగా తిండి తినిపించడం వల్ల పిల్లలకు మేలు కన్నా నష్టమే ఎక్కువ జరుగుతుందని శాస్త్రవేత్తలు తమ అధ్యయనంలో తేల్చారు. తల్లులు ఇలా చేయడం వల్ల పిల్లల్లో ఉన్న నార్మల్ ఈటింగ్ హాబిట్స్ దెబ్బతింటాయన్నారు. అంతేకాదు పిల్లలు ఊబకాయం బారిన పడే ప్రమాదం సైతం లేకపోలేదన్నారు. పిల్లల్లో నార్మల్ ఈటింగ్ అలవాట్లను పెంచేందుకు పిల్లలు ఎంత తినాలనుకుంటున్నారన్న విషయాన్ని కూడా తెలుసుకోవాలన్నారు. పిల్లలు పోషకాహారం తినాలని అన్ని పదార్థాల్నీ బలవంతంగా వాళ్ల నోళ్లల్లో కుక్కకూడదని చెప్పారు. అలా చేయడం వల్ల తమ శరీరం ఇచ్చే సిగ్నల్స్‌కు అనుగుణంగా ఆహారాన్ని తినే అలవాటును చిన్నారులు పోగొట్టుకుంటున్నారని వారు తెలిపారు. కొంతమంది పిల్లలు ఊబకాయులుగా తయారవడానికి టీవి చూడ్డం, ఆకలి, వ్యాయామాలు ఎంతవరకూ కారణమో కూడా ఈ స్టడీలో పరిశీలించారు. ఫిజికల్ వ్యాయామాలతో సంబంధం లేకుండానే కొందరు పిల్లలు ఊబకాయులుగా తయారవడాన్ని ఈ స్టడీలో పేర్కొనారు. పిల్లలు తినే విధానంలో మార్పు రావడం వల్ల ఊబకాయం సమస్య తలెత్తుతోందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అందుకే తినే విషయంలో పిల్లల్ని బలవంతపెట్టొద్దు! ★



గుర్తించండి!



పిల్లలూ..! పైనున్న చిత్రంలో మొత్తం పది తేడాలు ఉన్నాయి. అవేంటో గుర్తించండి!



శ్రీలంక కెప్టెన్‌గా తరంగ

భారత్‌తో వన్డే సిరీస్‌కు జట్టు ప్రకటన

పల్లెకలె: స్వదేశంలోనే టెస్ట్ సిరీస్ కోల్పోయిన శ్రీలంక వన్డే సిరీస్‌లో పరువు దక్కించుకోవడానికి ప్రయత్నాలను ముమ్మరం చేసింది. ఊహించని రీతిలో 3-0 తేడాతో సిరీస్ వైట్‌వాష్‌కుగురి కావడంతో సిరీస్ సాధించే బాధ్యతలను మోపేందుకు ఉప్పల్ తరంగాను ఆహ్వానించారు. దీంతో కెప్టెన్‌తో పాటు, ఐదు వన్డేలు, ఓ టి 20 మ్యాచ్‌లో తలపడేందుకు జట్టును బుధవారం ప్రకటించారు.వన్డే సిరీస్‌కు కెప్టెన్ ఉప్పల్ తరంగాను నియమించారు. జింబాబ్వే సిరీస్‌లో 16 మందితో కూడిన జట్టును ఎంపిక చేయగా ఈ సారి 15 మందినే ఎంపిక చేశారు. బోటన వేలు గాయంతో బాధపడుతున్న అసేలా గుణరత్నే, అసిత ఫెర్నాండో,అమిలా అపోనోస్, లాహిరు మాధుశంక, నువాన్ ప్రదీప్‌లపై వేటు పడింది. మిలింద సిరివర్ధనే తిసేర ఫెరీరాలు తుది జట్టులోకి రాగా, టెస్ట్‌లో రాణించిన చైనమన్ బౌలర్ సందకన్, విశ్వా ఫెర్నాండోలను వన్డే సిరిస్ జట్టులో చోటు దక్కించుకున్నారు.

శ్రీలంక జట్టు ఇదే...

ఉప్పల్ తరంగా (కెప్టెన్), అంగోలా మ్యాథ్యూస్, నిరోషన్ డిక్వెల్లా, ధనుష్కా గుణ తిలకే, కుశాల్ మెండిస్, చమీరా కపుదెగర, మిలింద సిరివర్ధనా, మిలింద పుష్పకుమార, అకిలా ధనంజయ, లక్షణ్ సందకన్,త్రిసేర ఫెరీరా, వానిందు హసరంగ, లసింత్ మలింగ, ధుష్మంత చామీరా, విశ్వా ఫెర్నాండో.


కొత్త జంటకు షాక్

సిన్సినాటిలో పేస్, జ్వెరెవా ఓటమి



ఒహియా(అమెరికా): సిన్సినాటి డబుల్స్‌లో కొత్త జంటగా బరిలో దిగిన భారత్- జర్మనీ ద్వయం లియాండర్ పేస్, అలెగ్జాండర్ జ్వెరెవా తొలి రౌండ్‌లోనే పరాజయం పాలయ్యారు. స్పెయిన్ ద్వయం ఫెలిసియానో లోపెజ్, మార్క్ లోపెజ్ జంటతో పోరాడి 6-2, 6-7, 6-10తో పేస్ జోడి ఓటమి చెందింది. గంటా 21 నిమిషాల పాటుసాగిన పోరులో తొలి సెట్‌ను సునాయాసంగా గెల్చుకున్నప్పటి, రెండో రౌండ్‌లో టై బ్రేకర్, ఆ తర్వాత సూపర్ టై బ్రేకర్ ఈ జంట ప్రత్యర్థులను నిలువరించలేకపోయింది. భారత్- క్రోయేషియా జంట రోహన్ బోపన్న, ఇవాన్ డూడింగ్‌కు తొలి రౌంబ్ బౌ లభించడం విశేషం.

స్టీలర్స్, తలైవాస్ మ్యాచ్‌'టై'



25-25తో స్కోర్లు సమం

అహ్మదాబాద్: ప్రొ కబడ్డీ(పికెఎల్) ఐదో సీజన్‌లో నరాలు తెగే ఉత్కంఠ భరిత మ్యాచ్‌కు హర్యానా, తమిళ జట్ల మ్యాచ్ వేదికైంది. అనుహ్య రీతిలో మ్యాచ్‌లు మలుపు తిరుగుతూ చివరి రెండు నిమిషాల్లోనే మ్యాచ్ 27-27తో డ్రాగా ముగిసింది. ఈ వ్యవధిలో ఓటమి నుంచి గటెక్కడానికి ఇరుజట్లు ప్రయత్నించాయి. గడిచిన 15 రోజుల్లో ఇది నాలుగో డ్రా కావడం విశేషం. హర్యానా జట్టు ఈ విధంగా రెండో మ్యాచ్ డ్రా చేసుకోవడం విశేషం.ఇరుజట్లు రైడింగ్‌ల్లో 12 టాకిల్ పాయింట్లలో 10తో సమ ఉజ్జీలుగా నిలిచాయి. ఓ సారి ప్రత్యర్థి జట్టును ఆలౌట్ చేయడంతో తమిళ్ జట్టు రెండు పాయింట్లను అదనంగా సాధించగా, దానికి ప్రతీగా ఎక్స్‌ట్రా పాయింట్లలో 3-1తో స్టీలర్స్ తడాఖా చూపారు. తొలి అర్ధభాగంలో హర్యానా తమిళ్ జట్టుపై 13-10తో ఆధిక్యంలో నిలిచింది.రెండో అర్ధభాగంలోను ఇరుజట్లు స్వల్ప పాయింట్ల తేడాతోను పోరు సాగించాయి.హర్యానా కెప్టెన్ నాడా ఏడు టాకిల్ పాయింట్లతోను, తలైవాస్ ఆల్‌రౌండర్ అమిత్ హుడా 6 పాయింట్లతో జట్టు హోరాహోరీ పోరుకు కారణం అయ్యారు.

జెయింట్స్ దూకుడు... టైటాన్స్ ఘోర ఓటమి

సొంతగడ్డపై వరుస విజయాలతో గుజరాత్ తన జైత్రయాత్రను నిరాటకంగా కొనసాగిస్తోంది. జోన్ ఎలో అగ్రస్థానంలో నిలిచిన ఆ జట్టు తెలుగు టైటాన్స్‌ను మరోసారి ఆల్‌రౌండ్ ప్రతిభతో 29-19తో మట్టి కరిపించింది. తొలి అర్ధ భాగంలోనే జెయింట్స్ టైటాన్స్‌పై 20-7తో భారీ పాయింట్ల తేడాతో దూసుకెళ్లింది.రెండో అర్ధభాగంలో తెలుగు జట్టు ఎంత ప్రయత్నించినా ఓటమి నుంచి తప్పించుకోలేకపోయింది.

నేటి మ్యాచ్‌లు

రాత్రి 8 గంటలకు దంబంగ్ ఢిల్లీ X తమిళ్ తలైవాస్

రాత్రి 9 గంటలకు గుజరాత్ ఫార్చ్యూన్‌జెయింట్స్ X బెంగాల్ వారియర్స్

రో'హిట్' కొట్టాడు

పదేళ్ల తర్వాత వైస్ కెప్టెన్సీ



న్యూఢిల్లీ: భారత స్టార్ బ్యాట్స్‌మెన్, ఆఫ్ బ్రేక్ బౌలర్ రోహిత్ శర్మకు అరుదైన గౌరవం దక్కింది. అంతర్జాతీయ క్రికెట్‌లో అడుగుపెట్టి పదేళ్ల పూర్తి అయిన తర్వాత వన్డే వైస్ కెప్టెన్సీ పగ్గాలను సెలక్షన్ కమిటీ అప్పగించింది. ఇటీవల శ్రీలంక టెస్ట్ జట్టులో చోటు దక్కని రోహిత్‌కు ఈ నెల 20 నుంచి జరిగే వన్డే సిరీస్‌కు ఎంపిక చేశారు. ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపిఎల్)లో ముంబయి ఇండియన్స్‌కు కెప్టెన్‌గా హ్యాట్రిక్ టైటిళ్లను అందించిన ఘనత రోహిత్‌దే .ఐసిసి ఛాంపియన్స్ ట్రోఫీలో ఓపెనర్‌గా రాణించిన తీరుతో సెలక్టర్లు అతనికి వైస్ కెప్టెన్సీ పగ్గాలను అప్పగించినట్లు తెలుస్తోంది. పల్లెకలెలో బుధవారం అతన్ని వైస్ కెప్టెన్సీ నియమించడంపై రోహిత్ హర్షం వ్యక్తం చేశాడు. నాకు దక్కిన ఈ గౌరవాన్ని నెలబెట్టుకుని జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించడంపైనే దృష్టి సారిస్తానని తెలిపాడు. మలింగను లంక సిరీస్‌లో ఎదుర్కొనేం దుకు సరికొత్త ప్రణాళికను రచించను న్నట్లు తెలిపాడు. మూడు ఫార్మాట్లలోనే కెప్టెన్ విరాట్ కోహ్లి తనదైన శైలిలో భారాన్ని మోస్తున్న తరుణంలో వైస్ కెప్టెన్సీ పగ్గాలు రోహిత్‌కు అప్పగించడం ద్వారా భవిష్యత్‌లో విరాట్ అందుబాటులో లేని సమయంలో శర్మే కెప్టెన్‌గా వ్యవహరించడా నికి మార్గాలు ఏర్పడ్డాయి. శ్రీ లంక సిరీస్‌కు విరాట్‌ను విశ్రాంతినివ్వాలని సెలక్టర్లు యోచించి రోహిత్‌కు కెప్టెన్సీ పగ్గాలు అప్పగించే విషయమై చర్చకు దారి తీసి కొత్త పాత్రకు జీవం పోశారు.

లంకపై సత్తా చాటేనా..

2014-15 సీజన్‌లో శ్రీలంకపై 264 పరుగులతో ప్రపంచ రికార్డు నెలకొల్పి తన క్రీడా స్ఫూర్తిని చాటుకున్నాడు. 2007 జూన్ 23న ఐర్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో వన్డే క్రికెట్‌లో అరంగ్రేటం చేశాడు. 158 వన్డేల్లో 5,435 పరుగులను శర్మ చేశాడు. 31 అర్ధ సెంచరీలు, 11 సెంచరీలతో సత్తా చాటాడు. వన్డేల్లో సగటు 42.26కాగా స్ట్రైక్‌రేట్ 84.65 కలిగి ఉన్నాడు.

బిసిసిఐ ఆఫీస్ బేరర్లను తొలగించండి

సుప్రీంకు నివేదించిన పాలకుల కమిటీ



న్యూఢిల్లీ: లోధా కమిటి సిఫార్సుల అమలులో విఫలం అయిన బిసిసిఐ ఆఫీస్ బేరర్లను తొలగించాలని బిసిసిఐ పాలకుల కమిటీ సుప్రీంకోర్టుకు నివేదించింది. ఈ మేరకు లోథాపై వచ్చిన వివిధ సమస్యల పరిష్కారానికి సంబంధించిన ఐదో రిపోర్టును పాలకుల కమిటీ వినోద్ ఖన్నా, ఎదుల్జిలు సమర్పించారు. ఇందులో ప్రముఖంగా బిసిసిఐ తాత్కాలిక అధ్యక్షుడు సికె ఖన్నా, కార్యదర్శి అమితాబ్ చౌదరీ,ట్రెజరర్ అనిరుధ్ చౌదరీలను తొలగించాలని కోరడం చర్చనీయాంశమైంది. ఎన్నికల నిర్వహించే వరకు ఆ బాధ్యతలను తమకు, బిసిసిఐ సీఈవో రాహుల్ జోహ్రీకి అప్పగించాలని కోరింది. గతంలో వేటుకు గురైన బిసిసిఐ అధ్యక్షుడు అనురాగ్ ఠాకూర్, కార్యదర్శి అజయ్ షిర్కేల మాదిరిగా గత ఆరు నెలలు నుంచి వీరు తీరు ఉన్నట్లు ఘాటుగానే 26 పేజిలతో కూడిన నివేదికలో పాలకుల కమిటీ పేర్కొంది. వీరంతా సంస్కరణలు అమలు చేసే పరిస్థితిలో ఏ మాత్రం లేరని వివరించినట్లు తెల్సింది.



దుబాయ్‌లో ధోనీ క్రికెట్ అకాడమీ

న్యూఢిల్లీ: భారత మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ దుబాయ్ త్వరలో క్రికెట్ అకాడమీని ప్రారంభించనున్నాడు. 2019 వరల్డ్‌కప్ జట్టులో చోటు దక్కుతుందో లేదో చూసుకుని ఆ తర్వాత దీనికి ముహర్తం ఖరారు చేసుకునే అవకాశం ఉంది.

వికెట్ కీపర్‌గా,హిట్టింగ్ బ్యాట్స్‌మెన్ తనకుంటూ ప్రత్యేక గుర్తింపు పొందిన ధోనీ ఇటీవల కాలంలో భారత్ ఒంటి చేత్తో గెలిపించే మ్యాచ్‌లు లేకపోవడంతో అతని రిటైర్ కావాలన్న డిమాండ్ వినవస్తోంది. శ్రీలంకలో వన్డే సిరీస్‌లో సత్తా చాటకపోతే ప్రత్నామ్నాయం చూస్తామన్న చీఫ్ సెలక్టర్ ఎంఎస్కే ప్రకటన ఇప్పటికే ధోనీ అభిమానుల్లో ఆగ్రహావేశాలు వ్యక్తం అయిన విషయం తెల్సిందే. దుబాయ్ పసిఫిక్ స్పోర్ట్స్ క్లబ్(పీఎస్‌సీ)తో కలిసి దుబాయ్‌లోని ఈ క్రికెట్ అకాడమీని ప్రారంభించనున్నట్లు గల్ఫ్ న్యూస్ వెల్లడించింది. యువరాజ్ సింగ్, హర్భజన్‌సింగ్, వీరేంద్ర సెహ్వాగ్ బాటలోనే ఎంస్ ఇక నడవనున్నాడు. ఈ కొత్త అకాడమీకి ధోనీ పేరే పెట్టనున్నట్లు పీఎస్‌సీ ప్రతినిధి పర్వేజ్ ఖాన్ తెలిపాడు. ధోనీతో కలిసి పనిచేయడం ఎంతో ఆనందంగా ఉందని ఆయన తెలిపారు. అకాడమీ పనుల నిమిత్తం ధోనీ సెప్టెంబర్‌లో దుబాయ్‌కు వెళ్లే అవకాశం ఉంది.



వేరుశనగపై ఆశలు వదులుకున్నట్లే

- పత్యామ్నాయ పంటలే దిక్కు
- 'సీమ'ను వదలని వర్షాభావం
- భారీగా తగ్గనున్న నూనెగింజలు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

ఖరీఫ్‌లో ఆగస్టు రెండోవారం ముగిసినా రాయల సీమలో సరైన వానలు కురవకపోవడంతో ఈ సంవత్సరం రాష్ట్రంలో నూనెగింజల సాగుపై ఆశలు ఆవిరయ్యాయి. ముఖ్యంగా వేరుశనగ సాగు ఇక లేనట్లేనని ప్రభుత్వం తేల్చేసింది. వేరుశనగకు అదను దాటిపోయిందని, ఇప్పుడు వర్షం పడినా రైతులు పంట సాగు చేసే అవకాశం లేదని నిర్ధారించింది. ప్రత్యామ్నాయ పంటలే దిక్కని సూచిస్తోంది. వేరుశనగకు బదులుగా కందులు, కొర్రలు, ఉలవలు, ఆముదాలు తదితరాలను రైతులు వేసుకోవాలని శాస్త్రవేత్తలు సైతం పేర్కొంటున్నారు. రెండు వారాల క్రితం వర్షాభావ పరిస్థితులపై సమీక్షించిన ముఖ్యమంత్రి చంద్రబాబు వేరుశనగకు ఆగస్టు రెండో వారం వరకు సమయం ఉందని, అప్పటికీ వర్షాల్లేకపోతే ప్రత్యామ్నాయ పటలు సాగు చేయాలని సలహా ఇచ్చారు. సిఎం చెప్పినట్లు ఆగస్టు రెండోవారం దాటిపోయినా అనంతపురం, కర్నూలు, కడప జిల్లాల్లో వర్షాలు పడలేదు. చిత్తూరులోని కొన్ని మండలాల్లో ఒక మోస్తరుగా వర్షాలు కురిసినా అదను తప్పడంతో వేరుశనగ సాగుకు ఏ మాత్రం ఉపయోగం లేదు. జూన్, జులైలో వేసిన పంటలకు కొంత వరకు ఉపయోగపడుతుందంతే. కొత్తగా విత్తడానికి అవకాశం లేదు. దీంతో ఈ ఏడాది వేరుశనగ సాగు ఎన్నడూలేనంతగా క్షీణిస్తున్నట్లు వ్యవసాయశాఖ అంతర్గతంగా అంచనా వేసింది. నూనెగింజల్లో మిగతా పొద్దుతిరుగుడు, ఆముదాల సాగు రాయలసీమలోనే ఎక్కువ. వర్షాభావంతో వాటి సేద్యం కూడా బాగా తగ్గింది. నువ్వులు అధికంగా సాగుచేస్తున్న విజయనగరం, ప్రకాశం, విశాఖపట్నం, గుంటూరుల్లోనూ వర్షాభావ ప్రభావంతో సాగు దిగజారింది. ఏపీలో సోయాచిక్కుడు నామయాత్రం. ఏతావాతా ఈ ఖరీఫ్‌లో నూనెగింజల సాగులో భారీ లోటు ఉండబోతోంది. ఖరీఫ్‌లో మొత్తం నూనెగింజల సాధారణ సాగు విస్తీర్ణం 10.05 లక్షల హెక్టార్లు కాగా దానిలో వేరుశనగ విస్తీర్ణం 9.10 లక్షల హెక్టార్లు. మిగతా పంటల వాటా లక్ష హెక్టార్లలోపే.

'సీమ'లో వేరుశనగ సాగు (లక్షల హెక్టార్లలో)

జిల్లా	సాధారణ సాగు విస్తీర్ణం	ఆగస్టు 16కు సాగైంది	సాగు శాతం
అనంతపురం	6.04	2.53	42
చిత్తూరు	1.29	1.06	82
కర్నూలు	1.10	0.70	64
కడప	0.36	0.21	59

'ఎడారి' జిల్లాలోనే

వేరుశనగ సాగులో సింహ భాగం ఎడారి జిల్లా అనంతపురం లోనే ఉంది. ఈ ఏడాది జూన్ రెండు, మూడు వారాల్లో అనంతపు రంలో ఒక మోస్తరు వర్షాలు కురిశాయి. జులై నుంచి వానలు వెనకపట్టుపట్టాయి. జిల్లాలో 63 మండలాలుండగా ప్రస్తుతం 37 మండలాల్లో వర్షాభావం ఉంది. దీంతో అనంతలో ఆరు లక్షల హెక్టార్లలో వేరుశనగ వేయాల్సి ఉండగా ఆగస్టు 16 నాటికి 2.53 లక్షల హెక్టార్లలో (42 శాతం) వేశారు. జూన్‌లో తొలకరి వానలకు వేసిన పంట, జులైలో సాగైన పంట తీవ్ర నీటి సమస్య ఎదుర్కొంటోంది. కొన్ని చోట్ల ఎండుతోంది. చిత్తూరులో ఈ రెండు మూడు రోజుల నుంచి పడుతున్న వర్షాలు కొన్ని మండలాల్లో వేరుశనగకు ఊపిరి పోశాయి. అయినప్పటికీ ఇంకా జిల్లాలో 24 మండలాల్లో వర్షాభావం ఉంది. కర్నూలులోని పశ్చిమ ప్రాంతంలో వేరుశనగ పంట నీటి కొరత ఎందుర్కొంటోంది. ఆ జిల్లాలో 34 మండలాల్లో వర్షాభావం ఉంది. కడపలో 23 మండలాల్లో వర్షాభావం నెలకొంది. దీంతో ఆయా జిల్లాల్లో వేరుశనగ సాగు కాలేదు. సాగైన పంట సైతం ఎండుతోంది.



సమావేశంలో మాట్లాడుతున్న బిల్డింగ్, అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ నాయకులు

28 నుంచి సిడబ్ల్యూఎఫ్ఐ అఖిల భారత సమావేశాలు

- భవన నిర్మాణ కార్మికుల చట్టాల అమలు కోసం ఉద్యమ కార్యాచరణ
- ఎపి బిల్డింగ్, అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ వెల్లడి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (సిడబ్ల్యూఎఫ్ఐ) అఖిల భారత వర్కింగ్ కమిటీ సమావేశాలు ఈ నెల 28 నుంచి 31 వరకు విజయవాడలో నిర్వహించనున్నట్లు ఎపి బిల్డింగ్, అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు వి ఉమామహేశ్వరరావు తెలిపారు. విజయవాడలోని ఎంబి విజ్ఞాన కేంద్రంలో బుధవారం విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల చట్టాల్ని సక్రమంగా అమలు చేయాలని కోరుతూ ఉద్యమ కార్యాచరణను కమిటీ సమావేశాల్లో ప్రకటించనున్నట్లు తెలిపారు. దేశంలో భవన నిర్మాణ కార్మికుల కోసం చేపట్టాల్సిన కార్యక్రమాలెన్నో ఉన్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. చట్టాల్ని సక్రమంగా అమలు చేయాలని, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి వసూలు చేసిన నిధుల్ని వారి కోసమే వినియోగించాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ నిధుల్ని ఉద్దానం బాధితులకు మళ్లించారన్నారు. అలా నిధుల్ని దారి మళ్లించడం చట్ట వ్యతిరేకమంటూ గతంలో సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. గతంలో కార్మిక శాఖా మంత్రి ఇచ్చిన హామీలు కూడా అమలుకావడం లేదన్నారు. జిఎస్టీ దెబ్బతో భవన నిర్మాణ రంగం తీవ్ర సంక్షోభంలో పడిందని, నిర్మాణ కార్మికులకు పనులు లేకుండా పోతున్నాయన్నారు. కార్మికుల కోసం ప్రవేశపెట్టిన గృహకల్ప పథకాన్ని కూడా సక్రమంగా అమలు చేయడం లేదన్నారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యలన్నింటిపైనా కమిటీ సమావేశాల్లో చర్చిస్తామన్నారు. సమావేశంలో ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లి నరసింహారావు, రాష్ట్ర కార్యదర్శి ఆర్‌వి నరసింహారావు, కృష్ణా జిల్లా అధ్యక్షులు పి అప్పారావు, కార్యదర్శి కె గోపాలరావు, కృష్ణా జిల్లా సిఐటియు అధ్యక్షులు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నంద్యాలలో జనసేన తటస్థం

పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

నంద్యాల ఉప ఎన్నిక, కాకినాడ నగర పాలక సంస్థ ఎన్నికల్లో తటస్థంగా ఉంటామని జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ ప్రకటించారు. ఈ మేరకు పార్టీ కార్యాలయం బుధవారం ఒక ప్రకటన, వీడియో విడుదల చేసింది. నంద్యాలలో జరుగుతున్నవి సాధారణ ఎన్నికల కానందున తటస్థంగానే ఉండాలని నిర్ణయించామని, దీనిపై తమ పార్టీ నాయకుల అభిప్రాయాలూ తీసుకున్నామని తెలిపారు. క్షేత్రస్థాయిలో పార్టీ నిర్మాణం జరిగాక ఎన్నికల్లో పోటీచేస్తామన్నారు. 2019 వరకు ఎన్నికలకు దూరంగా ఉంటాయమన్నారు. తమకు మద్దతివ్వాలంటూ పిసిసి అధ్యక్షులు రఘువీరారెడ్డి లేఖ రాశారని, అలాగే పార్టీ కార్యకర్తలు కూడా తమను సంప్రదిస్తున్నారని, ఈ నేపథ్యంలో రాయలసీమ, నంద్యాల, కర్నూలు పార్టీ నాయకుల అభిప్రాయం మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. ఇక ముందు ఏ విషయమైనా పార్టీ పరంగా నిర్ణయం తీసుకుంటే మీడియా ముఖంగా వెల్లడిస్తామన్నారు. ఒకవేళ ఎవరైనా జనసేన మద్దతిస్తుందని ప్రచారం చేసుకుంటే అది అపోహ మాత్రమేనని ఆయన స్పష్టం చేశారు. విజయవాడ వెళ్లిన సమయంలోనూ పలువురు నంద్యాల ఎన్నికలపై అడిగారని, అప్పుడు సందర్భం కాకపోవడంతో చెప్పలేదని పేర్కొన్నారు.

విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సమ్మె నోటీసు

- రెగ్యులరైజేషన్‌పై పోరాటం ఉధృతం
- మద్దతు తెలిపిన పలు సంఘాల నేతలు, పిడిఎఫ్ ఎమ్మెల్సీలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యుత్తు సంస్థల్లోని కాంట్రాక్టు కార్మికులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ యాజమాన్యానికి కార్మిక సంఘాలు బుధవారం నోటీసిచ్చాయి. సెప్టెంబరు 30 లోగా పరిష్కారం చూపని పక్షంలో సమ్మెకు దిగుతామని నోటీసులో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ధర్నా చౌక్‌లో నిర్వహించిన సభలో పిడిఎఫ్ ఎమ్మెల్సీ, కార్మిక సంఘాల నేతలు, విద్యుత్తు శాఖలోని వివిధ సంఘాల నేతలు పాల్గొని కాంట్రాక్టు కార్మికులకు మద్దతు తెలిపారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీల ఫ్లోర్ లీడర్ విఠపు బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని శాఖల్లో కాంట్రాక్టు కార్మికుల రెగ్యులరైజేషన్ సమస్యగా ఉందన్నారు. ఇందుకు సుప్రీం కోర్టు తీర్పును సాకుగా చూపి ప్రభుత్వం తప్పించుకోవాలని ప్రయత్నిస్తోందన్నారు. ప్రపంచ బ్యాంకు పాఠాలు నేర్చుకుని ప్రభుత్వం ఇటువంటి చర్యలకు పాల్పడుతోందన్నారు. విద్యుత్తు రంగంలో ప్రభుత్వ సంస్థలను నిర్వీర్యం చేసి, ప్రైవేటు సంస్థలను ప్రోత్సహించడం ద్వారా కార్మికుల పొట్టకొడుతోందన్నారు. ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 70 ఏళ్ళయినా అప్పటి హామీలైన సంపద పంపిణీ, ఆర్థిక, సామాజిక, రాజకీయ సమానత్వం నేటికీ సాధ్యం కాలేదన్నారు. విద్యుత్తు కాంట్రాక్టు కార్మికుల సమస్యలను మండలి సమావేశాల్లో లేవనెత్తుతామన్నారు. కార్మికుల పోరాటానికి సంపూర్ణ మద్దతును ప్రకటించారు. సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఎం.ఎ గఫూర్ మాట్లాడుతూ విద్యుత్తు సంస్థల్లో ప్రతి ఏటా 40 మంది కార్మికులు ప్రమాదాల కారణంగా మరణిస్తున్నారన్నారు. కొన్ని చోట్ల ఎమ్మెల్యేలకు నచ్చలేదని అకారణంగా పని నుంచి తొలగించిన సంఘటనలు కూడా ఉన్నాయన్నారు. పొరుగు రాష్ట్రాలైన తమిళనాడు, తెలంగాణాల్లో విద్యుత్తు సంస్థల్లోని కాంట్రాక్టు కార్మికులను రెగ్యులరైజ్ చేస్తే ఇక్కడి ప్రభుత్వం మాత్రం స్పందించడం లేదన్నారు. చట్ట ప్రకారం ఏడాదికి 240 రోజులు ఏదైనా సంస్థలో పనిచేస్తే వారిని రెగ్యులరైజ్ చేయాలన్నారు. విద్యుత్తు కాంట్రాక్టు కార్మికులకు సిఐటియులోని అన్ని సంఘాల మద్దతు ఉంటుందన్నారు. వైఎస్ఆర్‌టియు రాష్ట్ర అధ్యక్షులు గౌతంరెడ్డి మాట్లాడుతూ గతంలోనూ ఒకసారి సమ్మెకు చేశామని, అప్పటి అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఐక్యతతో ముందుకెళ్ళాలన్నారు. ఎన్నికల ముందు కార్మికులకు చంద్రబాబు 42 వాగ్దానాలిచ్చారని, వీటిలో ఏ ఒక్కటీ అమలు చేయలేదన్నారు. కార్మిక శాఖ మంత్రిగా ఉన్నప్పుడు అచ్చన్నాయుడు బీమా సొమ్మును కాజేశారన్నారు. గత అసెంబ్లీ సమావేశాల్లో ప్రతిపక్షనేత జగన్మోహనరెడ్డి విద్యుత్తు కార్మికుల సమస్య లేవనెత్తినప్పుడు రాష్ట్రంలో అన్ని శాఖల్లో కేవలం 15వేల మందే కాంట్రాక్టు కార్మికులున్నారని ప్రభుత్వం సమాధానం ఇచ్చిందన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సిఐటియు నాయకులు బాలకాశీ మాట్లాడుతూ గత ఎన్నికల్లో కాంట్రాక్టు కార్మికులను రెగ్యులరైజ్ చేస్తామని హామీ ఇచ్చారన్నారు. మూడేళ్ళు ప్రభుత్వానికి గడువు ఇచ్చామని, రెగ్యులరైజ్ చేయకపోగా విద్యుత్తు సంస్థల్లో కాంట్రాక్టు కార్మికులే లేరని మంత్రివర్గ ఉపసంఘంలో చెప్పించారన్నారు. 25 వేల మంది కాంట్రాక్టు కార్మికులు కనీస వేతనాల్లేక, తమ కుటుంబాలను పోషించుకోలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు సూరిబాబు మాట్లాడుతూ పవర్ జెఎసి నాయకులు కాంట్రాక్టు కార్మికుల్ని మభ్యపెడుతూ వారి పబ్బం గడుపుకుంటున్నారని విమర్శించారు. గతంలో ఏడు వేల మంది కాంట్రాక్టు కార్మికులను రెగ్యులరైజ్ చేయించిన ఘనత సిఐటియుదేనన్నారు. తొలుత వేలాది మంది కాంట్రాక్టు కార్మికులు నల్ల దుస్తులు ధరించి తుమ్మలపల్లి కళా క్షేత్రం నుంచి ధర్నా చౌక్ వరకూ భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఎం.ఏసోబు, వి.సుబ్బిరెడ్డి, ఎం.శ్రీనివాసులు సభకు అధ్యక్షత వహించిన వారిలో ఉన్నారు. ఎఐటియుసి ఉపప్రధాన కార్యదర్శి ఆర్.రవీంద్రనాథ్, విద్యుత్తు సంస్థల్లోని వివిధ సంఘాల నాయకులు పి.వెంకటేశ్వరరావు, ఎల్.రామకృష్ణ తదితరులు ప్రసంగించారు. జల్లెడ రాజశేఖర్, బి.వి సురేష్, బాబి, వెంకటేశ్వరరావు, సుబ్రమణ్యరాజు, అప్పారావు, కామేశ్వరరావు, ఖరీముల్లా, సుబానీ సాహెబ్, నాగబ్రహ్మాచారి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర పర్యాటకంపై మంగోలియా ఆసక్తి

సిఎంతో మంగోలియా రాయబారి భేటీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో మంగోలియా భారత రాయబారి డాక్టర్ టి సురేశ్ బాబు బుధవారం అమరావతిలో భేటీ అయ్యారు. పర్యాటక రంగంలో ఆంధ్రప్రదేశ్‌తో కలిసి పనిచేసేందుకు మంగోలియా ఆసక్తి కనబరుస్తున్నట్టు సిఎంకు వివరించారు. దీని కోసం ఆ దేశం రూపొందించిన ప్రతిపాదనలను సురేశ్ బాబు సిఎంకు అందజేశారు. పచ్చదనం, సుందర ప్రదేశాలకు మంగోలియా నిలయమని, సినిమా షూటింగ్‌లకు అనువైన దేశమని తెలిపారు. మంగోలియా జనాభాలో 80 శాతం ప్రజలు బుద్ధిజాన్ని ఆదరిస్తారని, అందువల్లే అమరావతితో స్నేహ సంబంధాల్ని పెంపొందించుకోవాలని ఆ దేశ వాసులు కోరుకుంటున్నారన్నారు. మైనింగ్ రంగంలో కూడా అపార అవకాశాలున్నాయని, చైనా కంటే భారత దేశంపట్ల మంగోలియన్లు ఆదరాభిమానాల్ని కనబరుస్తున్నారన్నారు. మంగోలియాను ఒక పర్యాయం సందర్శించాలని ఈ సందర్భంగా సిఎంను కోరారు. దీనికి సిఎం స్పందిస్తూ త్వరలో ఇడిబి బృందాన్ని మంగోలియాకు పంపుతామన్నారు. అక్కడ ఏయే రంగాల్లో అవకాశాలున్నాయనే అంశాల్ని వారు పరిశీలించాక మంగోలియా సందర్శిస్తానని సిఎం హామీ ఇచ్చారు.

Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governarpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68